


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 68

గురువారం 23-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




మళ్లీ కొత్తగా మొదలు

నేటి నుంచి భారత్, ఆసీస్ టీ20 సిరీస్.. విశాఖలో తొలి పోరు - 12లో



బ్యాంకింగ్ స్థిరత్వమే లక్ష్యం

వ్యక్తిగత రుణ నిబంధనల కఠినతరంపై ఆర్‌బీఐ గవర్నర్ - 13లో



కాల్పులకు విరామం

ఇజ్రాయెల్ నాలుగు రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించగా.. హమాస్ 50 మంది బందీలను విడిచిపెట్టనుంది.

వివరాలు 6లో ▸



నిజం మాట్లాడితే అంతే..

'కాంగ్రెస్ కుటుంబం ముందు ఎవరైనా నిజం మాట్లాడితే నిర్దాక్షిణ్యంగా పార్టీ నుంచి బహిష్కరిస్తారు' అని ప్రధాని మోదీ విమర్శించారు.


వివరాలు 6లో ▸



తుది దశకు రెస్క్యూ ఆపరేషన్

ఉత్తరాఖండ్‌లోని సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులను సురక్షితంగా బయటకు తెచ్చే డ్రిల్లింగ్ పనులు తుది దశకు చేరాయి.

వివరాలు 6లో ▸



సరిహద్దుల్లో ఉగ్రకాల్పులు

జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు కెప్టెన్‌లు, ఒక హవాల్దార్, ఒక జవాను వీరమరణం పొందారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

ఇంత 'పచ్చ'పాతమా రామోజీ..!?

చంద్రబాబుకు ఈడీ నోటీసులు ఇచ్చినపుడు ఎందుకు రాయలేదు?

స్కిల్ స్కామ్‌లో బాబు ముఠాను ఈడీ అరెస్ట్ చేసినపుడూ కిమ్మనలేదు

బైజూస్ రవీంద్రన్‌కు ఈడీ నోటీసులు ఇస్తే మాత్రం హడావుడి చేస్తారా?

పరోక్షంగా ప్రభుత్వంపై బురద జల్లాలనేగా మీ రాతల ఉద్దేశం

- వివరాలు 3లో

కొల్లగొట్టి పాటి!

ఉమ్మడి ప్రకాశంలో క్వారీలు మింగేసిన గొట్టిపాటి రవి

ప్రలోభాలతో టీడీపీలోకి ఫిరాయింపు యథేచ్ఛగా అక్రమ మైనింగ్

2014లో గొట్టిపాటి రవి సైకిల్ ఎక్కిందే అందుకు..

అక్రమాలపై గనుల శాఖ ఉక్కుపాదం.. ఇతర జిల్లాల్లోనూ తనిఖీలు

రాజ్యహింస అంటూ రామోజీ శివాలు

- వివరాలు 10లో

అప్పుడే.. అనుసంధానం!

సాక్షి, అమరావతి: గోదావరి నదిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చి.. తమ రాష్ట్ర హక్కులను పరిరక్షించాకే కావేరికి గోదావరి నీటిని తరలించాలని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ)కు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తేల్చిచెప్పింది. గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా కర్ణాటకలో బెడ్తి–వరద నదుల అనుసంధానం చేపట్టనున్న తరహాలోనే రాష్ట్రంలోనూ నదుల అనుసంధానాన్ని చేపట్టాలని కోరింది. ఈ అంశంపై చర్చించడానికి విజయవాడలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ చేసిన సూచనకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన ఎన్‌డబ్ల్యూడీఏ 72వ పాలకమండలి సమావేశం వర్చువల్ విధానంలో బుధవారం జరిగింది. ఇందులో ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్, సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరాతోపాటు అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రం తరపున అంతర్ రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులో సాగు, తాగునీటి కొరతను అధిగమించే లక్ష్యంతో చేపట్టనున్న గోదావరి–కావేరి అనుసంధానానికి అంగీకరిస్తూ అవగాహన ఒప్పందం(ఎంవోయూ)పై సంతకాలు చేస్తే పనులు ప్రారంభిస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ బేసిన్ పరిధిలోని రాష్ట్రాలకు సూచించారు.

ఇంతంజాక్



తనకే ఓటేస్తానని ఎంత చెప్పినా వినట్లేదు! ఓట్టేయించుకుంటున్నాడు



నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

బడుగుల విజయ నినాదం

సామాజిక సాధికార బస్సు యాత్రలకు వెల్లువెత్తుతున్న ప్రజలు

ఒంగోలు, విశాఖ దక్షిణ, బనగానపల్లెలో అడుగడుగునా బ్రహ్మరథం

వేలాదిగా పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

బైక్‌లతో యువత ర్యాలీలు.. జనసంద్రాలను తలపించిన సభా ప్రాంగణాలు

సీఎం జగన్ అండతో ఎదిగిన తీరును వివరించిన బడుగు, బలహీన వర్గాలు

మళ్లీ జగనే సీఎం కావాలి అంటూ నినదించిన ప్రజలు

2లో

ఒంగోలు, విశాఖ దక్షిణ, బనగానపల్లెలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వారు హాజరై తాము సాధించిన సామాజిక సాధికారతను చాటి చెప్పారు. బడుగులను చంద్రబాబు దారుణంగా అవమానిస్తే.. సీఎం జగన్ చేయి పట్టుకొని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్ అండతో తాము సమాజంలో ఎదిగిన తీరును, తలెత్తుకొని తిరగగలుగుతున్న వైనాన్ని తెలియజేశారు.

పేదరిక నిర్మూలనలో ఆదర్శంగా ఏపీ

పొదుపు సంఘాల పునరుజ్జీవం.. మహిళా సాధికారతలో ముందంజ

10లో

ఆంధ్రప్రదేశ్‌లో సంఘాల పనితీరు బాగుందని గుజరాత్ బృందం ప్రశంసలు

మహిళలు స్థిరమైన శాశ్వత ఆదాయాలు పెంచుకోవడంపై బృందం పరిశీలన

చుక్కల భూములపై మరింత స్పష్టత

చుక్కల భూములపై ఆంక్షల తొలగింపునకు సంబంధించి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత స్పష్టత ఇచ్చింది. ఏ తరహా భూములను ఏ కేటగిరీలో చేర్చాలో మరోసారి మార్గనిర్దేశం చేస్తూ భూ పరిపాలన శాఖ ఒక మెమో జారీ చేసింది.

3లో

విలువల నిలయాలు.. సత్యసాయి విద్యాసంస్థలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఘనంగా శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం
- కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జస్టిస్ నజీర్

14లో



విద్యార్థికి పట్టా అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. చిత్రంలో గవర్నర్ జస్టిస్ నజీర్

పాపం.. తెలుగు బీజేపీ!

టీడీపీని బతికించడమే అజెండాగా అడుగులు

- పోలీసులను కొట్టిన కేసులో టీడీపీ నేత బీటెక్ రవి అరెస్ట్
- రెండు గంటల్లోనే మేజిస్ట్రేట్ ఎదుట హాజరు
- పోలీసులు కొట్టి ఉంటే మేజిస్ట్రేట్‌కు ఎందుకు చెప్పలేదు?
- టీడీపీ నేతను అరెస్ట్ చేస్తే బీజేపీ నేత సీఎం రమేశ్ పరామర్శా!
- వైఎస్సార్ జిల్లాలో టీడీపీకి పెద్ద దిక్కుగా మారిన సీఎం రమేశ్
- రవిని కొట్టారని, బెదిరించారని



దుష్ప్రచారం ఎవరి కోసం?

- వైఎస్సార్ జిల్లాలో టీడీపీకి ఈయనే పెద్ద దిక్కు.. చంద్రబాబు పన్నాగంతోనే మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం

3లో

ఇంటి తోట .. ఆనందాల పంట

పెరుగుతున్న టెర్రస్ గార్డెన్‌లు, ఇంటితోటలు

- ఉమ్మడి జిల్లాల్లో 1,000కి పైగా ఇళ్లపై నందనవనాలు
- జీవన శైలీని మార్చుకుంటున్న నగర, పట్టణ వాసులు
- కరోనా తర్వాత కర్నూలుతో సహా పలు పట్టణాల్లో టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి
- రసాయన రహితంగా పండ్లు, పూలు, కూరగాయలు, ఆకు కూరల పెంపకం

నగరవాసుల జీవనశైలీ మారుతోంది. ప్రకృతి అందాలపై ఆసక్తి పెరుగుతోంది. బయటికి వెలితే వాయు, శబ్దకాలుష్యంతో సతమతమవుతున్న తరుణంలో ఇంటి ఆవరణ, ఇంటిపైనే.. అవకాశం ఉన్న ప్రతి చోటా మొక్కలు పెంచుతూ.. ప్రకృతి అందాలను, ఆనందాలను సృష్టించుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు హైదరాబాద్ వంటి నగరాలకు పరిమితమైన ఇంటి పంట, టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి కరోనా సమయం నుంచి జిల్లాలకు విస్తరించింది.

కర్నూలు(అగ్రికల్చర్): నగరానికి పరిమితమైన టెర్రస్ గార్డెన్, పెరటితోటలు, ఇంటి పంటల అభివృద్ధి ఇపుడు వివిధ పట్టణాలకు కూడా విస్తరిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,000కి పైగా కుటుంబాలు టెర్రస్ గార్డెన్, ఇంటి పంట, పెరటితోటలు అభివృద్ధి చేసుకుని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో పెరటితోటల అభివృద్ధికి స్థలాల కొరత ఉంటోంది. దీంతో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి ద్వారా పచ్చదనం అభివృద్ధి చేసుకుంటున్నారు. ఉద్యమ తరహాలో ఇంటిపైనే నందనవనాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ప్లాస్టిక్ టబ్బులు, పాత బకెట్‌లు, సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు తదితర వాటితో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకుంటున్నారు. మార్కెట్లలో లభించే కూరగాయలు, ఆకుకూరలకూ కెమికల్స్ వినియోగిస్తుండటంతో నగర, పట్టణ ప్రజల ఆలోచన విధానంలో మార్పులు వచ్చాయి. ఇంటిపైనే అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్ల మొక్కలతో గార్డెన్ అభివృద్ధి చేసుకుంటున్నారు.

టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధిపై అతివల ఆసక్తి

కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, బనగానపల్లె, డోన్ తదితర పట్టణాల్లో మహిళలు టెర్రస్ గార్డెన్, ఇంటిపంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి, వాటిల్లో పని చేయడం, నీళ్లు కట్టడం వంటి పనులతో కాలం గడుపుతున్నారు. దీంతో శరీరానికి తగిన వ్యాయామం కూడా లభిస్తోంది. తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు వినియోగిస్తూ ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. మొక్కలకు వర్మీకంపోస్ట్, చెరువు మట్టి, వేపచెక్క, వేపకషాయం వంటి వాటిని వినియోగిస్తున్నారు. చీడపీడలను వేప ఉత్పత్తులతో నివారించుకుంటున్నారు.

ఒకరికొకరు తోడుగా..

టెర్రస్ గార్డెన్లు ఉన్నవారందరు కలిసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులో ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటున్నారు.



ఇంటిపై కప్పపై కనువిందు చేస్తున్న గార్డెన్‌లు. (ఇన్‌సెట్‌లో) ఇంటిపైన పండించిన తాజా కూరగాయలు

పూలు, కూరగాయలు, పండ్ల మొక్కల్లో బాగ వచ్చినవి, పండిన వాటి వివరాలను గ్రూపుల్లో పోస్టు చేస్తూ అందరికి పంచుతూ... ఆనందం పొందుతున్నారు. కర్నూలు నగరంలో దాదాపు 500 మంది, ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాల్లో మరో 500 మంది టెర్రస్ గార్డెనింగ్‌లో రాణిస్తున్నారు. కర్నూలు టెర్రస్ గార్డెనర్స్ వాట్సాప్ గ్రూపు, సిటీ టెర్రస్ గార్డెనర్స్ గ్రూపులు ప్రాచుర్యంలో ఉన్నాయి. ప్రతి నెల లేదా 2 నెలలకోసారి వాట్సాప్ గ్రూపు సభ్యులు సమావేశమై టెర్రస్ గార్డెన్ అభివృద్ధితోపాటు కొత్త మొక్కలు తెప్పించడం, చీడ, పీడలు, వాటి నివారణ తదితర వాటిపై చర్చిస్తారు.





కల్లూరు మండలం పెద్దటేకూరుకు చెందిన తోట హరికృష్ణ కొన్నేళ్లుగా వర్మీకంపోస్టు ఎరువు తయారీలో రాణిస్తున్నారు. ప్రకృతి పట్ల అపారమైన అభిమానమున్న ఈయన కర్నూలులో టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధికి పాటుపడుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలను కలుస్తూ సాంకేతిక పరిజ్ఞానం పెంచుకొని టెర్రస్ గార్డెనింగ్‌లో రాణిస్తున్న వారికి కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇంటిపైన తోటల అభివృద్ధికి ముందుకు వచ్చే వారికి అవసరమైన మట్టి, కోకోపీట్, వర్మీకంపోస్ట్, వేపపిండి, వేప చెక్క, చీడపీడల నివారణకు అవసరమైన కషాయాలు సరఫరా చేస్తున్నారు. నెలకోసారి టెర్రస్ గార్డెనర్లు సమావేశమై చర్చించుకొని మరింత అద్భుతంగా రాణించేందుకు దోహదపడుతున్నారు.



పూలను చూపుతున్న ఈ మహిళ పేరు సుష్మ. లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త షరాఫ్ బజారులో జ్యువెలరీ మేకర్‌గా పని చేస్తున్నారు. ఇంటి పైన 150 వెరైటీలతో పండ్లు, కూరగాయలు, తీగజాతి కూరగాలు, ఆకు కూరలు, పూలు, ఔషధ మొక్కలు పెంచుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా టెర్రస్ గార్డెన్‌లో పనిచేస్తారు. ఆదివారం మొత్తం టెర్రస్‌పై గార్డెన్ అభివృద్ధికే కేటాయిస్తున్నారు. రెండేళ్ల క్రితం టెర్రస్ గార్డెన్‌కు శ్రీకారం చుట్టగా ప్రస్తుతం వంటకు అవసరమైన అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు పండుతున్నాయని, అలాగే మానసిక ఆనందం కూడా పొందుతున్నానని సుష్మ వివరించారు.


మొక్కల మధ్య సేద తీరుతున్న ఈ మహిళ పేరు సుహాసిని. నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలోని అపార్టుమెంట్‌లో నివసిస్తున్నారు. ఎమ్మెస్సీ, బీఈడీ, పీహెచ్‌డీ చేసిన సుహాసిని.. రాయలసీమ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ స్థలంలోనే పలు రకాల మొక్కలతో పచ్చదనాన్ని అభివృద్ధి చేసుకున్నారు. మందార, గులాబీ, నూరువరహాలు, నాటు గులాబీ, సెంట్ గులాబీ, హైబ్రిడ్ గులాబీ, డబుల్ మల్లె, అనేక రకాల క్రోటన్స్, కోలియస్(రంగు, రంగుల ఆకులు), అగ్లోనిమా, బ్రోకన్‌హార్ట్, స్నేక్‌ప్లాంట్స్, తులసీలు, రేగు చెట్టు తదితర వాటితో గార్డెన్ అభివృద్ధి చేసుకున్నారు. విధి నిర్వహణలో ఒత్తిడికి గురైనపుడు మొక్కలకు సంబంధించిన పనులు చేయడం ఆనందాన్ని ఇస్తుందని ఆమె చెబుతోంది.



కొత్త, కొత్త రకాలు..

రకరకాల మొక్కలు టెర్రస్ గార్డెన్‌లలో కనువిందు చేస్తున్నాయి. అనేక రకాల కూరగాయలు మొక్కలు, మల్లె, మందారం, గులాబిల్లో పదుల సంఖ్యలో రకాలు, రణపాల, అశ్వగంధ, నూరు వరహాలు, స్టార్‌ఫ్రూట్స్, మల్బరీ ఫ్రూట్స్, అంజూరు, డ్రాగన్ ఫ్రూట్స్, అడినియం ఇలా వందల రకాలతో టెర్రస్ గార్డెన్‌లు సాకారం అవుతున్నాయి. మొక్కలు ఏపుగా పెరుగడంతో పాటు అధిక ఫలసాయాన్ని ఇచ్చేందుకు కిచెన్ వ్యర్థాలను కంపోస్ట్ ఎరువులుగా మార్చి ఇస్తున్నారు. పశువుల ఎరువులు. వర్మీకంపోస్టు వంటి వాటిని వినియోగిస్తున్నారు. మొక్కలకు హాని చేసే పురుగులను చేతులతోనే ఏరివేస్తున్నారు.

మొక్కల పెంపకం నా హాబీ



మొక్కలు, తోటల పెంపకం నా హాబీ. అందుకే ఇంటిపైన 1,000 అడుగుల స్థలంలో వంద రకాల మొక్కలు పెంచాను. అందులో అడినియంలో 11, ఆల్ మండలో 5, మందారాల్లో 20, డ్రాగన్ ఫ్రూట్స్ 3, గులాబీల్లో 10, తులసి 5 రకాలతో పాటు రణపాల, అశ్వగంధ, దానిమ్మ, సపోట, మల్బరీ, నిమ్మ, జ్యూస్ నిమ్మ, స్వీట్ నిమ్మ మొక్కలతో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేస్తున్నాం. మొక్కలకు కిచెన్ వ్యర్థాలను ఎరువులుగా వేస్తున్నా.

– స్వర్ణలత, బనగానపల్లె



విశాఖలో బడుగుల విజయ నినాదం

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

- వేలాదిగా పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- భారీ యాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం


సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన చేయూత, పథకాలతో సాధికారత సాధించిన బడుగు, బలహీనవర్గాల ప్రజలు విశాఖ నగరంలో విజయ నినాదం చేశారు. వేల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు బుధవారం విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రను పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని డైమండ్ పార్క్ నుంచి టౌన్ కొత్త రోడ్డు వరకు జరిగిన ఈ భారీ యాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వందలాది మోటారు సైకిళ్లతో యువత బైక్ ర్యాలీ చేశారు. తీన్మార్ డప్పులు.. డీజేలు, జానపద నృత్యాలతో యాత్ర కోలాహలంగా జరిగింది. టౌన్ కొత్త రోడ్డు వద్ద జరిగిన బహిరంగ సభకు నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. రాష్ట్రాభివృద్ధికి, ముఖ్యంగా విశాఖ నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలను మంత్రులు వివరిస్తుంటే సభా ప్రాంగణమంతా జై జగన్ నినాదాలతో దద్దరిల్లింది.

కులగణన దేశానికే ఆదర్శం: స్పీకర్ తమ్మినేని

ప్రతి కులానికీ ప్రాధాన్యం కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని శాసన సభాపతి తమ్మినేని సీతారాం చెప్పారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రపై దేశంలో చర్చ మొదలైందని, ఇది శుభపరిణామమని అన్నారు. ఒక రాష్ట్రంలో ఇన్ని సామాజికవర్గాలకు సమాన హక్కులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో అన్ని సామాజికవర్గాలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, 700 మందికి డైరెక్టర్ల పదవులిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కిందని తమ్మినేని అన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌వి సాహసోపేత నిర్ణయాలు: ఎంపీ మోపిదేవి

ప్రతి పేదవాడినీ ఆర్థికంగా బలంగా నిలబెట్టేందుకు ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న ఏకైక సీఎం జగన్ మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ చెప్పారు. ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాదంపై వెంటనే స్పందించిన సీఎం జగన్.. బాధితులకు 80 శాతం సాయం చేస్తూ.. ధైర్యం అందించారని చెప్పారు. హుద్‌హుద్ తుపాను బాధితులకు పరిహారాన్ని అందించలేని దౌర్భాగ్యపు సీఎంగా చంద్రబాబు చరిత్రకెక్కారని ఎద్దేవా చేశారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర విలువ పెరుగుతుంది: మంత్రి సీదిరి అప్పలరాజు

రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ విశాఖ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా మారితే ఉత్తరాంధ్ర జిల్లాల యువతకు ఇక్కడే ఉపాధి లభిస్తుందని, ఉత్తరాంధ్ర ప్రజల ఆస్తులకు విలువ పెరుగుతుందని వివరించారు. మత్స్యకార నాయకుడు పార్లమెంట్‌లో అడుగుపెట్టారంటే అది వైఎస్ జగన్ ఘనతేనని అన్నారు. 2019 ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబుకి ముచ్చెమటలు పట్టించిన భరత్ మత్స్యకారుడేనన్నారు. 2024లో చంద్రబాబుని ఓడించి, ఇంటికి పంపేది కూడా మత్స్యకారుడేనన్న విషయం గర్వంగా చెప్పే రోజులు వచ్చాయన్నారు. ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాద బాధిత మత్స్యకారులకు పవన్ ఇచ్చే డబ్బు సినిమాల ద్వారా వచ్చినదికాదని, టీడీపీ నుంచి తీసుకున్న ప్యాకేజీ డబ్బు అని, మత్స్యకారులు ఎవరూ ఆ సొమ్ము తీసుకోవద్దని పిలుపునిచ్చారు.

నిజం అంటే జగన్.. అబద్ధం అంటే బాబు: మంత్రి చెల్లుబోయిన

బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ నిజం అంటే జగన్ అని, అబద్ధం అంటే చంద్రబాబు అని చెప్పారు. మత్స్యకారులకు కష్టం వస్తే గంటలో చెక్కులు పంపిణీ చేయించిన నేత జగన్ నిజమైన నేత అయితే, మోసాలతో కాలం వెళ్లబుచ్చే నేత చంద్రబాబు అని అన్నారు.

వధూవరులకు సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులు


గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ కుమార్తె వివాహ వేడుకకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. బుధవారం మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహ వేడుకలో వధువు రేష్మ ప్రియాంక, వరుడు అమోఘ్ సతీష్ గుత్తేదార్‌లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన ఆశీస్సులు అందజేశారు. - సాక్షి, అమరావతి/మంగళగిరి

పేదల ఇళ్లకు రూ.4,376 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ వెచ్చించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.4,375.82 కోట్లు వెచ్చించింది. రాష్ట్రంలో ఇళ్లులేని పేదలకు పక్కా గృహయోగం కల్పించేందుకు 30.75లక్షల మంది పేద మహిళల పేరిట విలువైన ఇంటి స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అంతేకాక.. 21.75 లక్షల (19.13 లక్షల సాధారణ + 2.62 లక్షల టిడ్కో) ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. గత నెల 12వ తేదీ నాటికి 7.42 లక్షల (5.85 లక్షల సాధారణ + 1.57 లక్షల టిడ్కో) ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశారు. ఇలా స్థలం, ఇంటితో కలిపి పేదింటి మహిళల పేరిట రూ.10లక్షలు, ఆపైన విలువైన స్థిరాస్తిని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

రూ.3,694 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు

ఇళ్ల లబ్ధిదారులకు ఖరీదైన స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన సీఎం జగన్ ప్రభుత్వం అక్కడితో ఆగకుండా ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షల చొప్పున సాయం చేస్తోంది. యూనిట్‌కు రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు చేస్తోంది. స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణ సాయం కూడా చేస్తోంది. ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం ద్వారా రూ.15 వేలు, స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై ఇవ్వడం ద్వారా మరో రూ.40 వేలు చొప్పున మేలు చేస్తోంది. 17వేలకు పైగా వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో నిర్మిస్తున్న కొత్త ఊళ్లల్లో ఉచితంగా నీటి, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇవ్వడం, డ్రెయిన్లు, రోడ్లు లాంటి వసతులను ప్రభుత్వం సమకూరుస్తోంది. ఇలా సబ్సిడీపై 4,69,897 మెట్రిక్ టన్నుల సిమెంట్ సరఫరాకు రూ.247.23 కోట్లు, 33,303 టన్నుల ఇనుముకు రూ.224 కోట్లు వెచ్చించింది. ఉచితంగా ఇసుక పంపిణీతో పాటు, ఇతర సామగ్రిని సబ్సిడీపై అందించేందుకు మరో రూ.210.59 కోట్లు ఖర్చుచేసింది. దీంతో ఈ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4,375.82 కోట్లు ఖర్చుచేయగా ఇందులో రూ.3,694 కోట్ల మేర లబ్ధిదారులకు బిల్లుల రూపంలో చెల్లింపులు చేపట్టారు.

నేడు బొబ్బిలి, ప్రత్తిపాడు, కడపలో సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర గురువారం విజయనగరం జిల్లాలో బొబ్బిలి, కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, వైఎస్సార్ జిల్లాలో కడప నియోజకవర్గాల్లో జరుగుతుంది. బుధవారం విశాఖ దక్షిణ నియోజకవర్గం, ప్రకాశం జిల్లా ఒంగోలు, నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గాల్లో జరిగిన సామాజిక సాధికార యాత్రలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. మూడు నియోజకవర్గాల్లో యాత్ర జనసంద్రాన్ని తలపించింది. సామాజిక న్యాయం చేసిన జగనే రావాలి – జగనే కావాలి అంటూ పేదలు నినదించారు.

బనగానపల్లెలో జనసునామీ

నియోజకవర్గంలో ఘనంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక సాధికార యాత్ర

- సీఎం జగన్ అండతో ఎదిగిన తీరును వివరించిన బడుగు, బలహీన వర్గాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, యువత, వృద్ధులు
- మళ్లీ జగనే కావాలి అంటూ నినదించిన ప్రజలు


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సాక్షి, నంద్యాల: బనగానపల్లె నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వారు సాధించిన సామాజిక సాధికారతను చాటి చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండతో తాము సమాజంలో ఎదిగిన తీరును, తలెత్తుకొని తిరగగలుగుతున్న వైనాన్ని తెలుపుతూ బుధవారం భారీగా సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు, యువత, వృద్ధులు అధిక సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. యాత్రకు స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రజలతో పట్టణంలోని రోడ్లన్నీ కిక్కిరిశాయి. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన బనగానపల్లె పట్టణంలో జరిగిన బహిరంగ సభకు ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు పోటెత్తారు. జై జగన్.., మళ్లీ జగనే కావాలి అంటూ ప్రజలు చేసిన నినాదాలతో సభాప్రాంగణం హోరెత్తింది.

అభివృద్ధి పథంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు: ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చేయి పట్టుకొని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు అంతర్జాతీయ స్థాయి విద్య, అధునాతన వైద్యం అందిస్తూనే, అనేక పథకాలతో, కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకు అన్ని పదవుల్లో అధిక శాతం ఈ వర్గాలకే ఇస్తూ సీఎం జగన్ అందిస్తున్న చేయూత మరెవరికీ సాధ్యం కాదని తెలిపారు. సీఎం జగన్ వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కిందని, ఈ వర్గాలే ప్రభుత్వానికి వెన్నెముక అని అన్నారు. మీ కుటుంబానికి మేలు జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా అడుగుతున్న సీఎం దేశంలో జగన్ మాత్రమేనన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా ఏనాడూ మైనార్టీలను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీ శాఖను ఇతర వర్గాలకు కేటాయించిన ఘనుడు చంద్రబాబేనన్నారు.

చంద్రబాబు దళితులను అవమానించారు: ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

దళిత, బలహీన వర్గాలను సీఎం జగన్ గుండెల్లో పెట్టుకొని చూసుకొంటున్నారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చెప్పారు. దళితుడిని ఉప ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టి గౌరవించారన్నారు. అన్ని పథకాలు, పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లను, ఆస్పత్రులను సీఎం జగన్ కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలకు పైగా లబ్ధి చేకూర్చారని గుర్తు చేశారు. చంద్రబాబు దళితులను తీవ్రంగా అవమానించారని, స్నానం చేయరని, శుభ్రంగా ఉండరని, వారికి రాజకీయాలెందుకంటూ టీడీపీ నేతలు నీచంగా మాట్లాడినా చంద్రబాబు ఖండించలేదని తెలిపారు. సొంత సామాజిక వర్గమే ఎప్పటికీ అధికారం చెలాయించాలనుకునే వ్యక్తి చంద్రబాబు మాత్రమేనన్నారు. ధన, కుల, అవినీతి దాహమే బాబు అజెండా అని మండిపడ్డారు. వెన్నుపోట్లకు కేరాఫ్ అడ్రస్ బాబు అని చెప్పారు. అవినీతికి తలుపులు బార్లా తెరిచిన ఘనత ఒక్క చంద్రబాబుదేనని అన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలను నమ్ముకుంటే.. సీఎం వైఎస్ జగన్ ప్రజలను మాత్రమే నమ్ముకున్నారన్నారు.

దళితులకు పెద్దపీట వేసిన సీఎం జగన్: ఎంపీ డాక్టర్ గురుమూర్తి

రాజ్యాధికారంలో భాగస్వాములైనప్పుడే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని నమ్మి, ఆచరణలో పెట్టిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి అన్నారు. నామినేటెడ్ పదవులతో పాటు నామినేషన్ కింద ఇచ్చే పనుల్లోనూ దళితులకు పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పదవీకాలంలో 34 వేల ఉద్యోగాలే ఇచ్చారని, ఈ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని కొనియాడారు.

ఈ సమావేశంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా ఒంగోలు సాధికార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



ప్రకాశించిన సాధికారత

ఒంగోలులో పండుగలా సామాజిక సాధికార బస్సు యాత్ర

- జనసంద్రమైన ఒంగోలు నగరం.. అడుగడుగునా నీరాజనాలు
- ప్రత్యేక ఆకర్షణగా కుల వృత్తుల శకటాలు
- వర్షంలో తడుస్తూనే యాత్ర, సభలో పాల్గొన్న ప్రజలు


సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంలో సామాజిక సాధికారత ప్రకాశించింది. సామాజిక చైతన్యం ఉవ్వెత్తున ఎగిసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు రోడ్లపైకి చేరి పండుగ చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ అందించిన చేయూతతో తాము సాధించిన సాధికారతను ప్రతిబింబిస్తూ నగరంలోని బడుగు, బలహీనవర్గాలు బుధవారం పెద్ద ఎత్తున సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించాయి. ఒకప్పుడు అవమానాలకు గురైన తాము సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ భరోసాతో తలెత్తుకు తిరుగుతున్నామంటూ నినదించారు. జోరు వానలోనూ బస్సు యాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. నగర వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. భారీ గజమాలలు, సంప్రదాయ నృత్యాలు, డప్పుల మోతలు, బాణాసంచాతో జై జగన్ నినాదాలతో ఒంగోలు నగరం మార్మోగింది. కర్నూలు బైపాస్ రోడ్డు నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వరకు ర్యాలీ సాగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుల వృత్తులు ప్రతిబింబించేలా శకటాలను యాత్రలో ప్రదర్శించారు. అనంతరం ఒంగోలు బాపూజీ కాంప్లెక్స్ సెంటర్‌లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

ఇదో సామాజిక విప్లవం: మంత్రి విడదల రజిని

సభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తెచ్చిన సామాజిక సాధికారతకు ఈ వేదికపై ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మంత్రులు, మేయరు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నేతలే నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. మంత్రివర్గం నుంచి అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే సీఎం జగన్ పెద్దపీట వేశారని తెలిపారు. పేదవానికి కార్పొరేట్ వైద్యం, విద్య అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఇదో సామాజిక విప్లవమని అన్నారు.

బలహీనవర్గాల విద్యార్థులకు ఉన్నత చదువులు: ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఆంధ్రాలో అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయి చదువులు చదివి అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సీఎం జగన్ సుపరిపాలన చూశాక ఒడిశా, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలను కూడా ఆంధ్రాలో కలపాలంటూ డిమాండ్లు వస్తున్నాయన్నారు.

జగనన్న ఆలోచనలకు మేం నిదర్శనం: మంత్రి ఆదిమూలపు సురేశ్

సీఎం జగనన్న ఆలోచనా విధానానికి నిలువెత్తు నిదర్శనం ఈ సభావేదికపై ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాప్రతినిధులమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సీఎం జగన్ ఉన్నతంగా తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం చదువులు అందించడాన్ని మిగతా రాష్ట్రాలూ అందిపుచ్చుకుంటున్నాయని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం, సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ, అధునాతన ప్రభుత్వ ఆస్పత్రులతో సీఎం జగన్ రోల్ మోడల్‌గా నిలిచారన్నారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి: మంత్రి మేరుగు

పేదల పక్షపాతిగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. వైఎస్ జగన్ 75 శాతం మంత్రి పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చారని, ఇంతకంటే సామాజిక సాధికారత చేసే నాయకులు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు.

ఒంగోలులో ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే పోటీ కూడా చేయను : బాలినేని

ఒంగోలు నగర ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు 25 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడితే టీడీపీ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వచ్చే నెలలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా 25 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇళ్ల పట్టాలు ఇవ్వలేకపోతే వచ్చే ఎన్నికల్లో ఒంగోలులో పోటీ కూడా చేయనన్నారు. వైఎస్సార్ హయాంలో ఒంగోలులో వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించామని తెలిపారు. ఇప్పుడు ఒంగోలు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.350 కోట్లతో మంచినీటి పథకానికి, మరో రూ.350 కోట్లతో కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు.

ఈ సమావేశంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, నందిగం సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాపం.. తెలుగు బీజేపీ!

టీడీపీని బతికించడమే అజెండాగా బీజేపీలోని కొందరు నేతల అడుగులు



పోలీసులపై దాడి చేస్తే అరెస్ట్ చేయరా?

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కుంగి, కృశించిపోతున్న టీడీపీని బతికించడానికి 'తెలుగు బీజేపీ' నేతలు దింపుడు కల్లం ఆశతో పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీకి రాజకీయ ప్రయోజనం కలిగించేలా రోజుకో కొత్త ఎత్తుతో రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపించకపోవడంతో తాజాగా మరో బీజేపీ నేత సీఎం రమేశ్ రంగంలోకి దిగారు. పోలీసులపై దాడికి పాల్పడ్డ కేసులో న్యాయస్థానం ఆదేశాలతో కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న బీటెక్ రవిని మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీటెక్ రవిని అంతమొందించేందుకే పోలీసులు తీవ్రంగా కొట్టారని చెప్పారు. 'బతికుంటే కదా పులివెందులలో పోటీ చేసేది' అని హెచ్చరించారని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం ద్వారా టీడీపీకి రాజకీయ ప్రయోజనం కల్పించాలన్న ఆతృత తప్ప ఆయన ఆరోపణల్లో ఎలాంటి పస లేదన్నది స్పష్టమవుతోంది.

పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పోరు మామిళ్ల రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పోలీసులపై దాడి చేయడంతో ఆయన్ను వైఎస్సార్ జిల్లా పోలీసులు ఈ నెల 14న అరెస్ట్ చేశారు. విమానాశ్రయం వద్ద ఓ కానిస్టేబుల్‌పై దాడి చేసినప్పటి నుంచి ఆయన పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పులివెందుల నుంచి కడపకు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేసి, యోగి వేమన విశ్వవిద్యాలయం సమీపంలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అయితే టీడీపీ అనుకూల మీడియా దాన్ని రాద్ధాంతం చేసింది. బీటెక్ రవిని పోలీసులు కిడ్నాప్ చేశారంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నించింది. దీనికి వత్తాసు పలుకుతూ సీఎం రమేశ్ మరింతగా వక్రీకరించేందుకు యత్నించారు. పోలీసులు బీటెక్ రవిని కిడ్నాప్ చేశారని, ఏకంగా హత్య చేసేందుకు యత్నించారని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. బీటెక్ రవిని అరెస్ట్ చేసిన రెండు గంటల్లోనే పోలీసులు ఆయన్ను కడప ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఆ సమయంలో పోలీసులు తనను కొట్టారని ఆయన మేజిస్ట్రేట్‌కు చెప్పలేదు. గాయాలను చూపించలేదు. 'పులివెందులలో పోటీ చేయాలంటే ముందు బతికి ఉండాలి కదా' అని తనను బెదిరించినట్టూ చెప్ప లేదు. చెప్పి ఉంటే మేజిస్ట్రేట్ ఆయన ఆరోపణలను రికార్డ్ చేసేవారు. కానీ బీటెక్ రవి అలా చెప్పలేదు. ఎందుకంటే పోలీసులు ఆయన్ను కొట్ట లేదు.. బెదిరించ లేదు.. హత్యాయత్నం చేయ లేదు. అరెస్ట్ చేశాక కడప రిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన శరీరంపై గాయాలు ఉన్నట్టు వైద్య నివేదికలో లేనే లేదు. అయితే బీటెక్ రవిని పోలీసులు కిడ్నాప్ చేసి తీవ్రంగా కొట్టారని.. ఏకంగా హత్య చేసేందుకు యత్నించారని.. టీవీ చానళ్లలో స్క్రోలింగులు రావడంతో విడిచి పెట్టారని సీఎం రమేశ్ చెప్పడం విడ్డూరంగా ఉంది. పోలీసులపై దాడి చేసినా కూడా బీటెక్ రవిని అరెస్ట్ చేయకూడదని రమేశ్ వత్తాసు పలుకుతుండటం విస్తుగొలుపుతోంది.

చంద్రబాబు కనుసైగ మేరకే..

సీఎం రమేశ్ ఉండేది బీజేపీలో.. పని చేసేది మాత్రం చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం అన్నది బహిరంగ రహస్యం. వైఎస్సార్ జిల్లా టీడీపీకి ఆయనే పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారు. పార్టీలో జిల్లా టీడీపీ నేతల పాత్ర నామమాత్రం. పెత్తనం అంతా సీఎం రమేశ్‌దే. కడప జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ నేత బీటెక్ రవిని పరామర్శించడమే ఇందుకు నిదర్శనం. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరిద్దరి జోడి చేయని అక్రమాలు లేవు. సీఎం రమేశ్ అండదండలతోనే బీటెక్ రవి యథేచ్ఛగా దందాలు, దౌర్జన్యాలకు పాల్పడేవారు. వీరిద్దరికీ చంద్రబాబు ఆశీస్సులు పుష్కలం. అందువల్లే బీటెక్ రవిని సీఎం రమేశ్ పరామర్శించడం.. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదంతా చంద్రబాబు పన్నాగంలో భాగమే. పులివెందుల, వైఎస్సార్ జిల్లా ప్రజలకు సీఎం రమేశ్, బీటెక్ రవి అక్రమాలు, దౌర్జన్యాల గురించి పూర్తి అవగాహన ఉంది. ఈ మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలకు త్వరలోనే గుణపాఠం చెబుతామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

సహేతుకంగానే విదేశీ మద్యం బ్రాండ్ల ధరలు

- టెండర్ల కమిటీ సిఫార్సుల మేరకే ఖరారు.. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ అదే విధానం
- దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వంపై ఈనాడు దుష్ప్రచారం

సాక్షి, అమరావతి: మద్యంపై ఈనాడు రామోజీ మరోసారి దుష్ప్రచారానికి పాల్పడ్డారు. ప్రధానంగా రాష్ట్రంలో కొత్తగా ప్రవేశించే విదేశీ మద్యం బ్రాండ్ల ధరలపై ప్రభుత్వ విధానాన్ని వక్రీకరించేందుకు యత్నించారు. విదేశీ మద్యం ధరలపై తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్నే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. టెండర్ల కమిటీ సిఫార్సుల మేరకే నిర్ణయం తీసుకుంది. టీడీపీ హయాంలోనూ అదే రీతిలో విదేశీ మద్యం బ్రాండ్ల ధరలపై నిర్ణయం తీసుకున్న విషయాన్ని రామోజీ కావాలనే కప్పిపుచ్చారు.

➢ రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఏ.గోపాల్‌రెడ్డి నేతృత్వంలోని టెండర్ల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. విదేశీ మద్యం ధరలను పదేళ్లుగా సవరించలేదు. ద్రవ్యోల్బణం, విదేశీ మారక ద్రవ్యం రేట్లలో మార్పులు తదితర కారణాలతో విదేశీ మద్యం తయారీ వ్యయం బాగా పెరిగింది. దీంతో విదేశీ మద్యం అనుమతులను సరఫరా కంపెనీలు పునరుద్ధరించడం మానేశాయి. ఈ నేపథ్యంలో విదేశీ మద్యానికి ఆఫర్ ప్రైస్‌ను అనుమతించడం ద్వారా అన్ని కంపెనీల విదేశీ మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చేందుకు అవకాశం కల్పించాలని టెండర్ కమిటీ సిఫార్సు చేసింది. తెలంగాణలో ఏడాది క్రితమే విదేశీ మద్యం బ్రాండ్ల ధరలను పెంచారు. విదేశీ మద్యాన్ని కేవలం అతి కొద్ది మంది మాత్రమే కొనుగోలు చేస్తారు. అందుకే విదేశీ మద్యం ధరలను 20 శాతం పెంచుతూగానీ కంపెనీల ఆఫర్ ధరలలో ఏది తక్కువ అయితే అది వర్తించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

➢ సరిహద్దు రాష్ట్రాలతో సమానంగా విదేశీ మద్యం ధరలను పెంచడం ద్వారా ఆయా రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాను అరికట్టవచ్చు. ఖజానాకు గండి పడకుండా, తెలంగాణలో విదేశీ మద్య ధరలతో సమానంగా ఉండేలా ఏఆర్ఈటీ పన్నును రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. దీంతో విదేశీ మద్యం బ్రాండ్ల ధరలు స్వల్పంగా పెరుగుతాయి.

➢ కొత్త విదేశీ మద్యం బ్రాండ్ల ధరలపై తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్నే ఏపీ కూడా అనుసరిస్తూ విధి విధానాలను జారీ చేసింది. అవేమీ కొత్తవి కాదు. విదేశీ మద్యం బ్రాండ్ల ధరల నిర్ణయంపై గత టెండర్ల కమిటీ 2014 మార్చి 20న అవే సిఫార్సులు చేసింది. ఆమేరకు అప్పటి ప్రభుత్వం 2015 జనవరి 24న ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా విదేశీ బ్రాండ్ల ధరలపై గత సర్కారు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేస్తోంది.

బ్రాండ్	2023 నవంబరు 16న ధర	పెరిగిన తరువాత ధర
జానీ లీవర్ బ్లాక్ లేబుల్	రూ.4,990	రూ.5,230
చివాజ్ రీగల్ (12ఏళ్లు)	రూ.4,840	రూ.5,210
దేవర్ (12ఏళ్లు)	రూ.3,860	రూ.4,140

ఇంత 'పచ్చ'పాతమా రామోజీ..!?

చంద్రబాబుకు ఈడీ నోటీసులు ఇచ్చినప్పుడు వార్తలు ఎందుకు రాయలేదు?

- బైజూస్ రవీంద్రన్‌కు ఈడీ నోటీసులు ఇస్తే మాత్రం హడావుడి చేస్తారా?
- రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగవ్వడం నచ్చకే కంటగింపు రాతలు



సాక్షి, అమరావతి: ''అక్కడ స్పేస్ లేదు. అయినా ఆయన స్పేస్ క్రియేట్ చేసి తీసుకుని వాడుకున్నాడు'' అనేది ఓ ప్రముఖ దర్శకుడి ఫేమస్ డైలాగ్. నిత్యం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న రామోజీ రావుకు ఆ డైలాగ్ అచ్చంగా సరిపోతుంది. బైజూస్ సంస్థ సీఈవోకు ఈడీ నోటీసులు ఇస్తే.. ఆ వార్తకు ఈనాడు పత్రికలోని మొదటిపేజీలో ప్రత్యేక స్పేస్ ఇచ్చి కథనం రాశారంటేనే ఆయన దురుద్దేశం ఏంటో ఇట్టే తెలిసిపోతుంది. ఈ వార్త ద్వారా తన ద్వంద్వ వైఖరిని, 'పచ్చ'పాతాన్ని మరోసారి బయట పెట్టుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు, సోదాలు, అరెస్ట్‌ల విషయంలో తన అస్మదీయుల విషయంలో ఓ రకంగా.. ఇతరుల విషయంలో మరోరకంగా వ్యవహరిస్తారని రామోజీ నిరూపించుకున్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికే బైజూస్ సీఈవో రవీంద్రన్‌కు ఈడీ నోటీసులు వార్తపై అంత హడావుడి చేశారని ఎవరికైనా అర్థమవుతుంది.

చంద్రబాబుకు నోటీసులు ఇచ్చినప్పుడు గప్‌చుప్

గతంలో ఈడీ చంద్రబాబుకు నోటీసులు జారీ చేసినప్పుడు ఈనాడు గప్‌చుప్‌గా ఉండిపోయింది. ఆ విషయం తన పాఠకులకు తెలియకూడదని భావించింది. అంతేకాదు స్కిల్ స్కామ్ కేసులో పాత్రధారులైన చంద్రబాబు ముఠా సభ్యులు సుమన్ బోస్, వికాస్ కన్వేల్కర్, యోగేశ్ గుప్తా, వాసుదేవ్ పార్థసానిలను ఈడీ అరెస్ట్ చేసింది. అంతకుముందు వారి కంపెనీల్లో సోదాలు నిర్వహించింది. ఆ విషయాలను ఈనాడు కనీసం పట్టించుకోలేదు. ఎందుకంటే వారంతా చంద్రబాబు స్కామ్‌లో కీలక పాత్రధారులు. వారి గురించి వార్తలు ప్రచురిస్తే చంద్రబాబు కుంభకోణం గురించి ప్రజలకు తెలియజేయాల్సి వస్తుంది. అందుకే ఈడీ వారిని అరెస్ట్ చేసినా.. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించినా సరే తనకు తెలియనట్టే మిన్నకుండిపోయింది.

బైజూస్ సీఈవోకు నోటీసులు ఇస్తే హడావుడి

ఈడీ తాజాగా బైజూస్ సంస్థ సీఈవో రవీంద్రన్‌కు నోటీసులు జారీ చేసింది. ఆ సంస్థలో విదేశీ పెట్టుబడులపై సమాధానమివ్వాలని చెప్పింది. ఆ అంశానికి ఈనాడు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అత్యధిక ప్రాధాన్యంతో ప్రచురించింది. సంస్థ ఆర్థిక వ్యవహారాలపై నోటీసులు జారీ చేస్తే.. అందుకు రవీంద్రన్ సమాధానం చెబుతారు. కానీ ఆ నోటీసుల విషయాన్ని హైలైట్ చేసి ప్రచురించడం ద్వారా పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లాలన్నది ఈనాడు దురుద్దేశం. సంస్థ ఆర్థిక అంశాల మీద నోటీసులకు, ఆ సంస్థ అందించే కంటెంట్‌కు ఎలాంటి సంబంధం ఉండదనే ప్రాథమిక విషయాన్ని రామోజీ మరిచిపోయి రాష్ట్ర ప్రజలను గందరగోళంలో పడేయాలని వార్తలు వండివారుస్తున్నారు.

వక్రీకరణలకు విశ్వప్రయత్నం

ఎడ్యుటెక్ కంపెనీల్లో బైజూస్ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య కంటెంట్‌ను ఆ సంస్థ ఉచితంగా అందిస్తోంది. బైజూస్ అందిస్తున్న మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉందని గుర్తింపు పొందింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈడీ నోటీసుల ప్రభావం పడకుండా అది కొనసాగుతూనే ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక సాంకేతిక మౌలిక వసతులను సమకూర్చుకోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగవ్వడం అటు చంద్రబాబుకు ఇటు రామోజీరావుకు కంటగింపుగా మారింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ మెరుగుపడితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజాదరణ మరింత పెరుగుతుందన్నదే వారి భయం. అందుకే ఏ చిన్న అంశాన్ని అయినా సరే వక్రీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఈనాడు యత్నిస్తోంది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక సంస్కరణలను ప్రజలు గుర్తించారు. విపక్షాలు, ఎల్లో మీడియా ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ధీమాగా విద్యా సంస్కరణలను కొనసాగిస్తోంది.

మద్యం కుంభకోణంతో ఖజానాకు రూ.వేల కోట్ల నష్టం

- ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకే ప్రివిలేజ్ ఫీజు తొలగించారు
- చంద్రబాబు, కొల్లు రవీంద్ర అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు
- నిర్ణయాల వెనుక దురుద్దేశాలుంటే అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టొచ్చు
- ప్రివిలేజ్ ఫీజు తొలగింపు విషయంలో కమిషనర్ నుంచి ప్రతిపాదనలు రాలేదు
- మంత్రి మండలిలో కూడా చర్చించలేదు
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: తమకు కావాల్సిన డిస్టిలరీలు, బార్‌లకు ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకే అప్పటి ప్రభుత్వ పెద్దలు ప్రివిలేజ్ ఫీజును తొలగించారని రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. ఈ నిర్ణయం వల్ల ఖజానాకు రూ.వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే ముందు ఆర్థిక శాఖను సంప్రదించడం తప్పనిసరి అని.. అయితే, ప్రివిలేజ్ ఫీజు తొలగింపు విషయంలో ఆర్థిక శాఖను సంప్రదించలేదని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అధికారాన్ని దుర్వినియోగం చేసి కొందరికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఇందుకు ప్రతిగా చంద్రబాబు, కొల్లు రవీంద్రకు డబ్బు అందిందా? లేదా? అన్న విషయం దర్యాప్తులో తేలుతుందని కోర్టుకు నివేదించారు.

అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టొచ్చు

ఈ నిర్ణయం వెనుక దురుద్దేశాలు, ఆయాచిత లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశం ఉంటే అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చని అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేశారు. విధాన నిర్ణయాలు, పాలనా విధానాలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని, అయితే.. ఆ విధానాల రూపకల్పనలో చట్ట నిబంధనలను అనుసరించారా? లేదా? అన్నది దర్యాప్తులో తేలుతుందన్నారు. ప్రివిలేజ్ ఫీజు తొలగింపు విషయంలో పిటిషనర్లు చేస్తున్న వాదనల్లో ఎంత మాత్రం వాస్తవం లేదన్నారు. ప్రివిలేజ్ ఫీజు తొలగింపునకు ఎక్సైజ్ కమిషనర్ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదన్నారు. ప్రతిపాదనలు వచ్చినట్టు చేస్తున్న వాదన అబద్ధమన్నారు. అలాగే, ప్రివిలేజ్ ఫీజు గురించి మంత్రి మండలిలో చర్చించలేదని తెలిపారు. గవర్నర్ ముందు కూడా చట్ట సవరణను ఉంచలేదన్నారు. శాసనసభ ముందు కూడా ఉంచలేదని తెలిపారు. తప్పుడు, ప్రజా విరుద్ధ నిర్ణయాలకు రాజ్యాంగపర రక్షణ ఎంత మాత్రం ఉండదన్నారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దని కోర్టును కోరారు. కోర్టు సమయం ముగియడంతో ఏజీ వాదనల కొనసాగింపు నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముందస్తు బెయిల్ కోసం పిటిషన్లు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా తమ పార్టీకి చెందిన నేతల డిస్టిలరీలు, బార్లకు లబ్ధి చేకూర్చేలా పలు నిర్ణయాలు తీసుకున్నారు. వీటి వల్ల ఖజానాకు రూ.1,500 కోట్ల మేర నష్టం వాటిల్లింది. దీనిపై ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక విచారణ జరిపిన సీఐడీ అప్పటి ఎక్సైజ్ కమిషనర్ శ్రీనరేష్, అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును వరుసగా ఒకటో, రెండో, మూడో నిందితులుగా పేర్కొంటూ వారిపై కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు, కొల్లు రవీంద్ర, శ్రీనరేష్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. బుధవారం చంద్రబాబు, రవీంద్ర వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారణ జరిపారు. విచారణ సందర్భంగా సీఐడీ తరపున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ పలు డాక్యుమెంట్లను కోర్టు ముందుంచారు. చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది నాగముత్తు స్పందిస్తూ.. ఏజీ కోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను తమకు అందజేయలేదన్నారు. అవేమిటో తెలుసుకోకుండా తాము తిరుగు సమాధానం ఎలా ఇవ్వగలమన్నారు. ఇందుకు న్యాయమూర్తి స్పందిస్తూ.. ఆ డాక్యుమెంట్లు రహస్యమైనవి కాదు కదా. వాటిని పిటిషనర్లకు అందచేయాలని ఏజీకి స్పష్టం చేశారు.

ఎలాంటి తవ్వకాలూ చేపట్టడం లేదు

- హైకోర్టుకు నివేదించిన వీఎంఆర్‌డీఏ న్యాయవాది సూర్యకిరణ్
- తవ్వకాల విషయంలో స్టేటస్ కో కొనసాగించండి: హైకోర్టు



సాక్షి, అమరావతి: విశాఖపట్నం, కైలాసగిరి కొండ దిగువన తవ్వకాలపై యథాతథస్థితి(స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు బుధవారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) కమిషనర్‌ను ఆదేశించింది. తవ్వకాలకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కూడా ఆదేశించింది. పిటిషనర్ ఆరోపిస్తున్న విధంగా ఎలాంటి తవ్వకాలు చేయడం లేదని వీఎంఆర్‌డీఏ తరపు న్యాయవాది వరికూటి సూర్యకిరణ్ చెప్పిన విషయాన్ని హైకోర్టు రికార్డ్ చేసింది. నిబంధనల ప్రకారం ఈ కొండ కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్)-2 పరిధిలోకి వస్తుంది కాబట్టి, తవ్వకాలకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి అవసరమని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణలో ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తామంది. విచారణను డిసెంబర్ 13కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. సీఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం తవ్వకాలకు అనుమతులు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు ఎంత మాత్రం అడ్డంకి కాదని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కైలాసగిరి కొండను తవ్వి నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకుని తగిన ఉత్తర్వులివ్వాలంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. ఎలాంటి తవ్వకాలు చేయడం లేదని, తెన్నేటి పార్కుకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం కొండ దిగువన ఉన్న చెట్ల తుప్పలను తొలగించి, కార్ పార్కింగ్‌కు అనువుగా చదునుచేస్తున్నామని వీఎంఆర్‌డీఏ తరఫు న్యాయవాది సూర్యకిరణ్ తెలిపారు. కార్ పార్కింగ్ ఏర్పాటు ప్రజా ప్రయోజనం కిందకే వస్తుందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. తవ్వకాలకు కేంద్రం నుంచి అనుమతులు తప్పనిసరి కదా.. మీరు అనుమతులు తీసుకున్నారా? లేదా? అని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించిన వివరాలు తన వద్ద సిద్ధంగా లేవని సూర్యకిరణ్ తెలిపారు. తదుపరి విచారణ సమయంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతానన్నారు. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ధర్మాసనం ఆదేశించింది.

బోటు ప్రమాద బాధితులకు నేడు పరిహారం అందజేత

రూ.7.11 కోట్లు అందించనున్న ప్రభుత్వం



హార్బర్‌లో ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న మోపిదేవి

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట (విశాఖపట్నం): ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం వల్ల నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం రికార్డు సమయంలో ఆదుకుంటోంది. బాధిత మత్స్యకారులకు పరిహారం చెక్కులను గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో అందజేయనుంది. ఈ నెల 19వ తేదీ రాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 30 బోట్లు పూర్తిగా దగ్ధమవగా, మరో 18 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం గురించి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసి మత్స్యకారులకు నేనున్నానంటూ... భరోసానిచ్చారు. బాధిత మత్స్యకారులకు 80శాతం పరిహారం ఇస్తామని ప్రకటించారు. సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లుగానే ప్రమాదం జరిగిన 48గంటలు గడవక ముందే జిల్లా కలెక్టర్ డాక్టర్ అకౌంట్‌కు పరిహారం డబ్బులను సీఎం కార్యాలయం జమ చేసింది. పూర్తిగా కాలిపోయిన 30 బోట్లకు 80 శాతం పరిహారంలో భాగంగా రూ.6,44,80,000, పాక్షికంగా దగ్ధమైన 18 బోట్లు, ఒక వలకు రూ.66.96 లక్షలు పరిహారాన్ని అందించనున్నారు. బోట్లు దగ్ధమవడంతో వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న హమాలీలు, చిరువ్యాపారులను కూడా ప్రభుత్వం గుర్తించింది. ఒక్కో బోటుకు 10మంది చొప్పున పరిగణనలోకి తీసుకుని మొత్తం 490 మందికి ఒక్కొక్కరికీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.10వేలు చొప్పున అందించనున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ప్రమాదం జరిగి వెంటనే పరిహారం అందిస్తుండటంపై బాధిత బోటు యజమానులు, మత్స్యకారులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు అగ్ని ప్రమాద ఘటనపై విచారణ వేగవంతం చేశారు. క్లూస్ టీమ్ ఘటనాస్థలికి చేరుకుని కీలక ఆధారాలు సేకరించింది. పోలీసులు మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మానవతాదృక్పథంతో స్పందించిన సీఎం జగన్: ఎంపీ మోపిదేవి

సీఎం వైఎస్ జగన్ మానవతా దృక్పథంతో స్పందించి సాయం అందజేయాలని ఆదేశాలు జారీ చేయడం మంచి పరిణామమని ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన బోట్లను బుధవారం ఆయన పరిశీలించి మత్స్యకారులను పరామర్శించారు.

క్లుప్తంగా...

చుక్కల భూములపై మరింత స్పష్టత

ఏ తరహా భూములను ఏ కేటగిరీలో చేర్చాలో వివరణ

సాక్షి, అమరావతి: చుక్కల భూములపై ఆంక్షల తొలగింపునకు సంబంధించి జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం మరింత స్పష్టత ఇచ్చింది. ఏ తరహా భూములను ఏ కేటగిరీలో చేర్చాలో మరోసారి మార్గనిర్దేశం చేస్తూ భూ పరిపాలన శాఖ అదనపు కమిషనర్ ఇంతియాజ్ బుధవారం ఒక మెమో జారీ చేశారు. ప్రభుత్వ భూములు, ఏదైనా శాఖకు లేదా ఎవరైనా వ్యక్తులకు బదలాయించిన ప్రభుత్వ భూములను నిషేధిత జాబితా 22 ఏ1 (బి)లో పెట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమి అయి ఉండి దాన్ని పేదలకు అసైన్‌మెంట్ చేస్తే అలాంటి కేసుల్లో అసైన్డ్ భూముల చట్టానికి లోబడి వాటిని 22 ఏ1 (ఎ)లో పెట్టాలని ఆదేశించారు. అవి కాకుండా మిగిలిన ఏ తరహా భూములున్నా వాటిని చట్టానికి లోబడి 22ఎ జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. చుక్కల భూములపై ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడంతో వాటి ప్రకారం చాలా జిల్లాల్లో వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. కానీ కొన్ని ప్రాంతాల్లో కలెక్టర్ల నుంచి తహశీల్దార్ల వరకు రకరకాల సందేహాలు వ్యక్తం చేస్తూ పలు కేసులను పెండింగ్‌లో ఉంచుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి వాటిపై మరింత స్పష్టత ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఏఎస్‌జీగా నరసింహశర్మ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహశర్మ

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు ఇన్‌చార్జ్ అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా నియమితులైన సీనియర్ న్యాయవాది బి.నరసింహశర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు పాల్గొన్నారు. నరసింహశర్మను పలువురు న్యాయవాదులు అభినందించారు. అనంతరం ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వాస్తవానికి నరసింహశర్మ తెలంగాణ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. అలాగే ఏపీ హైకోర్టు బాధ్యతలు సైతం ఆయనకు అప్పగిస్తూ రాష్ట్రపతి ఇటీవల ఉత్తర్వులిచ్చారు.

క్విడ్ ప్రోకో వల్లే చంద్రబాబుకు కరకట్ట ఇల్లు

ఎస్సీ కార్పొరేషన్ (మాల) చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ



నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): మాజీ సీఎం చంద్రబాబు నివాసం ఉంటున్న తాడేపల్లిలోని కరకట్ట ఇల్లు ఆయన క్విడ్‌ప్రోకో ద్వారా పొందినదేనని, ఈ విషయం మరిచిపోయి టీడీపీ మాజీ ఎమ్మెల్యే అనిత ఓవర్ యాక్షన్ చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ (మాల) చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ ఆగ్రహం వ్యక్తంచేశారు. అనిత టికెట్ కోసం ఏయే పనులు చేసినా తమకు అభ్యంతరం లేదని, అయితే సీఎం జగన్‌ను, ఆయన సతీమణి వైఎస్ భారతిని విమర్శిస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. అమ్మాజీ బుధవారం నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ క్విడ్ ప్రోకో అనేది చంద్రబాబుకు, అనితకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు.

శిఖండిలా చంద్రబాబు రాజకీయాలు: వరుదు కళ్యాణి



బీచ్‌రోడ్డు (విశాఖపట్నం): సీఎం వైఎస్ జగన్‌పై చంద్రబాబు ఆడవాళ్లను అడ్డుపెట్టి శిఖండిలా బాణాలు వేస్తున్నాడని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖపట్నంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాజకీయ పోరాటం చేస్తున్నది సీఎం జగన్ అని.. దమ్ము, ధైర్యం ఉంటే ఆయనపై పోరాటం చేయాలన్నారు. 'నిజంగా మీకు దమ్ముంటే భువనేశ్వరితో మాట్లాడించండి.. లేదంటే బ్రాహ్మణితో మాట్లాడించండి.. మేం ఏం సమాధానం చెప్తామో చూడండి. అంతేగానీ భారతమ్మ కాలిగోటితో కూడా సరిపోని వ్యక్తులు మాట్లాడటం సిగ్గుచేటు' అని మండిపడ్డారు.

తూర్పు కాపులకు కేంద్ర ఉద్యోగాల్లో ఓబీసీ రిజర్వేషన్లు

ఎంపీ జీవీఎల్ నరసింహారావు వెల్లడి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, కేంద్ర విద్యా సంస్థల్లోని సీట్ల భర్తీలో తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్లు వర్తింపజేసేందుకు ఎన్‌సీబీసీ ఆమోదం తెలిపిందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆయన బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ తూర్పు కాపులకు రాష్ట్రంలో 15 ఏళ్ల క్రితమే రిజర్వేషన్ వచ్చినప్పటికీ.. కేంద్రం ఆమోదం తెలపడంలో ఆలస్యం జరిగిందన్నారు.



ఏ పుస్తకమూ అంత చెడ్డది కాదు...
అందులో ఎంతోకొంతైనా మంచి లేకుండా ఉండదు.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి

గురువారం, 23 నవంబర్ 2023

పీకల మీదకొచ్చింది!

ముప్పు ముంచుకొచ్చినప్పుడు కాని మేలుకోకపోతే కష్టమే. పరిస్థితి చూస్తే అలానే ఉంది. పర్యావరణ మార్పులపై సంబంధిత పక్షాల సదస్సు తాజా సమావేశం (కాప్–28) ఈ నెలాఖరు నుంచి డిసెంబర్ 12 దాకా దుబాయ్‌లో జరగనుంది. ఏటేటా ఐరాస ఆధ్వర్యంలో ఇది మొక్కుబడి తంతుగా మారిపోతున్న వేళ కొద్దిరోజులుగా వివిధ నివేదికలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. ఇప్పటికే పరిస్థితి విషమించిందని వెల్లడిస్తున్నాయి. రోజువారీ సగటు ప్రపంచ ఉష్ణోగ్రతలు తొలి సారిగా ఈ నవంబర్ 17న పారిశ్రామికీకరణ మునుపటి హద్దు దాటి 2 డిగ్రీల సెల్సియస్ పెరిగాయన్న వార్త ఆందోళన రేపుతోంది. పుడమిపై కర్బన ఉద్గారాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ దేశాలు తాము పెట్టుకున్న లక్ష్యాల గురి తప్పుతూనే ఉన్నాయని స్పష్టమవుతోంది. ఎప్పటికప్పుడు పర్యావరణ పరిరక్షణకు ప్రతిన చేస్తున్నా, నష్టనివారణకు నిధుల కొరత పీడిస్తూనే ఉంది.

ఆహార అభద్రత మొదలు వ్యాధుల దాకా అనేక రకాలుగా వాతావరణ మార్పులు ప్రతి ఒక్కరిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రజారోగ్యంలో దశాబ్దాలుగా సాధించిన ప్రగతిని దెబ్బ తీస్తున్నాయి. ఆ నేపథ్యంలో వాతావరణ మార్పులపై తాజా నివేదికలు అలజడి సృష్టిస్తున్నాయి. పుడమి మీది ఒక శాతం అత్యంత ధనికులే మొత్తం ప్రపంచ జనాభాలోని 66 శాతం మంది కలగజేసేటంత భూతాపానికి కారణమని ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక తేల్చింది. ఇక, 'కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ ఛేంజ్' అంటూ గత వారం లాన్సెట్ వెలువరించిన 8వ వార్షిక నివేదిక ప్రజారోగ్యం, ఆరోగ్య రక్షణ వ్యవస్థలపై పడే ప్రభావాన్ని కళ్ళకు కట్టింది. పర్యావరణ మార్పుకు ప్రధాన కారణాలైన శిలాజ ఇంధనాల వినియోగం లాంటి వాటికి అడ్డుకట్ట వేయకుంటే, ప్రజల ఆరోగ్యానికే పెను ప్రమాదమని లాన్సెట్ నివేదిక హెచ్చరిస్తోంది.

భారత్‌కు సంబంధించి ఈ నివేదిక చెప్పిన అంశాలు, చేస్తున్న హెచ్చరికలు ఆలోచన రేపుతున్నాయి. మన దేశంలో 1986 – 2005 మధ్య కాలంతో పోలిస్తే, 2018 – 2022 మధ్య కాలంలో సగటు వేసవి ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల సెల్సియస్ పెరిగాయట. ఇప్పటికే ఈ అధిక ఉష్ణోగ్రత పిల్లల నుంచి పెద్దల వరకు అందరి ఆరోగ్యాన్నీ దెబ్బ తీస్తోంది. ఈ వాతావరణ పరిస్థితులు మలేరియా, డెంగ్యూ కేసుల్ని పెంచుతున్నాయి. అలాగే సముద్రతీర ప్రాంతాల్లో గ్యాస్ట్రో ఎంటరైటిస్, సెప్సిస్, కలరాలకు సానుకూలంగా తయారవుతున్నాయి. అలాగే, 'బ్రోకెన్ రికార్డ్' శీర్షికన ఐరాసా వెల్లడించిన తాజా నివేదిక సైతం పరిమితులు దాటి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల పెరిగిన కథను వివరించింది. వెరసి, ఉష్ణోగ్రతలు పారిశ్రామికీరణకు ముందు స్థాయి కన్నా 2 డిగ్రీలు, వీలుంటే 1.5 డిగ్రీలు మించి పెరగరాదని 2015 నాటి ప్యారిస్ ఒప్పందం (పీఏ)లో చేసుకున్న బాసలు చెరిగిపోయేలా కనిపిస్తున్నాయి. నికరంగా కర్బన ఉద్గారాలు లేని 'నెట్ జీరో'కు కట్టుబడతామని అనేక దేశాలు మాట ఇస్తున్నా, అది 'విశ్వసనీయంగా' లేదని తాజా నివేదిక తేల్చేసింది.

భూతాపం పెంపును 1.5 డిగ్రీల లోపలకు నియంత్రించే అవకాశాలు నూటికి పద్నాలుగు వంతులేనట! 2021తో పోలిస్తే 1.2 శాతం ఎక్కువగా 2022లో ప్రపంచమంతా కలసి 57.4 బిలియన్ల కర్బన ఉద్గారాలను వెలువరించిందని లెక్క. అలాగే, కరోనాలో 4.7 శాతం తగ్గిన ఉద్గారాలు ఈ ఏడాది మళ్ళీ కరోనా ముందు స్థాయికి చేరిపోవచ్చని అంచనా. నిజానికి, పర్యావరణ మార్పు, ధనిక – బీద అసమానతలు విడదీయరాని జంట. ప్రధానంగా ధనిక దేశాల పాపానికి పేద దేశాలు బలి అవుతున్నాయి. పర్యావరణ మార్పు ప్రభావాన్ని మోస్తున్నాయి. ధనిక దేశాలు కర్బన ఉద్గారాలను తగ్గించాలనీ, చేసిన నష్టానికి పరిహారం చెల్లించాలనీ కాప్28 లాంటి చోట్ల పేద దేశాలు ఒత్తిడి తెస్తున్నది అందుకే. కానీ, అతి తక్కువ సంఖ్యలోని ఆ ధనిక దేశాలే ప్రపంచ పర్యావరణ విధానాన్ని నిర్ణయిస్తుండడంతో పరిష్కారం దిశగా అడుగులు పడడం లేదు.

ఈజిప్ట్‌లో నిరుడు కాప్27 సదస్సులో 'నష్ట పరిహార నిధి'ని ఏర్పాటు చేయాలంటూ ఒప్పందం కుదిరింది. స్వీయ కర్బన ఉద్గారాలు తక్కువే అయినా ధనిక దేశాల ఉద్గారాలతో నష్టపోతున్న బీద దేశాలను పర్యావరణ మార్పు ప్రభావాల నుంచి కాపాడేందుకు ఈ నిధిని ఉద్దేశించారు. ఆలోచన మంచిదైనా, ఆచరణకు వచ్చే సరికి ఆ నిధి ద్వారా డబ్బులు ఎవరిస్తారు, ఎవరికి ఇస్తారనేది ఇప్పటికీ తేలనే లేదు. ఇంకా చిత్రమేమిటంటే– పర్యావరణానికి తూట్లు పొడిచే భారీ చమురు ప్రణాళికలు వేస్తున్న దుబాయ్‌లో కాప్28 సమావేశం జరగనుండడం! అలాగే, వాతావరణ సంక్షోభం, ప్రకృతి సంక్షోభం... ఈ రెంటినీ భిన్నమైన సవాళ్ళుగా భావిస్తూ, స్పందిస్తున్నాం. వాటి వల్ల సమాజంలో తలెత్తే సంక్షోభాన్ని అర్థం చేసుకోవడం లేదు. ప్రపంచమంతా చేస్తున్న ప్రమాదకరమైన తప్పు అదే!

తీవ్ర వాతావరణ ఘటనలతో వర్ధమాన దేశాల్లో బాలికలకు నాణ్యమైన విద్య దెబ్బ తింటోందని ప్లాన్ ఇంటర్నేషనల్ నివేదిక మాట. పర్యావరణ బాధిత 30 దేశాల్లో ఏటా కనీసం 1.25 కోట్ల మంది బాలికలు అర్ధంతరంగా చదువుకు గుడ్‌బై చెప్పడానికి వాతావరణ మార్పులు కారణమవుతాయని 'మలాలా ఫండ్' సైతం హెచ్చరిస్తోంది. ఇలాంటి గణాంకాలెన్నో వాస్తవ పరిస్థితికి ప్రతిబింబం. అందుకే, పర్యావరణ మార్పు గురించి మాటల కన్నా చేతలు ముఖ్యం. రానున్న దుబాయ్ సదస్సులోనూ ప్యారిస్ ఒప్పందం తాలుకు అమలు తీరుతెన్నులపై ప్రపంచం మళ్ళీ చర్చిస్తుంది. ఈసారైనా మాటలు తగ్గించి, చేతలపై దృష్టి పెడితే మంచిది. ఎందుకంటే, పర్యావరణంపై ప్రపంచం ఇప్పటికే గాడి తప్పింది. దుష్ఫలితాలూ చూస్తోంది. తాజా హెచ్చరికలు పెడచెవిన పెడితే మరిన్ని కష్టాలు తప్పవు. ప్రపంచానికి పరిష్కారం ఎడారి దేశంలోనూ ఎండమావిగా మారితేనే మానవాళికి నష్టం.

విదేశీ విద్యను ఇక్కడే కల్పించేలా...

భారతదేశంలో విదేశీ ఉన్నత విద్యా సంస్థల (ఎఫ్‌హెచ్‌ఇఐ) క్యాంపస్‌ల ఏర్పాటు, నిర్వహణ కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న క్రమబద్ధీకరణను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొన్ని రోజుల క్రితం విడుదల చేసింది. ఈ క్రమబద్ధీకరణ ఉదారంగానూ, సమర్థంగానూ ఉందని చెప్పాలి. ఇది నూతన విద్యా విధానపు సిఫార్సులను అనుసరిస్తోంది. అయితే, ఇది ఇప్పటికే ఉన్న దేశంలోని విద్యా వ్యవస్థలను సవాలు చేయడానికి ప్రయత్నించడం అనేది ఒక అవకాశంతోపాటు ఆందోళన కరమైన విషయం కూడా! ఇంకా, విదేశీ ఉన్నత విద్యా సంస్థ తన భారతీయ క్యాంపస్‌లోని విద్యాపరమైన నాణ్యతను తమ దేశంలోని ప్రధాన క్యాంపస్‌తో సమానంగా ఉండేలా చూసుకోవాలి. చాలా గొప్ప ఆలోచనే అయినప్పటికీ, క్రమబద్ధీకరణ యంత్రాంగం దీన్ని ఎలా అనువర్తించగలుగుతుంది?

యూజీసీ క్రమబద్ధీకరణ విదేశీ ఉన్నత విద్యాసంస్థలకు పాలన పరంగా ప్రత్యేక అధికారాలకు అనుమతిస్తోంది. అన్ని విభాగాలలో యూజీ/ పీజీ/ డాక్టోరల్/ పోస్ట్‌డాక్టోరల్ అధ్యయనాలు, డిగ్రీల ప్రదానం, డిప్లొమాలు, సర్టిఫికేట్‌లను ఇచ్చే వీలు కల్పిస్తోంది. ఈ విదేశీ విద్యా సంస్థలు మొత్తం సబ్జెక్ట్‌వారీగా, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 500 లోపు ఉంటే అది నిజంగా గొప్ప అడుగే. కాకపోతే, ప్రపంచంలో కనీసం 20 ప్రముఖ ర్యాంకింగ్ ఏజెన్సీలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన అనేక సంస్థలు వివిధ కారణాల వల్ల ఈ ర్యాంకింగ్ సంస్థల చర్యలలో పాల్గొనడం లేదనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈ ర్యాంకింగ్‌లను ఎలా ప్రామాణీకరిస్తారనేది ప్రశ్న. కాకపోతే భారతీయ, విదేశీ ఉన్నత విద్యాసంస్థల మధ్య సహకారం కోసం 2022లో జరిగిన విద్యా సంబంధ సహకార నియంత్రణ నేపథ్యంలో చూస్తే, ఉమ్మడి డిగ్రీ, ద్వంద్వ డిగ్రీ కార్యక్రమాలకు ఉత్తేజకరమైన కాలం ముందుందని చెప్పొచ్చు.

దేశంలో అడుగుపెట్టే విదేశీ ఉన్నత విద్యా సంస్థలు, ఈ క్రమబద్ధీకరణ ద్వారా, భారతీయ ఉన్నత విద్యా సంస్థలు లేదా భారతీయ కంపెనీలతో జాయింట్ వెంచర్‌లోకి ప్రవేశించవచ్చు. జాయింట్ వెంచర్లు అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ పక్షాలు తమ వనరులతో ఒక నిర్దిష్ట పనిని పూర్తి చేయడానికి అంగీక రించే వ్యాపార పరమైన ఏర్పాటు అని మనం అర్థం చేసుకున్నప్పటికీ – విదేశీ ఉన్నత విద్యా సంస్థ భౌతిక, విద్యా, పరిశోధనా మౌలిక సదుపాయాలతో కూడిన స్వతంత్ర క్యాంపస్‌ను కలిగి ఉండాలని ఈ నిబంధన ఎందుకు నొక్కి చెబుతోంది? దాని విద్యాపరమైన, పరిశోధనా కార్యక్రమాలను సీరి యస్‌గా నిర్వహించడానికి ఏ విదేశీ ఉన్నత విద్యా సంస్థ అయినా భారతదేశంలో ఉండటం కోసం భూమిపై, వనరులపై పెట్టుబడి పెడుతుందా? దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న భారతీయ క్యాంపస్‌లతో వనరులను పంచుకునే సహకార క్యాంపస్ నమూనా మరింత ఆచరణీయంగా ఉంటుంది.

ఇప్పుడు 'కంపెనీ' పాత్రను చూద్దాం. నిర్దేశిత లక్ష్యాల కోసం, సెక్షన్ 8 కింద నమోదు అయిన కంపెనీ, లాభాలు ఏవైనా ఉంటే, వాటిని ఆ నిర్దేశిత లక్ష్యాల కోసమే ఉపయోగించాలి. లాభాలను దాని సభ్యులకు చెల్లించకూడదు. ఇంకా, ఇండియన్ ట్రస్ట్ చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం, ఒక విదేశీయుడు లేదా ఎన్నారై, భారతీయ ట్రస్ట్‌కు ట్రస్టీగా ఉండకూడదు. అయితే ఫెమా చట్టం, 1999 నిబంధనలకు అనుగుణంగా ఉండే పక్షంలో నిధులను సరిహద్దులు దాటించడానికీ, విదేశీ కరెన్సీ ఖాతాల నిర్వహణకూ, చెల్లింపులకూ, అమ్మకాలకూ అనుమతిస్తోందని తెలుస్తున్నప్పుడు ఇక్కడ ఏదో లోపం ఉందని గమనించాలి. నిధులను స్వదేశానికి పంపగలిగే వీలు ఉన్నట్లయితే, సంబంధిత విదేశీ ఉన్నత విద్యా సంస్థ లాభాలను పొందగలదని దీని అర్థమా? అంటే ఇప్పుడు విద్య 'లాభార్జన' కోసమా?



భవిష్యత్తులో భారతదేశం ఆకర్షణీయమైన ప్రపంచ అధ్యయన గమ్యస్థానంగా మారుతుందని ఈ క్రమబద్ధీకరణ ఆశిస్తోంది. ఏ విదేశీ ఉన్నత విద్యాసంస్థలు, ఏయే కార్యక్రమాలతో తమ క్యాంపస్‌లను మన దేశంలో ఏర్పరుస్తాయి; వారు స్థానిక అధ్యాపకులను తీసుకుంటారా, అంతర్జాతీయంగానా; విద్యార్థుల ప్రవేశం కోసం వారు ఉపయోగించే కొలమానాలు ఏవి అనే అంశాలపై ఇది ఆధారపడి ఉంటుంది. సాంప్రదాయకంగా, అక్రిడిటేషన్ అనేది భారతదేశంతో పాటు చాలా దేశాలలో నాణ్యతా తనిఖీ విధానం. విదేశీ ఉన్నత విద్యా సంస్థ నాణ్యతాపరమైన హామీ, ఆడిట్‌కు లోనవుతుందనీ, యూజీసీకి తన నివేదికను సమర్పించాలనీ ఈ క్రమబద్ధీకరణ నిర్దేశిస్తోంది. ఏదైనా నెరవేరదగిన హామీ నెరవేర్చని పక్షంలో వినియోగదారు న్యాయస్థానంలో పరిష్కారాన్ని కోరవచ్చు.

ఒక విదేశీ ఉన్నత విద్యా సంస్థ తన రుసుముల చట్రాన్ని నిర్ణయించుకోవడానికి ఈ క్రమబద్ధీకరణ అనుమతించడం నిజానికి ప్రగతి శీలమైనది. భారతదేశంలోని విద్యాసంస్థలు మాత్రం ఫీజు నిర్ణాయక కమిటీల ఇష్టాలకు లోబడుతున్నప్పుడు, విదేశీ ఉన్నత విద్యాసంస్థలకు ఈ ప్రత్యేక గౌరవం ఎందుకు? ఫెమా నిబంధనలు ఉన్నప్పటికీ, పరిమాణాత్మకం కాని మొత్తాలను ఎల్లప్పుడూ సర్దుబాటు చేయవచ్చు. అలాంటప్పుడు, అకడమిక్ పరపతి ఆధారితమైన రుసుము చట్రాన్ని తప్పనిసరి చేయడం మరింత విశ్వసనీయమైన ఎంపిక.

విదేశీ ఉన్నత విద్యా సంస్థ అందించే కార్యక్రమాలు ఆన్‌లైన్, బహిరంగ మరియు దూరవిద్యా (ఓడీఎల్) విధానంలో అనుమతించబడవు అనే షరతు నిర్బంధపూరితంగా ఉంది. ఎమ్ఐటీ, స్టాన్‌ఫోర్డ్, హార్వర్డ్ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలు అద్భుతమైన ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లను కలిగి ఉన్నాయి. ఇటీవలి కాలంలో యూజీసీ అనేక ఓపెన్, దూరవిద్యా నిబంధనలను సడలించినప్పుడు, వాటిని మన విద్యార్థులకు ఎందుకు దూరంచేయాలి?

విశ్వవిద్యాలయాల ప్రపంచ ర్యాంకింగ్‌లను గుర్తించడానికి రెండు ముఖ్యమైన కొలమానాలు ఏవంటే... అంతర్జాతీయీకరణ, పరిశోధన. భారతీయ క్యాంపస్‌లలో విదేశీ విద్యార్థులు, అధ్యాపకులు వర్ధిల్లడాన్ని అంతర్జాతీయీకరణ అంటారు. ఒక ప్రముఖ ఫ్యాకల్టీ ఎక్కువ డబ్బు సంపాదించడం లేదా మెరుగైన పరిశోధనా సౌకర్యాల కోసం, లేదా తన పరిధిలోని అత్యుత్తమ వ్యక్తులతో పరస్పర సంభాషణ కోసం; అవకాశాలను అన్వేషించడం లేదా కొత్త ఉత్పత్తులు, ప్రక్రియలకు దారితీసే పేటెంట్లను, ఐపీఆర్‌లను తమ హోదాకు జతచేసుకోవడం కోసం పనిచేస్తారు. అవి సాధ్యం కాదని తెలిసినప్పుడు, మహా అయితే ఏదో ఒక వారం సందర్శన కోసం తప్ప, ఎవరూ బయటకు రారు. అప్పుడు విదేశీ ఉన్నత విద్యా సంస్థ ఎలా పని చేస్తుంది?

అధ్యాపకులు, సిబ్బంది నియామకంలో పూర్తి స్వయంప్రతిపత్తి ఈ క్రమబద్ధీకరణలో అత్యంత ముఖ్యమైన భాగం. మన సంస్థలలోని అత్యుత్తమ అధ్యాపకులు విదేశీ ఉన్నత విద్యా సంస్థలకు వలసవెళ్లే అవకాశం ఉండటం ఈ నిబంధనకు రెండో కోణం. బహుశా, చివరికి ఒక కొత్త సాధారణ స్థితి ఏర్పడవచ్చు. ఆ స్థితి మన విద్యా సంస్థలలో నాణ్యతను పెంచినట్లయితే, దానిని స్వాగతించాలి.

మన విద్యా సంస్థల ఫీజు కమిటీ సిఫార్సులు, అడ్మిషన్ల కోసం రాష్ట్ర లేదా కేంద్ర నిబంధనలు మొదలైన వాటికి కట్టుబడి ఉండాలి. అధ్యాపకు లను ఎన్నుకోవడంలో, ఫీజులను నిర్ణయించడంలో ప్రవేశ నిబంధనలను ఏర్పర్చడంలో మన సంస్థలకు స్వయం ప్రతిపత్తిని ఎందుకు పొడిగించకూడదు? అవన్నీ అంతర్జాతీయ ర్యాంకింగ్ సంస్థలకు చెందిన అవే కొలమానాలపై పోటీ పడాలని భావిస్తున్నాం కదా!

ఏదైనా ప్రయోగం విషయంలో దాని విమర్శకులు దానికి ఉంటారు. విదేశాల్లోని మాతృసంస్థల్లో అయ్యేదానితో పోల్చినప్పుడు తక్కువ ఖర్చుతో, విదేశీ విద్యార్హతలతో భారతీయ విద్యార్థులు నాణ్యమైన విద్యను ఇక్కడే పొందేందుకు ఈ క్రమబద్ధీకరణ వీలు కల్పిస్తే, ఇది స్వాగతించాల్సిన విషయమే. అయితే ఐఐటీల వంటి మన ప్రథమశ్రేణి విద్యాసంస్థలను సాధారణంగా ఎంపిక చేసుకునే విద్యార్థులు కూడా ఈ కొత్త క్యాంపస్‌లలో చేరేలా ప్రభావితం అయితే, అది ఆందోళన కలిగించే అంశం అవుతుంది. అందుకే, నాణ్యతా ప్రమాణాలు ఎన్నో రెట్లు పెరిగినందున విద్యారంగానికి భారీ పెట్టుబడులు అవసరం. పరిశోధనా సౌకర్యాల్లో భారీ స్థాయి వృద్ధి అవసరం. ప్రభుత్వ నిధులను అలా ఉంచుతూనే, విదేశీ నిధులను అనుమతించడం, విజయవంతమైన వ్యవస్థలను అనుసరించడం మేలు.

ఎస్ఎస్ మంథా, ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) మాజీ ఛైర్మన్; అశోక్ ఠాకూర్, కేంద్ర ప్రభుత్వ విద్యా శాఖ మాజీ కార్యదర్శి ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పరిస్థితి



ప్యూ రీసెర్చ్ సెంటర్ కొత్త అంచనాల ప్రకారం, యూఎస్‌లో 7,25,000 మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారు. అసలు సంఖ్య ఇంకా ఎక్కువ కూడా ఉండొచ్చు.

– మహమ్మద్ జుబేర్, జర్నలిస్ట్

తప్పదా?



ఉత్తరకాశిలోని సొరంగంలో చిక్కుకున్న ఆ 41 మంది చిట్టచివరికి బయటకు రాగానే, స్వాగతించడానికి 'ఆయన' అక్కడ ఉండి, వారి వెన్ను తడతాడేమో అన్న ఫీలింగ్ వస్తోంది.

– అతుల్ ఖత్రీ, కమెడియన్

జాగ్రత్త



తుర్కులకు (తుర్కియే) సమర్థమైన సైన్యం ఉంది. నెల రోజుల లోపలే తమ బలగాల సంఖ్యను 20 లక్షల సంఖ్యకు పెంచుకోగలరు. గమనిస్తూ ఉండండి.

– డగ్లస్ మాక్‌గ్రెగర్, యూఎస్ ఆర్మీ రిటైర్డ్ కల్నల్

బ్రాహ్మణ ఘనత



మీకు తెలుసా? ఉమ్మడి శకం 629లో భారత్‌కు హ్యూయన్ త్సాంగ్ ప్రయాణించక ముందే, సుయీ వంశ అధికారిక చరిత్ర (ఉమ్మడి శకం 610)... ఖగోళ శాస్త్రం, గణితం, రసాయన శాస్త్రం మీద బ్రాహ్మణులు రాసిన 12 పుస్తకాలను ఉపయుక్త గ్రంథ సూచిగా ఇచ్చింది. సుయీ వంశం చైనీస్ చరిత్రలో స్వర్ణయుగానికి పునాది వేసింది. (ఇక్కడ బ్రాహ్మణ అనేది పుస్తక శీర్షికల్లో భాగం కావడం విశేషం. ఉదా: పొలొమే సువాన్ ఫా– బ్రాహ్మణ గణితం; పొలొమే థియెన్ వెన్ చింగ్– బ్రాహ్మణ ఖగోళ కరదీపిక.)

– సావిత్రి ముముక్షు, డిజైనర్

రోజూ తినొచ్చు



ఒక్క ఖర్జూరం (8 గ్రా.) 23 కేలరీలను ఇస్తుంది. అది పొటాషియం, మ్యాగ్నీషియంలకు మంచి వనరు. రోజుకు 1–2 తినొచ్చు. స్థూలకాయులు, మధుమేహం ఉన్నవాళ్లు మాత్రం ఎక్కువ తినకుండా ఉంటే మంచిది.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దశాబ్దాల విద్యాసుమ గంధం

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశవ్యాప్తంగా పాఠశాలల స్థాపనకు ప్రాధాన్యం ఇచ్చారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలుకా చాట్రగడ్డ (మైనేనివారిపాలెం) గ్రామంలో 1953లో 7 ఎకరాల స్థలంలో స్థాపించిన పాఠశాల అందులో ఒకటి. దీనికి ప్రధాన సంకల్పం చేసింది– రాజర్షి వీరమాచనేని ఆంజనేయశాస్త్రి. వారు మైనేనివారి పాలెం, నల్లూరు, శింగుపాలెం, మొర్తోట తదితర గ్రామాల ప్రజలను ఉత్తేజపరచి మలయాళ స్వాముల వారు పెట్టిన ఆశ్రమం పేరుతో 'సనాతన వేదాంత నిష్కాశ్రమ పాఠశాల' నెలకొల్పారు. అప్పటికి మద్రాసు రాష్ట్రంలో ఈ ప్రాంతం ఉండేది. పాఠశాల ప్రారంభించటానికి కావలసిన ఉత్తర్వులు వెలగపూడి రామకృష్ణ (కేసీపీ) ఇప్పించారు. గ్రామస్థులే పాఠశాల నిర్మించి, కొంత కాలం నిర్వహిస్తేనే ప్రభుత్వపరమైన సహాయం ఇస్తామనడంతో చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు చందాలు ఇచ్చి రెండు అంతస్తుల భవనం నిర్మించుకొని 'టాగూర్ బిల్డింగ్స్' అని నామకరణం చేసుకొన్నారు. గ్రామం నుండే సన్యాసాశ్రమం తీసుకున్న ఏర్పేడు వ్యాసాశ్రమ రెండవ పీఠాధిపతి శ్రీ విమలానంద స్వాములు పాఠశాల భవనం అయిన టాగూర్ బిల్డింగ్స్‌పై 'యా విద్యా సా విముక్తియే' అని ఆశీర్వదించి, ప్రకటించారు.



సనాతన వేదాంత నిష్కాశ్రమ పాఠశాల

గత ఏడు దశాబ్దాలలో ఈ పాఠశాల దేశం గర్వించ దగ్గ నాయకులు, డాక్టర్లు, విద్యావేత్తలు, వ్యాపార వేత్తలు, ఇంజినీర్లు, సైనికాధికారులు వంటివారిని ఎంతోమందిని తయారుచేసింది. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా స్థిరపడ్డారు. కాలక్రమేణా ఈ పాఠశాలలో చేరే విద్యార్థులు తగ్గిపోయారు. ఇది తెలుగు మాధ్యమ పాఠశాల కావడం, ఇందులో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకే ఉండడం వల్ల పిల్లలు చేరడం లేదు. పెద్దలు పెట్టిన పాఠశాలను ఎలాగైనా ముందుకు తీసుకు వెళ్ళాలనీ, ఎల్‌కేజీ నుండి 12 వరకు ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల నిర్వహిస్తేనే మనుగడ ఉంటుందనీ భావించారు. అయితే దానికి సరిపోయే వనరులు సనాతన వేదాంత నిష్కాశ్రమ సంఘానికి లేవని భావించి, నిర్వహణ భారాన్ని ఈ పాఠశాల ఆశయాలకు దగ్గరగా ఉన్న 'శ్రీసరస్వతీ విద్యామందిర్' వారికి మార్చిలో అప్పగించటం జరిగింది. ఈ ఏడాది జూన్ 10న ఎస్.వి.ఎన్.ఎ. శ్రీ సరస్వతీ విద్యామందిర్ పునఃప్రారంభమైంది. తొలి సంవత్సరంలో ఎల్‌కేజీ నుండి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభించగానే 105 మంది చేరారు. క్రమేణా 12వ తరగతివరకు నిర్వహింపబడుతుంది.

ఈ సందర్భంగా ఏడు దశాబ్దాలపాటు ఈ పాఠశాలలో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఈ నవంబర్ 26న ఉదయం పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నాం. అందరూ ఆహ్వానితులైన ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుండి ఎంతోమంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబాలతో కలిసి పాల్గొననున్నారు.

– సనాతన వేదాంత నిష్కాశ్రమ విద్యాసంఘం
(నవంబర్ 26న పూర్వ విద్యార్థుల సమ్మేళనం)


పిల్లల్లో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి!

సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

ఇంగ్లిష్ నేచురలిస్ట్ ఛార్లెస్ డార్విన్ తన జీవ పరిణామ సిద్ధాంతం 'ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పెసీస్' (ON THE ORIGIN OF SPECIES)ను 1859 నవంబర్ 24న ప్రకటించారు. ఈ ఆధునిక వైజ్ఞానిక కాలానికి ఆ సిద్ధాంతం ఎంత ముఖ్యమో గ్రహించడానికి, ఆ శాస్త్రవేత్త మీద ఉన్న గౌరవం ప్రకటించుకోవడానికి 24 నవంబర్‌ను 'ఎవల్యూషన్ డే'గా ప్రపంచ దేశాలన్నీ జరుపుకొంటున్నాయి. దీన్ని పెద్ద ఎత్తున మన దేశంలో కూడా జరపడం చాలా అవసరం. ఎందుకంటే వైజ్ఞానిక దృక్పథం దేశంలో బలపడాలని చెప్పిన భారత తొలి ప్రధాని నెహ్రూ స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ చర్యల్ని తిప్పి కొట్టడానికి సామాన్య ప్రజలు వివేకవంతులై ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి. జీవ పరిణామ సిద్ధాంతం (థియరీ ఆఫ్ ఎవల్యూషన్) పనికి రానిదని ప్రభుత్వం సిలబస్ నుండి తొలగిస్తోంది. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెడతామంటోంది. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే, ప్రగతిశీల భావాలు గల వారంతా వైజ్ఞానిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలి.



'నిన్ను నువ్వు తెలుసుకో' అని దేవుణ్ణి ధ్యానిస్తూ కళ్ళు మూసుకోవడం కాదు, నువ్వెవరు? ఎన్ని పరిణామాలు జరిగి, నువ్వు ఇలా మారావు అన్నది తెలుసుకుంటే నీ కళ్ళు తెరుచుకుంటాయి. ఎన్నెన్ని మానవ జాతులు ఉద్భవించి అంతరించాయి. ఎన్ని వలసల తర్వాత నీ జాతి ఇప్పుడు నువ్వున్న ప్రాంతానికి చేరింది వంటి విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, తప్పదు – జీవ పరిణామం గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ భగవంతుడి సృష్టిలో నీ పుటక ఒక భాగమని నువ్వింకా భావిస్తూ ఉంటే గనక, నీ మెదడ్లో చీకటి తొలగిపోలేదని అర్థం. చీకట్లోనే జీవితం బాగుందనుకునే వారితో మనకు పేచీ లేదు. జీవితంలో వెలుగులు కావాలనుకునేవారు తప్పక వైజ్ఞానిక స్పృహ పెంచుకుంటారు. జీవ పరిణామం గురించి తెలుసుకుంటారు. మత మౌఢ్యాన్ని చావు దెబ్బ తీసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడిన ఆ రోజును గుర్తు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం 'ఎవల్యూషన్ డే' జరుపుకుంటారు.

అర్థవంతమైన వైజ్ఞానిక కార్యక్రమాలు విద్యాసంస్థల్లో గానీ, పౌర సమాజాల్లో గానీ, కుటుంబాల్లో గానీ ఏ ఒక్కటైనా నిర్వహిస్తున్నారా? లేదు కదా? అందుకే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్సు కార్యకర్తలు, బాధ్యతగల పౌరులు, వివేకవంతులైన అధికారులు, మరీ ముఖ్యంగా మహిళలు పూనుకుని దేశంలో కొనసాగుతున్న విషమ పరిస్థితులను అర్థం చేసుకుని, ఎక్కడికక్కడ ఎవరికి వారు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలి. ఉట్టి ఆలోచనలతో పని జరగదు. వాటిని ఆచరణలో పెట్టాలి. విద్యాసంస్థల్లో పని చేసే వారిపై బాధ్యత మరింతగా ఉంది. విద్యార్థులకు జీవపరిణామంపై, డార్విన్‌పై, సందర్భాన్ని బట్టి ఇంకా అనేక వైజ్ఞానిక అంశాలపై వ్యాస రచన / ఉపన్యాస పోటీలు పెడుతూ వారిలో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి. భావి భారత పౌరులు వారే గనక, మనం వారి మీదే శ్రద్ధ పెట్టాలి. వారిని హేతుబద్ధంగా ఆలోచింప జేయాలి. మానవవాదులుగా తీర్చిదిద్దుకోవాలి. చేస్తున్న కార్యక్రమాలతో మనం మరొకరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత
(నేడు జీవ పరిణామ దినోత్సవం)

ఏది అధర్మం?

ధర్మం గురించి తెలుసుకోవటం ఎంత ముఖ్యమో, అధర్మం గురించి తెలుసుకోవటం కూడా అంతే ముఖ్యమని చెప్పాయి మన శాస్త్రాలు. రోగి స్వస్థత కోసం వైద్యుడు ముందుగా రోగ లక్షణాలు తెలుసుకొని వాటిని తొలగించటానికి ఏ విధంగా ప్రయత్నిస్తాడో, ఆ విధంగా ధర్మాచరణానికి ఆటంకం కలిగించే అధర్మం ఏమిటో తెలుసుకొని, దానిని అవశ్యం పరిహరించవలసిన విషయంగా మన వారు భావించారు. ఏది చెయ్యకూడదని పూజ్యులు మహాత్ములైన వారు నిర్ణయించారో, దానిని బుద్ధిపూర్వకంగా చెయ్యటం అధర్మమని పెద్దలు నిర్వచించారు.

అధర్మపరులు తాత్కాలికంగా భోగభాగ్యాలు అనుభవిస్తుండటం చూసి ధార్మికుడైనవాడు ఆశపడో, మోసపోయో తాను ఆ ఉచ్చులో చిక్కుకొనకూడదు. తాను తన ధర్మం విడనాడకూడదు. అధర్మాచరణ వల్ల ప్రాప్తించిన పాపం, పక్వమైనపుడు ఆ పాపం అధార్మికుణ్ణి సమూలంగా నాశనం చేస్తుంది. ధర్మ కార్యం పుణ్యం, అధర్మకార్యం పాపం. పాప పుణ్యాలు ఈ జన్మకే పరిమితమైనవి కావు. వచ్చే జన్మలో కూడా వెంట వస్తాయి. 'ఆత్మావై పుత్ర నామాసి' అని వేదం చెప్తోంది. తానే పుత్రుడుగా జన్మించినందున, అతడు అప్పుడు జన్మించినా, పుత్రుడి రూపంలో అనుభవించేది తానే.



అధర్మవర్తనుడు తను చేసిన పాపం ఫలితాలను ఏ విధంగా అనుభవిస్తాడు అంటే, అతడు వ్యాధిగ్రస్తుడు కావచ్చు, అతడికి ధన నష్టం కలగవచ్చు, మతి స్థిమితం కరువు కావచ్చు, అతడిని దౌర్భాగ్యం వెన్నాడవచ్చు, సొంత మనుషులే పరాభవించవచ్చు. ఇట్లా అనేక విధాలుగా ఉండవచ్చు.

అధర్మజనితమైన పాపాల్లో మహాపాతకాల నుండి సామాన్య పాతకాల వరకు – భ్రూణ హత్య నుండి సరదా కోసం ఆడే అబద్ధాల వరకు – అనేక రకాలైన పెద్దా చిన్నవి ఉన్నవని శాస్త్రాల్లో చెప్పబడ్డవి. ఏ పాపమైనా అనుభవించనిదే తీరదన్నారు.

పాపాల్లో మళ్ళీ వ్యక్తిగతమైనవీ, దేశారిష్ట కారకమైనవీ ఉన్నాయంటారు. వ్యక్తిగతమైనవి అతడితో సరి. వాడి పాపం వాడినే కట్టి కుడుపుతుంది. దేశోపద్రవకారకమైనది అలా కాదు. అది దావానలంలా అందరినీ చుట్టుముడుతుంది. గ్రామానికీ, నగరానికీ, దేశానికీ అధిపతులుగా ఉన్నవారు తాము అధర్మం ఆచరించి, వారి వారి ప్రజల చేత ఆ అధర్మం ఆచరింపజేసినపుడు, ఆ అధర్మం వల్ల ఆ గ్రామానికీ, నగరానికీ, దేశానికీ అరిష్టం వాటిల్లుతుందని శాస్త్రం చెబుతోంది. ఉదాహరణకు రావణుడు 'సీతాపహరణం' అనే అధర్మం ఆచరించి, లంకలోని రాక్షసుల చేత కూడా అధర్మం ఆచరింపజేసినందున, రావణుడు నాశనం అవటమే కాక, వంశ నాశనం, లంకాదహనం వంటి అరిష్టాలు సంభవించాయి.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.10.22 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర సా.5.24 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** తె.4.43 నుండి 6.13 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృత ఘడియలు:** ప.12.54 నుండి 2.24 వరకు, ప్రబోధనైకాదశి; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.12, **సూర్యాస్తమయం:** 5.20.

రేపు శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానం

- చక్రతీర్థ ముక్కోటి

తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నవంబరు 24వ తేదీ శుక్రవారం శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశికద్వాదశి ఆస్థానం జరుగనుంది. ఈ ఉత్సవ నేపథ్యంలో స్వామివారికి ప్రాతఃకాలంలో నిర్వహించే సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు, తెల్లవారుజామున 4.45 నుంచి 5.45 గంటలలోపు తిరుమాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయం లోపల ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు కైశికద్వాదశి ఆస్థానాన్ని పురాణ పారాయణం ద్వారా నిర్వహిస్తారు. ఈ మహోత్సవాన్ని ఏటా టీటీడీ ఘనంగా నిర్వహిస్తోంది. తిరుమలలో జరిగే మరో అత్యంత ప్రముఖ ఉత్సవమైన చక్రతీర్థ ముక్కోటిని కూడా 24వ తేదీ, శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అర్చకులు, పరిచారకులు మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి ప్రదక్షిణంగా చక్రతీర్థానికి వెళతారు. అక్కడ వెలసిన శ్రీ చక్రత్తాళ్వారువారికి, శ్రీ నరసింహ స్వామి వారికి, శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, పుష్పాలంకారం, పూజలు చేస్తారు. అనంతరం హారతి నివేదించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు.

కొత్త ప్రపంచాన్ని చూసిన భావన

- పార్వేట మండపాన్ని సందర్శించిన మంత్రాలయం పీఠాధిపతి



పార్వేట మండపాన్ని పరిశీలిస్తున్న శ్రీ సుబుదేంద్ర తీర్థస్వామీజీ

తిరుమల: తిరుమల పాపవినాశనం రోడ్డులోని పార్వేట మండపాన్ని కర్నూలు జిల్లా, మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థస్వామీజీ బుధవారం టీటీడీ ఈవో ధర్మారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. అన్నమయ్య కాలంలో నిర్మించిన పార్వేట మండపంపై విమర్శలు రావడంతో స్వయంగా పరిశీలించేందుకు వచ్చామని ఆయన తెలిపారు. మండపాన్ని చూడగానే కొత్త ప్రపంచాన్ని చూసిన భావన కలిగిందన్నారు. సువిశాలంగా, ఉన్నతంగా, శాస్త్రాలకు, సంప్రదాయాలకు అనుగుణంగా మండపాన్ని కట్టారని అభినందించారు. అలాగే కొత్త మండపం నిర్మాణంలో పురాతన శిలలు, కొన్ని నూతన శిలలను ఉపయోగించి సంప్రదాయానికి భంగం కలగకుండా నిర్మించడం బాగుందన్నారు. దీనిపై విమర్శలు సబబు కాదన్నారు. మంత్రాలయంలో కూడా 400 ఏళ్ల క్రితం నిర్మించిన మండపాలను, ఆలయాన్ని దాతల సహకారంతో పునరుద్ధరించినట్టు ఆయన తెలిపారు. విమర్శలు చేసే వాళ్లు వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. పార్వేట మండపాన్ని ఆధునీకరించిన టీటీడీ పాలక మండలిని, ఈవో ఏవీ ధర్మారెడ్డిని అభినందిస్తున్నామని చెప్పారు. అంతకుముందు మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీకి శ్రీవారి ఆలయం తరఫున పెద్ద మర్యాద చేశారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆలయ మర్యాదలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రిమ్స్ ఘటనలో 15 మంది విద్యార్థుల సస్పెన్షన్

ఒంగోలు టౌన్: ఒంగోలు మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో డీఎంఈ నరసింహం ఆదేశాల మేరకు ఇరు వర్గాలకు చెందిన 15 మందిని సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఏడుకొండలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఘటనపై వాస్తవాలను తెలుసుకునేందుకు కమిటీ వేశామన్నారు. అనస్థీషియన్ హెచ్‌వోడీ డాక్టర్ జయసుందరం ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారని, మరో నలుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. 15 రోజుల్లో కమిటీ తన నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. కాలేజీలో జరిగిన ఘటన వివరాలు, అనంతర పరిణామాలను వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ డా.బాబ్జీ, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 8 మంది వైద్య విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారని, తాజాగా వారితో పాటుగా మరో ఏడుగురిని కాలేజీ నుంచి సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఎన్క్వాస్ సర్టిఫికెట్

త్వరలో ఢిల్లీ బృందం పరిశీలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే. పక్కన మురుగుడు హనుమంతరావు తదితరులు

మంగళగిరి: గుంటూరు జిల్లా, మంగళగిరిలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో మార్కండేయ కాలనీ (రాజీవ్ గృహకల్ప) వద్ద గల మరో అర్బన్ హెల్త్ సెంటర్ నేషనల్ ఎస్యూరెన్స్ క్వాలిటీ (ఎన్క్వాస్) సర్టిఫికెట్‌కు ఎంపికైంది. నగరంలో ప్రభుత్వం కొత్తగా తొమ్మిది వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించి ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందిస్తోంది. ఈ క్రమంలో దేశంలో అత్యుత్తమ వైద్య సేవలందించే హెల్త్ సెంటర్‌లను కేంద్ర ఆరోగ్యశాఖ బృందం పరిశీలించి ఎన్క్వాస్ సర్టిఫికెట్ అందజేస్తారు. ఇప్పటికే నగరంలో ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించినందుకు గాను గణపతినగర్, యర్రబాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఎన్క్వాస్ సర్టిఫికెట్ పొందాయి. నూతనంగా ఎంపికైన హెల్త్ సెంటర్‌ను త్వరలో ఢిల్లీ బృందం పరిశీలించనున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరిశీలించి వైద్యులకు, కార్పొరేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చిట్టడవిలో 108 సిబ్బంది సాహసం

- నాలుగు కిలోమీటర్లు నడిచివెళ్లి అత్యవసర చికిత్స
- నిలిచిన గొర్రెల కాపరి ప్రాణాలు




ఫోల్డబుల్ క్లాత్‌స్ట్రెచర్‌లో గురవాంజినేయులు

గుర్రంకొండ: జనసంచారం లేని చిట్టడవిలో నాలుగు కిలోమీటర్లు నడుచుకొంటూ వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న ఓ గొర్రెల కాపరి ప్రాణాలను 108 సిబ్బంది నిలబెట్టిన ఘటన పలువురి ప్రశంసలను అందుకుంటుంది. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ టి.మొరంపల్లె గ్రామానికి చెందిన గురవాంజినేయులు గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న ఇదే గ్రామానికి చెందిన మరో కాపరి రెడ్డెప్పతో కలసి గొర్రెల మందతో గ్రామానికి దక్షిణం వైపున్న ఎల్లుట్ల కొండల్లోకి వెళ్లారు. రాత్రిళ్లు అక్కడే మకాం వేశారు. గత సోమవారం రాత్రి గురువాంజినేయులు అన్నం తినలేదు. మంగళవారం వర్షం ఎక్కువగా కురడవంతో బాగా తడిసిపోయారు. దీనికి తోడు శరీరంలో చక్కెర నిల్వల శాతం బాగా తగ్గిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. తోడుగా వెళ్లిన మరో కాపరి రెడ్డెప్ప ఈ విషయాన్ని గురువాంజినేయులు భార్యకు తెలిపాడు. స్పందించిన 108 సిబ్బంది ఉమాపతి, రమేష్, శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చెరుకుని.. గురవాంజినేయులు భార్య, కుమారుడ్ని తమ వెంట బెట్టుకుని అడవివైపు వెళ్లారు. కొద్దిదూరం వెళ్లిన తరువాత 108 వాహనం ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించలేదు. దీంతో 108 సిబ్బంది వాహనంలో ఉన్న అత్యవసర మందులు, ఫోల్డ్‌బుల్ క్లాత్‌స్ట్రెచర్‌ను తమ వెంట తీసుకుని కొండల్లో రాళ్లు, ముళ్ల దారిలో సుమారు నాలుగు కిలో మీటర్లు ప్రయాణించి అపస్మారక స్థితిలో ఉన్న గురవాంజినేయులుకు వైద్య సేవలు అందించారు. వెంటనే ఫోల్డ్‌బుల్ క్లాత్‌స్ట్రెచర్‌పై గురవాంజినేయులను పడుకోబెట్టి మోసుకుంటూ అతి కష్టం మీద 108 వాహనం వద్దకు చేరుకున్నారు. అక్కడ మరోసారి అత్యవసర వైద్యసేవలు అందించడంతో గొర్రెల కాపరి స్పృహలోకి వచ్చాడు. వెంటనే వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో సిబ్బంది తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించి వైద్యసేవలు అందించారు. గొర్రెల కాపరి ఆరోగ్యం కుదుటపడటంతో క్షేమంగా ఇంటికి చేరుకొన్నాడు. 108 సిబ్బంది చూపిన చొరవను గ్రామస్తులు అభినందించారు.

అరకు కాఫీని ప్రోత్సహించేందుకు చర్యలు

- ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు నివేదిక పంపండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అరకు ప్రాంతంలో సాగు చేస్తున్న కాఫీని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. అరకు కాఫీ సాగు, మార్కెటింగ్ సౌకర్యాలు తదితర అంశాలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. అరకు కాఫీ ఎంత విస్తీర్ణంలో సాగు అవుతోంది, దానికి గల మార్కెటింగ్ సౌకర్యాలు, కాఫీ పండ్లను కాఫీ గింజలుగా.. తదుపరి కాఫీ పౌడర్, ఇతర ఉత్పత్తులుగాను ప్రాసెస్ చేసేందుకు ఆ ప్రాంతంలో ఉన్న సదుపాయాలను ఆయన ఆరా తీశారు. కాఫీ బోర్డు పంటను కొనుగోలు చేస్తోందా, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంలో దాని పాత్ర ఏమిటనే విషయాలపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ ప్రాంతంలో వేరుశనగ, టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసిన విధంగానే కాఫీ పంటను ప్రాసెస్ చేసేందుకు వీలుగా స్థానికంగా ఒక మెగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తక్షణం ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ పంటను జాతీయ, అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసేందుకు టాటా వంటి బహుళజాతి సంస్థలతో టైఅప్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

గిరిజన యువతకు శిక్షణ

ప్రకృతి వ్యవసాయ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ.. అరకు కాఫీకి జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే విధంగా వివిధ సంస్థలతో మాట్లాడుతున్నట్టు చెప్పారు. నైపుణ్య శిక్షణ సంస్థ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. అరకు కాఫీ మార్కెటింగ్, ఇతర అంశాల్లో స్థానిక గిరిజన యువతకు శిక్షణ ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమీత్‌కుమార్ వీడియో లింక్ ద్వారా అరకు కాఫీ సాగు, విస్తీర్ణం, ప్రాసెసింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ చేస్తూ ప్రస్తుతం లక్ష ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అరకు కాఫీని సాగు చేస్తున్నట్టు తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జె.వెంకట మురళి, జీజీజీ ఎండి సురేశ్‌కుమార్, మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఆహార శుద్ధి సంస్థ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ

క్లోన్డ్ వేలి ముద్రలతో దందా

- రిజిస్ట్రేషన్ పత్రాల నుంచి ఫింగర్ ప్రింట్స్ తస్కరణ
- ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ విధానం దుర్వినియోగం
- బ్యాంకు ఖాతాల నుంచి రూ.10 లక్షలు స్వాహా
- ముఠా గుట్టు రట్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: భూ దస్తావేజుల నుంచి లభించిన వివరాల ఆధారంగా క్లోన్డ్ వేలి ముద్రలు తయారు చేసి, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్)ను దుర్వినియోగం చేసి బ్యాంకు ఖాతాల నుంచి రూ.10 లక్షల మేర టోకరా వేసిన ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. తొమ్మిది మంది నిందితులున్న ఈ గ్యాంగ్‌లో ఆరుగురిని అరెస్టు చేశామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని సంయుక్త పోలీసు కమిషనర్ డాక్టర్ గజరావ్ భూపాల్ తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించిన వివరాలివీ... ఏపీలోని ప్రకాశం జిల్లా కంబంకు చెందిన ఎం.యువరాజు గతంలో వేలి ముద్రల్ని క్లోన్ చేసి, వాటి ద్వారా ఏఈపీఎస్ విధానంలో బ్యాంకు ఖాతాల్లోని నగదు కాజేసి అరెస్టయ్యాడు. జైలు నుంచి బయటకు వచ్చాక ఈ స్కామ్ ఎలా చేయాలో తన స్నేహితుడైన కంబం వాసి రఫీకి చెప్పాడు. ఇతడు అసాధారణ్, ఉదయ్‌కిరణ్‌తో కలిసి హైదరాబాద్‌లో ఓ రూమ్‌లో ఉంటున్నాడు. వీరంతా కలిసి ఆ దందా చేద్దామని నిర్ణయించుకున్నారు. క్లోన్డ్ వేలి ముద్రలు చేయడానికి అవసరమైన నమూనాలు, ఆధార్ నంబర్లు యువరాజే ఇచ్చాడు. కంబం వాసి నరేంద్రకు అక్కడ మీ సేవ కేంద్రం నిర్వాహకుడితో స్నేహం ఉంది. తరచు ఆ సేవా కేంద్రంలో కూర్చునే ఇతగాడు అక్కడి కంప్యూటర్‌లో ఉన్న దాదాపు 2,500 భూ రిజిస్ట్రేషన్ పత్రాల సాఫ్ట్‌కాపీలను పెన్‌డ్రైవ్‌లో కాపీ చేసుకుని యువరాజు, రఫీకి ఇచ్చాడు. అసాధారణ్ త్రయం క్లోన్డ్ వేలిముద్రలు తయారీకి అవసరమైన మిషన్, ఇతర సామగ్రిని ఆన్‌లైన్‌లో ఖరీదు చేసింది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు కాపీతోపాటు వేలి ముద్రల్నీ డాక్యుమెంట్‌లో పొందుపరుస్తారు. వీరు తమ వద్ద ఉన్న 2,500 దస్తావేజుల సాఫ్ట్‌కాపీల నుంచి ఆధార్ నంబర్లు, వేలిముద్రల్ని సంగ్రహించి క్లోన్డ్ వేలి ముద్రలు తయారు చేశారు. ఏఈపీఎస్ విధానంలో డబ్బు డ్రా చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించిన ప్రైవేట్ సంస్థల్లో ఏదో ఒక దాని నుంచి మర్చంట్ ఐడీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ అనుసంధానించి ఉన్న బ్యాంకు ఖాతాదారుడు పరిమిత మొత్తాలు ఈ మర్చంట్స్ వద్దే డ్రా చేసుకుంటారు. ఇలా డ్రా చేయడానికి బ్యాంకు ఖాతా నంబర్, ఓటీపీ అవసరం లేదు.

నిరుద్యోగికి ఎర వేసి మర్చంట్ ఐడీ

వీరికి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కె.శ్రీను తారసపడ్డాడు. శ్రీను ఫినో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ నుంచి మర్చంట్ ఐడీ తీసుకునేలా అసాధారణ్ ప్రేరేపించాడు. శ్రీను తన పేరుపై ఐడీ, బయోమెట్రిక్ మిషన్ తీసుకుని అసాధారణ్‌కు ఇచ్చాడు. ఫినో పేమెంట్స్ వెబ్‌సైట్‌లో మర్చంట్ ఐడీని నమోదు చేసి, ఉపకరణం ద్వారా శ్రీను వేలిముద్రను వెరిఫై చేసి ఏఈపీఎస్‌లోకి ఎంటర్ అయ్యారు. అక్కడ ఖాతాదారుడి ఆధార్ నంబర్‌ను పొందుపరిచి, వేలిముద్ర రీడింగ్ చేస్తే నిర్ణీత మొత్తం అతడి ఖాతా నుంచి మర్చంట్ ఖాతాలోకి వస్తుంది. మర్చంట్ తన వద్ద ఉన్న మొత్తం నుంచి ఖాతాదారుడికి తక్షణం చెల్లించేస్తాడు. ఫినో పేమెంట్స్ సైట్‌లోకి ఎంటర్ అయిన తర్వాత అసాధారణ్ త్రయం తమ వద్ద ఉన్న ఆధార్ నంబర్లు, క్లోన్డ్ వేలిముద్రలు వినియోగించి రూ.10 లక్షల్ని మర్చంట్ ఖాతాలుగా యాడ్ చేసిన తరుణ్, శివకృష్ణలకు బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించింది. ఆపై ఏటీఎం కార్డులు వినియోగించి ఆ మొత్తాలు డ్రా చేసుకుని అంతా పంచుకుంటున్నారు. అసాధారణ్ త్రయానికి ఓ దశలో సాంకేతిక సమస్యలు రావడంతో తమ స్నేహితుడైన ఎథికల్ హ్యాకర్ మహ్మద్ ఇయాజ్ సాయం తీసుకుంది. ఆ సమస్యను పరిష్కరించి వీరికి సహకరించిన హ్యాకర్ ఏటీఎం కేంద్రాల నుంచి డబ్బు డ్రా చేసుకుని వచ్చాడు. తాము శ్రీనుకు జారీ చేసిన మర్చంట్ ఐడీ ద్వారా మోసపూరిత లావాదేవీలు జరుగుతున్నట్లు బ్యాంకుల నుంచి ఫినో పేమెంట్స్ సంస్థకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ సంస్థ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు పెట్టింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సీతారాములు నేతృత్వంలోని రఫీ, యువరాజు, తరుణ్ మినహా మిగిలిన ఆరుగురినీ అరెస్టు చేసింది. వీరి నుంచి ల్యాప్‌టాప్‌లు, ఇతర ఉపకరణాలు స్వాధీనం చేసుకుంది.

పారదర్శకంగా ఇంజినీరింగ్ పోస్టుల నియామకాలు

టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి



తిరుపతి(అలిపిరి): ఎలాంటి సిఫారసులకు తావులేకుండా టీటీడీలో ఇంజినీరింగ్ పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో చైర్మన్, ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టులు భర్తీ చేసేందుకు టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. చెన్నై ఐఐటీ ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన ఈ నియామకాలు జరుగుతాయని వివరించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు. నేడు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభం: అలిపిరిలోని సప్త గో ప్రదక్షిణ మందిరంలో నవంబర్ 23 ఉదయం 9 గంటల నుంచి శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమాన్ని టీటీడీ ప్రారంభించనున్నట్లు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం నుంచి నిరంతరాయంగా శ్రీవారి పాదాల వద్ద రోజూ హోమం నిర్వహిస్తారన్నారు. పెళ్లిరోజు, పుట్టిన రోజు, ఇతర విశేష రోజుల సందర్భంగా భక్తులు ఎవరైనా ఇక్కడికి వచ్చి హోమం చేసుకోవచ్చని తెలిపారు.

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కేఎల్ డీమ్డ్ వర్సిటీ

వైస్ చాన్స్‌లర్ వెల్లడి



ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్లు చూపుతున్న పార్థసారథివర్మ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బెస్ట్ పెర్ఫామెన్స్ యూనివర్సిటీగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ స్థానం దక్కించుకుందని, 1,500 జాతీయ స్థాయి విద్యాసంస్థల నడుమ సత్తా చాటిందని కేఎల్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. బుధవారం విజయవాడలోని మ్యూజియం రోడ్డులో ఉన్న యూనివర్సిటీ పరిపాలన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్కిల్ విషయంలో తాము ఎక్కడా రాజీలేని కృషి చేస్తున్నామని, ఫలితంగానే తమ వర్సిటీ ఉత్తమ ఫలితాలు సాధించిందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎడ్యుస్కిల్ అనే సంస్థతో కలిసి పనిచేసి ఎక్కువ మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంలో తాము సక్సెస్ అయ్యామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 19,380 మంది విద్యార్థులు తమ వర్సిటీలో నైపుణ్య శిక్షణ కోర్సులను పూర్తి చేశారని చెప్పారు. రికార్డులతో పాటు ఉత్తమ వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ జి.పార్థసారథివర్మ, ఉత్తమ డీన్‌గా డాక్టర్ ఎ.శ్రీనాథ్‌లు ఎంపిక కావడం పట్ల వర్సిటీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ వి.వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక టెండర్లు ఖరారు

- 1, 3 ప్యాకేజీలు ప్రతిమ ఇన్‌ఫ్రాకు
- 2వ ప్యాకేజీని దక్కించుకున్న జీసీకేసీ ప్రాజెక్ట్స్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ఇసుక రీచ్‌ల టెండర్లు ఖరారయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రీచ్‌లను మూడు ప్యాకేజీలుగా విభజించి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. పారదర్శకంగా నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో ఎల్-1గా నిలిచిన కంపెనీలకు ఇసుక తవ్వకం బాధ్యతలు అప్పగించనున్నారు. 1, 3 ప్యాకేజీలను ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ చేజిక్కించుకోగా, ప్యాకేజీ-2ని జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ప్యాకేజీ-1లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలుండగా, ప్యాకేజీ-2లో పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలున్నాయి. ప్యాకేజీ-3లో పొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలున్నాయి. ప్యాకేజీల వారీగా ఆయా జిల్లాల్లోని ఇసుక రీచ్‌లను టెండరు దక్కించుకున్న సంస్థలకు అప్పగించనున్నారు. ఇసుక తవ్వకాలు, రవాణా, సరఫరా బాధ్యతను ఆ సంస్థలే నిర్వహిస్తాయని గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి తెలిపారు. గతంలో ఇసుక ఆపరేషన్స్ నిర్వహించిన జేపీ పవర్ వెంచర్స్ గడువు ముగియడంతో కొత్తగా మళ్లీ టెండర్ల ప్రక్రియ నిర్వహించి ఖరారు చేశారు.

మూడోసారీ మా ప్రభుత్వమే..

- బీఆర్ఎస్‌కు 70 నుంచి 82 సీట్లు ఖాయం..
- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మూడు వేర్వేరు సంస్థల ద్వారా లోతుగా సర్వే చేశామని.. బీఆర్ఎస్‌కు 72 నుంచి 82 సీట్లు వస్తాయని స్పష్టంగా తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు చెప్పారు. రాష్ట్రంలో మూడోసారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. 'మాపై వ్యతిరేకత ఉన్నట్టు సోషల్ మీడియాలో హడావుడి జరగడం, అక్కడక్కడా మౌఖిక ప్రచారమే(మౌత్ టాక్) తప్ప క్షేత్రస్థాయిలో ఓటరుకు ఎలాంటి గందరగోళం లేదు. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. మొదట్లో మేం కూడా కొంత గందరగోళపడినా క్షేత్రస్థాయి నుంచి మాకు మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో మూడో స్థానంలో, కొడంగల్‌లో రెండో స్థానంలో నిలిచే పరిస్థితి ఉన్నపుడు కాంగ్రెస్ గెలిచే అవకాశం ఎక్కడుంది? కాంగ్రెస్ దిగ్గజాలైన కోమటిరెడ్డి సోదరులు, జానారెడ్డి కుమారుడు, జగ్గారెడ్డి వంటివారు కూడా ఓడిపోతున్నారు. బీజేపీ రెండు, మూడు సీట్లకే పరిమితం అవుతుంది. మేం ఖమ్మంలో ఆరు స్థానాల్లో, నల్లగొండలో 7 నుంచి 9 సీట్లలో కచ్చితంగా గెలుస్తాం. మిగతా నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఉన్నా మా పార్టీ పరిస్థితి నిక్షేపంగా ఉంది' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయి ఆరంభంలో కొంత కాంగ్రెస్ వైపు మళ్లడంతో ఆ వాపును చూసి బలుపు అనుకుంటున్నారని, అది పాలపొంగు వంటి హడావుడి మాత్రమేనని ఆయన అన్నారు. కేసీఆర్ 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ బీజేపీతో అంటకాగలేదన్నారు.

తొలి రోజు ఓటేసిన 9174 మంది

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ప్రక్రియ గురువారంతో మూడో రోజుకు చేరుకోనుంది. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 29,267 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించారు. మంగళవారం తొలి రోజు 9,174 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80 ఏళ్లకు పైబడిన 17,105 ఓటర్లకు 6,226 మంది, 9964 మంది దివ్యాంగులకు 2,884 మంది, అత్యవసర సేవల ఓటర్లు 2,198 మందికి 64 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం రెండో రోజు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను గురువారం వెల్లడిస్తామని పేర్కొంది. ఈ నెల 26లోగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ముగించాలని సీఈవో కార్యాలయం ఆదేశించింది.

అరకు అందాలు చూడ్డానికి వెళ్లివస్తూ.. అనంత లోకాలకు..

- ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు
- ఇద్దరు దుర్మరణం, ఐదుగురికి గాయాలు
- 65వ నంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



కేతనకొండ వద్ద లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన కారు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆగి ఉన్న లారీని వెనకనుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ఘటన బుధవారం తెల్లవారుజామున ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది కారులో అరకు ప్రకృతి అందాలు తిలకించేందుకు వెళ్లారు. అక్కడ నుంచి మంగళవారం రాత్రి స్వస్థలాలకు తిరుగు పయనమయ్యారు. బుధవారం వేకువజాము 5.30 గంటల సమయంలో కారు డ్రైవర్ నిద్రావస్థలోకి చేరుకున్నాడు. ఈ క్రమంలో కేతనకొండ వద్ద రోడ్డు పక్కన టైర్లకు గాలి పెట్టించుకునేందుకు ఆగిన లారీని గమనించకుండా వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో కారు ముందు భాగంలో కూర్చున్న నిజామాబాద్‌కు చెందిన ధర్మతేజ (23), హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ శాంతికుమార్ (23) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో ఉన్న మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఒక యువతి గాయపడకుండా బయటపడింది. గాయపడిన వారిని రెండు 108 వాహనాల్లో ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పి.శ్రీను తెలిపారు.

35 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం

ఐదుగురు స్మగ్లర్లు అరెస్టు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా)/తడ (తిరుపతి జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని మారుమూల గ్రామాల్లోని 35 ఎకరాల్లో సాగుచేస్తున్న గంజాయి పంటను పోలీసులు ధ్వంసం చేసి తగులబెట్టగా, గంజాయి అక్రమ దందా చేస్తున్న ఐదుగురిని తిరుపతి జిల్లా తడ పోలీసులు బుధవారం అరెస్టు చేసి 20.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ముంచంగిపుట్టు మండలంలోని గడ్డిబంద, తుమ్మిడిపుట్టు, సంగంవలస, కొనంపుట్టు, గుణచెలమ్మ, బొడ్డపుట్టు, బరడ, జాడిగూడ, జర్రెల పాదర్, డెంగసిమిలి, మోజగూడ, అర్లాయిపుట్టు, డాబుగూడ గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు స్థానికుల సాయంతో బృందాలుగా ఏర్పడి గంజాయి పంటను తగులబెట్టారు. అలాగే తడకు చెందిన ఐదుగురు వ్యక్తులు వైజాగ్ వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారు. అయితే గంజాయిని ఎక్కడ అమ్మాలో తెలియక తడ రైల్వే స్టేషన్ వద్ద తికమక పడుతుండగా ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.3లక్షల7,500 విలువ జేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణ

తెలంగాణలో కాంగ్రెస్ వస్తే దేశంలో కూడా గెలుస్తుంది

- ప్రజాగర్జన సభల్లో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడూ ఒక్కటే

సాక్షి ప్రతినిధులు, మహబూబ్‌నగర్/నల్లగొండ: 'బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు స్నేహితులు. మూడూ ఒక్కటే. ఏ టీమ్, బీ టీమ్, సీ టీమ్‌గా ఉన్నాయి. కేసీఆర్ ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్ నాగపూర్‌కు వెళ్లినప్పుడు మోదీ నా మిత్రుడని చెబుతుంటాడు. అదే ఒవైసీ కేసీఆర్ నాకు మంచి స్నేహితుడని చెబుతాడు. ఈ ముగ్గురు కలిసి తెలంగాణలో కాంగ్రెస్ గెలవకూడదని కుట్రలు చేస్తున్నారు. దళిత, మైనార్టీ, నిరుపేదలంతా కాంగ్రెస్ వైపే ఉండడంతో ఆ మూడు పార్టీలకు కళ్లు మండుతున్నాయి. కేసీఆర్ పాలనలో అంతులేని అవినీతి జరిగింది. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. పేదల భూములు లాక్కున్న వారికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో మేం పోరాడుతున్నాం. తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించాలి. మీ తీర్పు మీ కీర్తి ప్రతిష్టను పెంచుతుంది. దేశంలో మీకు గౌరవం లభిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో కూడా గెలుస్తుంది..' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బుధవారం నల్లగొండ, ఉమ్మడి పాలమూరులోని అలంపూర్ నియోజకవర్గ పరిధి అయిజల్లో నిర్వహించిన ప్రజాగర్జన సభల్లో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్‌కు సంబంధించిన నేషనల్ హెరాల్డ్‌తో పాటు మూడు హిందూ పత్రికలకు సంబంధించి రూ.780 కోట్ల ఆస్తిని మోదీ జప్తు చేసుకున్నారు. స్వాతంత్య్ర ఉద్యమ గొంతుక, ప్రజల్లో చైతన్యం కోసం నెహ్రూ ఈ పేపర్లను తీసుకొచ్చారు. వీటి ఆస్తులను జప్తు చేస్తే.. తెలంగాణ ప్రజలు భయపడి బీజేపీ, కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని భావించి రాజకీయ కుట్రకు తెరలేపారు. మా ఆస్తి జప్తు చేస్తే కాంగ్రెస్ పార్టీ భయపడుతుందని కేసీఆర్, బీజేపీ అనుకుంటే అది భ్రమనే. కాంగ్రెస్‌కు పోరాటం కొత్త కాదు. బ్రిటిష్ పాలకులకే భయపడలేదు. బీజేపీకి భయపడతామా? మోదీని ప్రజలు క్షమించరు.. తరిమికొడతారు..' అని ఖర్గే అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కానీ ఇక్కడ అభివృద్ధి జరగలేదని, కేసీఆర్ తన పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణను అప్పుల పాలు చేసి.. ఒక్కొక్కరిపై రూ.1.40 లక్షల అప్పు పెట్టారని ఆయన మండిపడ్డారు.

వీలైనంత దగ్గరగా జేఈఈ పరీక్ష కేంద్రం

- దరఖాస్తులోని స్థానికత ఆధారంగా కేటాయింపు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను ఈసారి శాస్త్రీయంగా ఏర్పాటు చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. సాధ్యమైనంత వరకూ అభ్యర్థి నివాసానికి సమీపంలో ఉండే కేంద్రాన్ని కేటాయించేందుకు వీలుగా కసరత్తు చేపట్టింది. దరఖాస్తులో పేర్కొన్న స్థానికతను ఇందుకు కొలమానంగా తీసుకుంటున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా అక్కడికి సమీపంలోని పరీక్ష కేంద్రాన్ని గుర్తిస్తున్నారు. అన్ని రాష్ట్రాల నుంచి పరీక్షా కేంద్రాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 మధ్య ఉంటుంది. తొలి విడత పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 30తో ముగుస్తుంది. తుది గడువు నాటికి ఎన్ని దరఖాస్తులు అందుతాయి? ఎన్ని పరీక్ష కేంద్రాలుంటాయి? ఎన్ని సెషన్లుగా పరీక్ష పెట్టాలనేదానిపై డిసెంబర్ మొదటి వారంలో ఓ స్పష్టత వస్తుంది. అయితే ఈసారి ఒక్కో పరీక్ష కేంద్రంలో ఎక్కువ మంది పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు అదనపు గదుల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఎన్‌టీఏ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌లో చేరిన సినీనటి దివ్యవాణి

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం నాయకురాలు, సినీనటి దివ్యవాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గాంధీభవన్‌లో దివ్యవాణి విలేకరులతో మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ నుంచి కొన్ని కారణాల వల్ల బయటకు వచ్చానని, నీతి నిజాయితీలతో ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీలో పనిచేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. నిజమైన బంగారు తెలంగాణ కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. ప్రగతిభవన్‌ను ప్రజాపరిపాలనా భవన్‌గా మారుస్తామన్న కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశం తనను ఆకర్షించిందని చెప్పారు. దేశాన్ని కాపాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, పార్టీ కార్యకర్తగా ఎలాంటి బాధ్యతలు అప్పగించినా పనిచేస్తానని దివ్యవాణి స్పష్టం చేశారు.

హామీలా, హిందుత్వా?



ఆసక్తికరంగా రాజస్థాన్ పోరు

ఏ పార్టీకీ కనిపించని 'వేవ్'	గెహ్లోత్ పథకాలపై ప్రజల్లో సంతృప్తి	దిగజారిన శాంతిభద్రతలపై ఆందోళన

ప్రచారానికి నేటితో తెర, 25న పోలింగ్

ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు చివరి దశకు చేరుకుంది. ఇక్కడ పాలక కాంగ్రెస్, విపక్ష బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. నెల రోజులకు పైగా రాష్ట్రవ్యాప్తంగా పోటాపోటీ ప్రచారంతో ఇరు పార్టీలూ హోరెత్తించాయి. బీజేపీ ప్రచారానికి స్వయంగా ప్రధాని మోదీయే సారథ్యం వహించి కాలికి బలపం కట్టుకుని సుడిగాలి పర్యటనలు చేశారు. కాంగ్రెస్ తరఫున ప్రచార భారాన్ని ప్రధానంగా సీఎం అశోక్ గెహ్లోతే మోశారు. మోదీ మేనియాకు ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చే ఆనవాయితీ తోడై తాము అందలమెక్కుతామని బీజేపీ నమ్మకం పెట్టుకుంది. గెహ్లోత్ వరుసబెట్టి ప్రకటిస్తూ వచ్చిన జనాకర్షక పథకాలు ఆ ఆనవాయితీకి ఈసారి అడ్డుకట్ట వేసి తమను మరోసారి గెలిపిస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే పోలింగ్ తేదీ సమీపించినా ఓటరు నాడి మాత్రం ఎవరికీ అందడం లేదు. ఏ పార్టీకీ అనుకూలంగా స్పష్టమైన 'వేవ్' కనిపించడం లేదు. దాంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇరు పార్టీలూ సర్వశక్తులూ ఒడ్డాయి. కాంగ్రెస్ ప్రధానంగా ఎన్నికల హామీలపై ఆధారపడగా బీజేపీ ఎప్పట్లాగే హిందుత్వ కార్డును వీలైనంతగా ప్రచారంలో పెట్టింది...

పథకాలకు థమ్సప్...

గెహ్లోత్ ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో పెద్దగా వ్యతిరేకత కన్పించకపోవడం విశేషం. సంక్షేమ పథకాలపై ప్రజల్లో బాగా సంతృప్తి ఉంది. సంక్షేమ పథకాలు పేదలను ఎంతగానో ఆదుకున్నాయని బీజేపీ మద్దతుదారులు కూడా అంగీకరిస్తుండటం విశేషం! చిరంజీవి బీమా యోజన లక్షల మంది పేద, మధ్య తరగతి కుటుంబీకులకు ఎంతో ఆదుకుందని సవాయ్ మధోపూర్‌లో పవన్ మీనా అనే పాన్ షాప్ యజమాని చెప్పుకొచ్చారు. ''నేను బీజేపీ మద్దతుదారును. కానీ ఈసారి కాంగ్రెస్ పాలనలో ప్రజలకు జరిగిన మంచి కొట్టొచ్చినట్టు కన్పిస్తూనే ఉంది'' అన్నారాయన. కాకపోతే ఇదంతా ఓట్ల రూపంలో బదిలీ అవుతుందా అన్నది చూడాలంటూ ముక్తాయించారు. 10 లక్షల ఉద్యోగాలతో పాటు తక్షణం కులగణన చేపట్టి, మైనారిటీలకు జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని కూడా కాంగ్రెస్ తాజా మేనిఫెస్టోలో చెప్పింది. ఇవన్నీ ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తాయో చూడాల్సిందే.

శాంతిభద్రతలపై పెదవి విరుపు...

పథకాల సానుకూలతకు శాంతిభద్రతల విషయంలో జనంలో నెలకొన్న తీవ్ర అసంతృప్తి బాగా గండి కొట్టేలా కనిపిస్తోంది. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మాత్రం దారుణంగా దిగజారిందని మెజారిటీ ప్రజలు వాపోతుండటం ప్రమాద ఘంటికేనంటున్నారు. ముఖ్యంగా ఇస్లాంను కించపరిచాడంటూ గతేడాది ఉదయ్‌పూర్‌లో ఓ టైలర్ షాప్ యజమానిని పట్టపగలే తల నరికి చంపిన తీరును ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. దానికి తోడు మహిళలపై అకృత్యాలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోయిన తీరుపైనా జనం గగ్గోలు పెడుతున్నారు. పథకాల ఫలాలు అందరికీ అందుతున్నా ప్రాణాలకే భద్రత లేకపోతే ఏం లాభమని కోటాలో బట్టల షాపు నడుపుతున్న వినోద్ చేసిన వ్యాఖ్యలు జనాభిప్రాయానికి అద్దం పట్టేవే. ''గెహ్లోత్ ప్రభుత్వం బాగానే పని చేసింది. కానీ మార్పు అవసరం. బీజేపీ వస్తే బాగుంటుంది'' అన్నారాయన. బీజేపీకి ఓటేయడం చాలా అవసరమని కోటాకు చెందిన అమృత్ చౌహాన్ అనే ఆటోడ్రైవర్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ ధోరణినే ప్రతిఫలించాయి. ''శాంతిభద్రతలను చక్కదిద్దాలంటే యూపీ తరహా పాలన కావాల్సిందే. అప్పుడే ప్రధాని మోదీ చెబుతున్న హిందూ రాష్ట్ర స్థాపన సాధ్యం. కాంగ్రెస్ కేవలం ఒక్క సామాజిక వర్గానికే కొమ్ము కాస్తూ వస్తోంది'' అని చౌహాన్ చెప్పుకొచ్చారు.

ఈసారి 199 సీట్లలోనే పోలింగ్!

రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి గురువారం సాయంత్రంతో తెర పడనుంది. పోలింగ్ శనివారం జరుగుతుంది. ఎన్నికల ఫలితాలు మరో నాలుగు రాష్ట్రాలతో కలిపి డిసెంబర్ 3న వెల్లడవుతాయి. అయితే రాష్ట్రంలో 200 అసెంబ్లీ స్థానాలకు గాను 199 స్థానాల్లో మాత్రమే పోలింగ్ జరగనుంది! కరణ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్‌సింగ్ కున్నర్ మృతితో అక్కడ పోలింగ్ వాయిదా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా 199 స్థానాల్లోనే పోలింగ్ జరుగుతుండటం రాష్ట్ర చరిత్రలో ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం! బీఎస్పీ అభ్యర్థుల మృతి కారణంగా 2018లో, 2013 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాగే ఒక అసెంబ్లీ స్థానంలో పోలింగ్ నిలిచిపోయింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

తుది దశకు రెస్క్యూ ఆపరేషన్

57 మీటర్ల శిథిలాల గుండా 45 మీటర్ల డ్రిల్లింగ్ పూర్తి

మరో 12 మీటర్లు పూర్తయితే కార్మికులు బయటపడే అవకాశం

- నేడో, రేపో తీసుకొచ్చేందుకు అధికారుల ప్రయత్నాలు
- ముమ్మరంగా కొనసాగుతున్న 'ఉత్తర కాశీ' ఆపరేషన్

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: పది రోజులకుపైగా సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన 41 మంది కార్మికులను సురక్షితంగా బయటకుతెచ్చే డ్రిల్లింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. దేశ, విదేశీ నిపుణుల పర్యవేక్షణలో కొనసాగుతున్న సహాయక, డ్రిల్లింగ్ పనుల్లో భారీ పురోగతి కనిపిస్తోందని అక్కడి వర్గాలు వెల్లడించాయి. ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్ ప్రాజెక్టులో భాగంగా సిల్‌క్యారా వద్ద కొండను తవ్వుతుండగా లోపల 57 మీటర్లమేర సొరంగం కూలిందని సహాయక బృందాలు అంచనావేస్తున్నాయి. ఇందులో ఇప్పటికే 39 మీటర్లమేర తవ్వగా బుధవారం సాయంత్రానికి మరో ఆరు మీటర్ల మేర డ్రిల్లింగ్ చేసి 'సహాయక' పైపును విజయవంతంగా జొప్పించారు. వీరి అంచనా ప్రకారం మరో 12 మీటర్లు తవ్వితే కార్మికులు చిక్కుకున్న చోటుకు పైపు చేరుకోవచ్చు. దాదాపు మీటరు వ్యాసమున్న ఈ స్టీల్ పైపులోంచి కార్మికులను బయటకు తీసుకురావాలని ప్రణాళిక సిద్ధంచేసిన సంగతి తెల్సిందే. కార్మికులను బయటకు రాగానే వారికి అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు ఛాతి డాక్టర్లతో కూడిన 14 మంది వైద్య బృందాన్ని ఘటనాస్థలి వద్ద సిద్ధంగా ఉంచారు. 12 అంబులెన్సులను, 41 పడకల తాత్కాలిక ఆస్పత్రిని సిద్ధంచేశారు. మరీ అత్యవసరమనుకుంటే వారిని వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి ఆగమేఘాల మీద తరలించేందుకు హెలీకాప్టర్‌ను తెప్పించనున్నట్లు సమాచారం.

బగ్వాల్ పండుగ వారితోనూ చేసుకుందాం

''డ్రిల్లింగ్ విజయవంతంగా కొనసాగుతోంది. వారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తాం. వారితో కలిసే స్థానిక బగ్వాల్ పండగ జరుపుకుందాం'' అని ప్రధాని కార్యాలయం మాజీ సలహాదారు భాస్కర్ ఖుల్బే ఘటనాస్థలి వ్యాఖ్యానించారు. దీపావళి పండగ తర్వాత స్థానిక గర్వాల్ ప్రాంతంలో బగ్వాల్ పండగ జరుపుకోవడం ఆనవాయితీ. అక్కడి బగ్వాల్‌ను ఈ ఏడాది గురువారం జరుపుకుంటున్నారు. మరోవైపు, రెస్క్యూ ఆపరేషన్ పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీతో ప్రధాని మోదీ బుధవారం మాట్లాడారు.

సొరంగంలో కూలింది ఎక్కడ ?

సిల్‌క్యారా బెండ్ నుంచి మొదలుపెట్టి బార్కోట్ వరకు కొండ కింద 4.531 కి.మీ.ల మేర సొరంగం తవ్వుతున్నారు. సిల్‌క్యారా వైపు నుంచి 2.340 కి.మీ.ల మేర సొరంగం తవ్వకం, అంతర్గత నిర్మాణం పూర్తయింది. సొరంగం ముఖద్వారం నుంచి దాదాపు 205–260 మీటర్ల మార్క్ వద్ద దాదాపు 57 మీటర్ల పొడవునా సొరంగం కూలింది. అదే సమయంలో ఆ మార్క్ దాటి సొరంగం లోపలి వైపుగా కార్మికులు పనిలో ఉన్నారు. అంటే దాదాపు రెండు కిలోమీటర్ల మేర విశాలమైన ప్రాంతంలో కార్మికులు చిక్కుకుపోయారు. 57 మీటర్ల వెడల్పైన శిథిలాలున్నాయి. ఇంతే వెడల్పున శిథిలాల గుండా పైపును జొప్పించి వారిని బయటకు తెచ్చేందుకు యత్నిస్తున్నారు.




బుధవారం టన్నెల్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



41 మంది కార్మికులు బయటికి రాగానే వారికి తక్షణం చికిత్స అందించేందుకు ఉత్తర కాశీ జిల్లా ఆస్పత్రిలో సిద్ధమవుతున్న పడకలు

టన్నెల్‌లో ప్రస్తుత పరిస్థితి ఊహాచిత్రం



మళ్లీ ఓపెన్‌ఏఐలోకి సామ్ ఆల్ట్‌మన్



శాన్ ఫ్రాన్సిస్కో: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ తయారీసంస్థ ఓపెన్‌ఏఐ మరోసారి వార్తల్లో నిలిచింది. సీఈవో బాధ్యతల నుంచి తప్పుకున్న సామ్ ఆల్ట్‌మన్‌ను తిరిగి అదే పదవిలోకి తీసుకుంటున్నట్లు ఓపెన్‌ఏఐ తాజాగా ప్రకటించింది. తనను తొలగించిన కంపెనీ బోర్డును పునర్వ్యవస్థీకరించాలని సామ్ పెట్టిన షరతుకు ఓపెన్‌ఏఐ ఒప్పుకున్నట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే కొత్తగా బ్రెట్ టైలర్ నేతృత్వంలో నూతన బోర్డును ఏర్పాటుచేస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఇటీవల బహిష్కరణ తర్వాత సామ్‌ను మైక్రోసాఫ్ట్‌కు చెందిన నూతన అడ్వాన్స్‌డ్ ఏఐ పరిశోధనా బృందంలో చేర్చుకుంటున్నట్లు మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల ప్రకటించడం తెల్సిందే. సామ్‌ను మళ్లీ సంస్థలోకి తీసుకోవాలని వాటాదారుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అతని షరతులకు సంస్థ ఒప్పుకోకతప్పలేదని తెలుస్తోంది. సంస్థలోకి పునరాగమనాన్ని సామ్ ధ్రువీకరించారు. మళ్లీ కృత్రిమ మేధ విభాగంలో అవిశ్రాంతంగా పనిచేస్తానని ప్రకటించారు.

సరిహద్దుల్లో ఉగ్రకాల్పులు

రాజౌరీ/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు కెప్టెన్‌లు, ఒక హవీల్దార్, ఒక జవాను వీరమరణం పొందారు. కాల్పులు జరుగుతున్న అటవీప్రాంతంలో నక్కిన ఇద్దరు ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మరింతగా భద్రతా బలగాలు అక్కడకు చేరుకుంటున్నాయని సైన్యాధికారులు బుధవారం చెప్పారు. నక్కిన ఇద్దరు ఉగ్రవాదులు విదేశీయులని సైన్యం వెల్లడించింది. గులాబ్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో గాలింపు చేపట్టగా ధరమ్‌సాల్ పరిధిలోని బజిమాల్ సమీపంలో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుందని ఆర్మీ ట్వీట్‌చేసింది. ఈ ఘటనలో ఒక మేజర్, ఒక జవాను గాయపడ్డారు.

కెనడాకు మళ్లీ ఈ వీసా సేవలు

ఒట్టావా/న్యూఢిల్లీ: కెనడాతో దౌత్య వివాదం నేపథ్యంలో ఆ దేశస్తులకు నిలిపేసిన ఎలక్ట్రానిక్ వీసాల జారీ సేవలను కేంద్రం పునరుద్ధరించింది. ఒట్టావాలోని భారత హై కమిషన్ బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో ఈ మేరకు వెల్లడించింది. చేసింది. కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాద నేత హర్దీప్‌సింగ్ నిజ్జర్ గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించడం, అది భారత గూఢచారుల పనేనని ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించడం తెలిసిందే. దాంతో ఇరు దేశాల సంబంధాలు బాగా క్షీణించాయి.

కాల్పులకు విరామం

ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం

- నేటి నుంచి 4 రోజుల పాటు అమలు
- ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదముద్ర
- ఖతార్, ఈజిప్ట్, యూఎస్ మధ్యవర్తిత్వం
- హమాస్ చెర నుంచి 50 మందికి విముక్తి
- బదులుగా 150 మంది పాలస్తీనా ఖైదీల విడుదల!
- ప్రతి 10 మంది విడుదలకు ఒక్కో రోజు అదనపు విరామం



జెరూసలేం/ఐరాస: తాత్కాలికంగానైనా ప్రార్థనలు ఫలించాయి. ప్రపంచ దేశాల విన్నపాలు ఫలితమిచ్చాయి. తీవ్ర ప్రతీకారేచ్ఛతో గాజాపై ఆరు వారాలుగా వైమానిక, భూతల దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ ఓ మెట్టు దిగొచ్చింది. అంతర్జాతీయ సమాజం విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా కాల్పుల విరమణకు ఎట్టకేలకు అంగీకరించింది. ఈ మేరకు ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. ''ఇజ్రాయెల్ నాలుగు రోజుల పాటు కాల్పులను పూర్తిగా నిలిపేస్తుంది. బదులుగా హమాస్ తన చెరలో ఉన్న 240 మందిపై చిలుకు బందీల్లో 50 మందిని విడిచిపెడుతుంది'' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. బందీలందరినీ విడిపించేందుకు కట్టుబడి ఉన్నట్టు తెలిపింది. ఒప్పందంలో భాగంగా తమ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనియన్లను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్టు సమాచారం. హమాస్ చెర నుంచి బయట పడేవారిలో అత్యధికులు మహిళలు, పిల్లలే ఉంటారని చెబుతున్నారు. ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా మహిళలు, పిల్లలను విడిచి పెట్టనుందని ఖతర్ వెల్లడించింది. ఈజిప్ట్, అమెరికాతో పాటు ఖతర్ కూడా ఇరు వర్గాల చర్చలకు మధ్యవర్తిగా వ్యవహరించడం తెలిసిందే. నిత్యావసరాలతో సహా సర్వం నిండుకుని మానవీయ సంక్షోభంతో అల్లాడిపోతున్న గాజాకు ఈ నాలుగు రోజుల్లో అదనపు సాయాన్ని అనుమతించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్టు ఖతర్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఒప్పందం మలి దశలో భాగంగా మున్ముందు ఇరువైపుల నుంచి మరింత మంది బందీలు విడుదలవుతారని చెప్పుకొచ్చింది. కాల్పుల విరమణ గురువారం ఉదయం పదింటి నుంచి అమల్లోకి రానుంది. యుద్ధాన్ని ఆపేది లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కుండబద్దలు కొట్టారు! నాలుగు రోజుల విరామం ముగియగానే గాజాపై దాడులు పునఃప్రారంభం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. ''మేం ముట్టడిలో ఉన్నాం. హమాస్‌ను నిర్మూలించి మా లక్ష్యాలన్నింటినీ సాధించేదాకా యుద్ధాన్ని కొనసాగించి తీరతాం'' అని ప్రకటించారు. దీర్ఘకాలిక యుద్ధానికి సైన్యం మరింతగా సన్నద్ధమయ్యేందుకు విరామం ఉపయోగపడుతుంది తప్ప సైనికుల స్థైర్యాన్ని తగ్గించబోదని ఆయన అన్నారు. అయితే హమాస్ చెరలోని బందీల్లో ప్రతి 10 మంది విడుదలకు ప్రతిగా కాల్పుల విరామాన్ని ఒక రోజు చొప్పున పెంచేందుకు ఇజ్రాయెల్ సమ్మతించింది. కాల్పుల విరమణను ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా పలు దేశాధినేతలు స్వాగతించారు. ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7న హమాస్ ఇస్లామిక్ మిలిటెంట్లు మెరుపు దాడికి దిగడం తెలిసిందే. 1,200 మందికి పైగా ఇజ్రాయెలీలను హతమార్చడంతో పాటు 240 మందికి పైగా బందీలుగా గాజాకు తరలించారు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడులకు దిగి గాజాపై ఆరు వారాలుగా క్షిపణులు, బాంబుల వర్షం కురిపిస్తోంది.

ఏం జరగనుంది...

- ఇజ్రాయెల్, హమాస్ రెండూ నాలుగు రోజుల పాటు కాల్పులను పూర్తిగా నిలిపేస్తాయి.
- ముందు తమ వద్ద ఉన్న బందీల్లోంచి 50 మంది మహిళలు, చిన్నారులను రోజుకు 12 మంది చొప్పున హమాస్ విడుదల చేస్తుంది.
- అనంతరం ఇజ్రాయెల్ కూడా తన జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనియన్లను విడుదల చేస్తుందని ఖతర్ ప్రకటించింది.
- బహుశా గురువారమే బందీల విడుదల ప్రక్రియ మొదలవ్వొచ్చని వైట్‌హౌస్ అభిప్రాయపడింది.
- ఈ నాలుగు రోజుల్లో గాజాకు అదనపు మానవీయ సాయాన్ని ఇజ్రాయెల్ అనుమతిస్తుంది.

ఇప్పట్లో మళ్లీ కాల్పులుండనట్టే...!

విరామానికి స్వస్తి చెప్పి ఇజ్రాయెల్ ఇప్పట్లో గాజాపై మళ్లీ దాడులకు దిగడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ''50 మంది బందీలు విడుదలైతే మిగతా వారినీ విడిపించాలంటూ కుటుంబీకుల నుంచి ఇజ్రాయెల్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. అందులోనూ హమాస్ తన చెరలో ఉన్న సైనికులను చిట్టచివరన గానీ వదిలిపెట్టదు. అప్పటిదాకా దాడులు మొదలుపెట్టేందుకు వారి కుటుంబాలు ఒప్పుకోకపోవచ్చు'' అని పరిశీలకులు అంటున్నారు. అదే సమయంలో హమాస్ దీన్ని తమ విజయంగా చెప్పుకుంటే అది నెతన్యాహూ సర్కారుకు ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ దాడులు బుధవారం కూడా తీవ్ర స్థాయిలో కొనసాగాయి. ఉత్తర గాజాలో జబాలియా శరణార్థి శిబిరం బాంబు దాడులతో దద్దరిల్లింది. హమాస్ కూడా రోజంతా ఇజ్రాయెల్‌పైకి రాకెట్ దాడులు కొనసాగించింది.

ప్రాంతీయ సంక్షోభంగా మారొద్దు: మోదీ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–హమాస్ పోరు ప్రాంతీయ సంక్షోభంగా రూపుదాల్చకుండా అడ్డుకోవాలని ప్రధాని మోదీ జీ20 దేశాధినేతలకు పిలుపునిచ్చారు. బుధవారం జీ20 శిఖరాగ్ర సదస్సు వర్చువల్ భేటీ సందర్భంగా జీ20 దేశాధినేతలనుద్దేశిస్తూ ప్రధాని మోదీ ప్రసంగించారు. '' ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదు. ఉగ్రవాదం కారణంగా ప్రపంచంలో ఎక్కడ పౌరులు మరణించినా తీవ్రంగా ఖండించాల్సిందే. బందీలను వదిలేస్తామంటూ హమాస్ మిలిటెంట్లు ప్రకటించడం నిజంగా స్వాగతించాల్సిన విషయం. గాజాలో నిరంతర మానవతా సాయం అందించడం తప్పనిసరి. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం ప్రాంతీయ సంక్షోభంగా పరిణామం చెందకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత నెలకొనాలి' అని మోదీ వ్యాఖ్యానించారు. ' ఇటీవలి కాలంలో కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగమవడం ఆందోళకరం. ఈ విషయంలో భారత వైఖరి సుస్పష్టం. ఏఐ రంగం అంతర్జాతీయ క్రమబద్ధీకరణకు ప్రపంచదేశాలతో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది'' అని మోదీ స్పష్టంచేశారు. ఉక్రెయిన్ యుద్ధంలో మాదిరి గాజా స్ట్రిప్‌లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం తనను షాక్‌కు గురిచేసిందని భేటీ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. వర్చువల్ భేటీలో బ్రెజిల్, యూఏఈ, రష్యా, కెనడా, బంగ్లాదేశ్ దేశాధినేతలతోపాటు ఐరాపా కమిషన్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సారథులు పాల్గొన్నారు.

నిజం మాట్లాడే సొంత నేతలనూ బహిష్కరిస్తుంది

రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శలు



జైపూర్: రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచారసభల్లో అధికార కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ మరింతగా విమర్శనాస్త్రాలు సంధించారు. బిల్వాడా జిల్లాలోని కోట్రీ గ్రామంలో భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ' కాంగ్రెస్ కుటుంబం ముందు ఎవరైనా నిజం మాట్లాడితే ఇక అంతే. సొంత పార్టీ నేతలు అని కూడా చూడకుండా నిర్దాక్షిణ్యంగా పార్టీ నుంచి బహిష్కరిస్తారు. ఒకప్పుడు రాజేశ్ పైలట్ ఆహార సమస్యపై కాంగ్రెస్ కుటుంబాన్నే సవాల్ చేశారు. దీంతో అప్పటి నుంచి రాజేశ్ పైలటే కాదు ప్రస్తుతం ఆయన కుమారుడు సచిన్ పైలట్ సైతం పార్టీ ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది. 1997లో పార్టీ అధ్యక్ష పదవికి సీతారాం కేసరికి పోటీగా ఎన్నికల్లో నిల్చున్నందుకు రాజేశ్ పైలట్‌పై పార్టీ కన్నెర్రజేసింది. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం అశోక్ గెహ్లోత్‌తో పోటీపడినా అధిష్టానం దీవెనలు సచిన్‌కు దక్కలేదు'' అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా రేపిస్టులకు క్లీన్ చిట్

''అసెంబ్లీ సాక్షిగా రేపిస్టులకు రాష్ట్ర మంత్రులే క్లీన్‌చిట్ ఇస్తున్నారు. ఇలాంటి పాలనలో మన తల్లులు, కూతుళ్లు, అక్కాచెల్లెళ్లకు రక్షణ ఏది? ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడంలో ఏ ఒక్క అవకాశాన్నీ కాంగ్రెస్ వదిలిపెట్టలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ముగింపు పలకాల్సిన సమయమొచ్చింది. కమలానికి మీరు వేసే ఒక్కో ఓటు కాంగ్రెస్‌ను తుడిచిపెట్టేందుకు దోహదపడుతుంది'' అని మోదీ అన్నారు. అంతకుముందు దుంగార్‌పూర్ జిల్లాలోని సాగ్వారా పట్టణంలో ర్యాలీలో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. మరోవైపు, మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీతో పాటు సచిన్ పైలట్ కూడా ఖండించారు. ఆయన సొంత పార్టీపై దృష్టి పెడితే మంచిదని సచిన్ సూచించారు.

మేమొస్తే రాజస్తాన్‌లో కులగణన

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార సభలో రాహుల్ హామీ



జైపూర్: రాజస్తాన్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. బుధవారం ధోల్‌పూర్, భరత్‌పూర్‌లలో జరిగిన ప్రచారసభల్లో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. ' దేశ రక్షణ కోసం పాటుపడేందుకు సైన్యంలో చేరాలని కలలు కనే లక్షలాది మంది యువత ఆశలను మోదీ సర్కార్ అగ్నిపథ్ పథకం తెచ్చి చిదిమేసింది. ఈ ఎన్నికల్లో గెలిచాక రాష్ట్రంలో, సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు తర్వాత దేశవ్యాప్తంగా కులగణన చేపడతాం. దళితులు, వెనుకబడిన తరగతుల జనాభా వంటి సమగ్ర వివరాలు బహిర్గతంకావాలంటే కులగణన జరగాల్సిందే. మోదీ హయాంలో దేశవ్యాప్తంగా ప్రజా సంపద పంపిణీ ఏ విధానంలో జరుగుతోందనేది పెద్ద ప్రశ్నగా మారింది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

అప్పుడలా.. ఇప్పుడిలా

''తాను ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తినని మోదీ పదేపదే చెప్పుకునేవారు. నేను ఎప్పుడైతే కులగణన డిమాండ్ తెరపైకి తీసుకొచ్చానో అప్పటి నుంచి ఆయన మాట మార్చారు. దేశంలో ఒక్కటే కులం ఉందట. అది 'పేదకులమట'' అని రాహుల్ ఎద్దేవాచేశారు. 'ప్రజాధనం లూటీ చేయడంలో మోదీ, కుబేరుడు గౌతమ్ అదానీ, హోం శాఖ మంత్రి అమిత్ షా బిజీగా మారారు. ముందుగా ప్రధాని మోదీ టీవీల్లో ప్రత్యక్షమై హిందువుల, ముస్లింల గురించి ప్రసంగాలు దంచేస్తూ ప్రజల దృష్టి మరల్చుతారు. వెంటనే గౌతమ్ అదానీ వెనక నుంచి వచ్చి ప్రజల జేబుల్లోని సొమ్ము నొక్కేస్తారు. ఆ తర్వాత ప్రజా వ్యతిరేకత, ఆందోళన అణచివేసేందుకు లాఠీ పట్టుకుని అమిత్ షా సిద్ధంగా ఉంటారు. ఇపుడు దేశంలో ప్రభుత్వం ఇలాగే నడుస్తోంది. మోదీ అనుక్షణం చానెళ్లలో కనిపిస్తూనే ఉంటారు. ఎందుకంటే ఆ చానెళ్లకు అధిపతి అదానీ కదా. మోదీనే ప్రజాధనాన్ని అదానీకి ముట్టజెప్తారు. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సిమెంట్ కర్మాగారాలను ధారాదత్తం చేస్తారు. అదానీకి అనుగుణంగా చట్టాలు చేస్తారు. పెద్ద నోట్లను రద్దుచేస్తారు'' అని రాహుల్ విమర్శించారు.

గుంజీలు తీస్తూ విద్యార్థి కన్నుమూత

జాజ్‌పూర్(ఒడిశా): బడి ఆవరణలో స్నేహితులతో ఆడుకుంటున్న విద్యార్థికి టీచర్ వేసిన శిక్ష ప్రాణం మీదకు తెచ్చింది. నాలుగో తరగతి విద్యార్థి గుంజీలు తీస్తూ కుప్పకూలి ఆస్పత్రిలో కన్నుమూసిన విషాద ఘటన ఒరాలీ గ్రామం దగ్గర్లోని సూర్యనారాయణ్ నోడల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో జరిగింది. రసూల్‌పూర్ బ్లాక్ విద్యాధికారి(బీఈఓ) నీలాంబర్ మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పదేళ్ల పిల్లాడు రుద్ర నారాయణ్ సేథీ బడి ప్రాంగణంలో మధ్యాహ్నం పూట మూడు గంటలకు తోటి విద్యార్థులతో ఆడుకుంటున్నాడు. అది క్లాసులు జరిగే సమయం కావడంతో ''క్లాస్ వదిలేసి ఏంటీ ఆటలు?'' అంటూ కోప్పడి అక్కడి టీచర్.. సేథీసహా ఐదుగురిని గుంజీలు తీయండని ఆదేశించారు. దీంతో గుంజీలు తీస్తూ సేథీ కొద్దిసేపటికి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని దగ్గర్లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి, మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తీసుకొచ్చేలోపే చిన్నారి ప్రాణాలు కోల్పోయాడని వైద్యులు ధృవీకరించారు. ' చిన్నారి మరణానికి వీళ్లే కారకులు అంటూ ఎవ్వరూ మాకు ఫిర్యాదు చేయలేదు. కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని బీఈఓ నీలాంబర్ స్పష్టం చేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 23 । నవంబర్ । 2023

బెళగావిలో ఆందోళనలు తగ్గాలి: సభాపతి

శివాజీనగర: శాసనసభా శీతాకాల సమావేశాలు బెళగావిలోని సువర్ణ విధానసౌధలో డిసెంబర్ 4 నుంచి ఆరంభమవుతాయని విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి తెలిపారు. బుధవారం విధానసౌధలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయి, ఉత్తర కర్ణాటకలోని ప్రముఖ సమస్యలపై చర్చ జరగాలనేది ఆశయం. బెళగావి అసెంబ్లీ సమావేశాలంటే ధర్నాలకు నిలయమని కొందరు భావిస్తారు. కాబట్టి సువర్ణసౌధ బయట ధర్నాలను తగ్గించడానికి వివిధ సంఘాల నాయకులతో మంత్రులు సమావేశమై నచ్చజెప్పాలన్నారు. దీనిపై సీఎం సిద్దరామయ్య, నలుగురు మంత్రులకు లేఖ రాశానని అన్నారు.

న్యూస్‌రీల్

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: సాలిగ్రామ తాలూకా మూడలబీడు గ్రామంలో కొన్నిరోజులుగా గ్రామస్తులను సతాయిస్తున్న చిరుతను ఎట్టకేలకు పట్టుకున్నారు. గ్రామాల్లో రాత్రి తిరుగుతూ కుక్కలు, పశువులను బలి తీసుకుంటున్న చిరుత బుధవారం బోనులో పడింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం మహేశ్ అనే వ్యక్తి పొలంలో చిరుతను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు బోనును ఏర్పాటు చేశారు. అక్కడ బోనులోకి చిరుత చిక్కగా అక్కడి నుంచి తరలించారు.

నటి తోట ముందు చిరుత

దొడ్డబళ్లాపురం: నెలమంగల తాలూకా సోలదేనహళ్లి వద్ద ఉన్న సీనియర్ నటి లీలావతికి చెందిన తోట గేట్ ముందు చిరుతపులి కనిపించింది. మంగళవారం రాత్రి 10:30 సమయంలో మెయిన్ గేట్ వద్ద చిరుత సంచరించడం స్థానికులు చూశారు. దీంతో సోలదేనహళ్లి, బాణసవాడి, అగళగుప్పె, బోడసంద్ర, హందిగుంటె గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. అటవీ అధికారులు తక్షణం చిరుతను బంధించాలని ప్రజలు కోరారు.

అనుమానంతో.. భార్యకు నిప్పు

బనశంకరి: భార్యపై అనుమానంతో ఆమెకు నిప్పుపెట్టిన ఘటన బనశంకరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. తీవ్రంగా గాయపడిన మహిళ పుష్పమ్మ విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కదిరేనహళ్లికి చెందిన శ్రీనివాస్‌తో 18 ఏళ్ల క్రితం పుష్పమ్మకు వివాహమైంది. ప్లంబర్‌గా పనిచేసే శ్రీనివాస్ అనుమానంతో భార్యతో గొడవపడేవాడు. ఇరుగుపొరుగు బుద్ధిమాటలు చెప్పారు. 16వ తేదీన పుష్పమ్మతో గొడవపడి ఆమె పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలు లేచి హాహాకారాలు చేస్తుండగా నీళ్లు పోసి మంటలను ఆర్పివేశాడు. తీవ్రంగా గాయపడిన పుష్పమ్మ చావు బతుకుల్లో ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి కిరాతక భర్తని అరెస్ట్ చేశారు.

వ్యాన్ తగిలి.. విరిగిన కంబీ



తుమకూరు: భారీ, ఎత్తైన వాహనాల ప్రవేశాన్ని నిరోధించేందుకు ఏర్పాటు చేసిన ఇనుప కంబీని తోసుకుంటూ ఒక వ్యాన్ వెళ్లడంతో కంబీ విరిగిపడింది. తుమకూరు నగరంలో శెట్టిహళ్లిగేట్ అండర్‌పాస్‌లో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం ఉదయం 9.10 గంటలకు వ్యాన్ కంబీని ఢీకొడుతూ వెళ్లడంతో ఒక కంబీ విరిగిపోయింది. అదే సమయంలో ఒక కుటుంబం పిల్లలతో కలసి బైక్‌లో అండర్‌పాస్‌లో వెళుతోంది. అదృష్టవశాత్తు వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనతో మూడు గంటల పాటు అక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. తర్వాత ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో పక్కకు ఆ ఇనుప కడ్డీని తొలగించి ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించారు. జిల్లా ఎస్పీ అశోక్ అక్కడికి వచ్చి పరిశీలించారు.

ఇద్దరు పోలీసుల సస్పెండ్

మైసూరు: పోలీసుల వేధింపుల కారణంగా నంజనగూడు నగర్లే గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనలో బిళిగెరె పోలీసు స్టేషన్ ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ సీమా లాట్కర్ సస్పెండ్ చేశారు. ఒక గొడవ కేసు విచారణ సందర్భంగా కానిస్టేబుళ్లు ప్రసన్న, నంజేశ్‌లు.. కిరణ్ అనే యువకున్ని వేధించారని ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. పోలీసుల వేధింపుల వల్లే చనిపోతున్నట్లు కిరణ్ వీడియో తీసి, పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు బాధితున్ని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స ఫలించక మరణించాడు. ఎస్పీ ఈ నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు.

పరీక్షల కేసులో సీఐ పై..

యశవంతపుర: కేఈఏ, ఎస్ఐ నియామక పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన కేసుకు సంబంధించి కలబురిగి జిల్లా అఫ్జలపుర సీఐ పండిత సగరను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రధాన నిందితుడు ఆర్‌డీ పాటిల్‌ను అరెస్ట్ చేయటంలో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనపై ఐజీపీ వేటు వేశారు. ఈ నెల 6న కలబురిగిలోని అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆర్‌డీ పాటిల్ గోడ దూకి ఉడాయించిన విషయం తెలిసిందే.

భక్తులపై తేనెటీగల దాడి

మండ్య: పాండవపుర తాలూకా మేలుకోటె చెలువ నారాయణస్వామి ఆలయంలో తొట్టిలుమడు జాతరలో అపశృతి చోటుచేసుకుంది. బుధవారం వేడుక సాగుతుడగా తేనెటీగలు దాడి చేశాయి, 10 మందికి పైగా భక్తులను తీవ్రంగా కుట్టడంతో అస్వస్థతకు గురయ్యారు. మరో 30 మందికి ఓ మోస్తరుగా కుట్టాయి. భక్తులు తేనె పుట్ట ఉన్న ఓ చెట్టు వద్ద కర్పూరాన్ని వెలిగించారు. కర్పూరం పొగ వల్ల తేనెటీగలు చెల్లాచెదురై భక్తులపై దాడి చేశాయి. జనం తలో దిక్కుకు పరుగులు తీశారు. అస్వస్థతకు గురైనవారిని మైసూరు ఆస్పత్రికి తరలించారు.

బయోమెట్రిక్‌కు తూట్లు

- అధ్యాపకుల ఇష్టారాజ్యం
- ఒకటి రెండు క్లాసులే దిక్కు
- సాంకేతిక విద్యాలయాల్లో బాగోతం





బయోమెట్రిక్‌ను పాటించకపోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కలవరం

హుబ్లీ: సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో కొన్ని కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది అనధికారికంగా గైర్హాజరు అవుతున్నట్లు ఫిర్యాదులు జోరుగా వినిపిస్తున్నాయి. ఇక్కడ బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ ఉన్నా కూడా పర్యవేక్షణ నామమాత్రమే అయింది. దీంతో విద్యాలయాల్లో బోధన, పరిపాలన కుంటుపడి విద్యార్థుల విలువైన జీవితం ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం నెలకొంది. ఈ పరిణామాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

188 విద్యాలయాల్లో అమలు

సాంకేతి విద్యా శాఖ 2022 డిసెంబర్ 19 నుంచి బయోమెట్రిక్ వ్యవస్థను తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో 188 ప్రభుత్వ, ఎయిడెడ్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐలలో బోధకులు, సిబ్బందికి బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేశారు. నిర్ణీత సమయానికి వచ్చినప్పుడు, డ్యూటీ ముగిసి వెళ్లేటప్పుడు వేలిముద్ర, లేదా కంటిపాప ద్వారా హాజరును నమోదు చేయాలి. ఇది గుమాస్తా నుంచి లెక్చరర్ల వరకు వర్తిస్తుంది.

హాజరు పట్టీకి స్వస్తి

గతంలో హాజరుపట్టీలో సంతకం చేసే విధానం వల్ల ఎప్పుడో మధ్యాహ్నం వచ్చి సంతకం చేసేవారు. ఇటువంటి అక్రమాలను నివారించడానికి బయోమెట్రిక్ వ్యవస్థను తెచ్చారు. కొన్ని చోట్ల ఇది అత్యుత్తమంగా అమలు అయింది కూడా. అయితే కొన్ని కళాశాలల్లో సక్రమంగా పాటించడం లేదనే విమర్శలు న్నాయి. ప్రతి రోజు నమోదయ్యే బయోమెట్రిక్ హాజరు వివరాలను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ పరిశీలించి బెంగళూరులోని సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్‌కు పంపించాలి.

నామమాత్రంగా మారిన వైనం

అయితే కొన్ని సంస్థల్లో నామమాత్రంగా మారింది. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, ప్రొఫెసర్లు బయోమెట్రిక్‌ను బేఖాతరు చేస్తున్నారు. ఒకటి రెండు క్లాసులు తీసుకొని మధ్యాహ్నం తర్వాత క్లాసులు జరపడం లేదు. బయటికి వెళ్లిపోయి మళ్లీ సాయంత్రం వేలిముద్ర పంచ్ కొట్టే సమయంలో వచ్చి హాజరు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. శాఖ పర్యవేక్షణ బృందం రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో పర్యటించి కొందరు కళాశాల సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని నివేదిక ఇచ్చి మూడేళ్లు గడిచినా ప్రక్షాళన చర్యలు తీసుకోలేదు. ఇదే రీతిలో ధార్వాడ శివార్లలో తారిహాళ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సక్రమంగా బోధన జరగడం లేదని ఆ గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే అరవింద బెల్లద దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పనివేళల్లో ఖాళీగా ఉన్న ఓ ఇంజినీరింగ్ కాలేజీలోని ఆఫీసు (ఫైల్)



మేలుకోటె చెలువ నారాయణస్వామి ఆలయంలో తీర్థోద్భవం ఊరేగింపు

నేత్రపర్వం అష్ట తీర్థోద్భవం

- మేలుకోటెలో భక్తజనం

మండ్య: జిల్లాలోని మేలుకోటెలో ప్రఖ్యాత చెలువ నారాయణస్వామి కార్తీకమాసం తొట్టిలమడు జాతర మహోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ జాతరలో భాగంగా అష్ట తీర్థోద్భవం బుధవారం వైభవంగా సాగింది. చెలువ నారాయణ స్వామి బంగారు పాదుకలకు పంచకల్యాణి, వైకుంఠ గంగ, ఇలా సుమారు 8 తీర్థాల్లో వేద ఘోషణల మధ్య అభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు నిత్యపూజ కైంకర్యాలు ప్రారంభం అయ్యాయి. 8.30 గంటలకు వేదాంతులు దేశికర సన్నిధికి పాదుకలను పల్లకి ద్వారా తరలించారు. 9 గంటలకు వజ్రఖచిత రాజముడి ఉత్సవం ధరించిన చెలువనారాయణ స్వామి ఉత్సవమూర్తి కల్యాణికి చేరుకుంది. అక్కడ గజేంద్రవర సన్నిధి వద్ద స్వామి పాదులకలకు కల్యాణిలో అభిషేకం చేశారు. వేలాది మంది భక్తులు కల్యాణిలో పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం అష్ట తీర్థోద్భవం మొదలైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు వందలాదిగా తరలి వచ్చారు. 25న శనివారం తీర్థస్నానం చేయడం ద్వారా రాజముడి బ్రహ్మోత్సవం ముగుస్తుంది.



పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మెట్రోలో అరణ్య రోదన



మెట్రో రైలులో ప్రయాణికుల మధ్య యథేచ్ఛగా వేధింపులు (ఫైల్)

- సాయం కోరిన యువతి, పట్టించుకోని ప్రయాణికులు



శివాజీనగర: సిలికాన్ సిటీలో నిత్యం ఏదో ఒకచోట అబలలపై వేధింపులు జరుగుతున్నాయి. మాల్స్, రోడ్లు, మెట్రో రైలు.. ఇలా ఎక్కడైనా భద్రత లేకుండా పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జన సందడితో ఉన్న మెట్రోలో యువతిని అసభ్యంగా తాకిన పోకిరీ వీడియో బయటకు వచ్చింది.

అంత రద్దీ ఉన్నా అడ్డుకోలేదు

సోమవారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో మెజిస్టిక్ మెట్రోలో ఘటన జరిగింది. బాధిత యువతి రోజూ మాదిరిగానే కాలేజీకి వెళ్లడానికి మెట్రో రైలులో ఎక్కింది. బోగీలో రద్దీగా ఉండగా, ఎర్ర చొక్కా ధరించిన ఓ వ్యక్తి వెనుక నుంచి ఆమెను తాకసాగాడు. ఇది గ్రహించిన యువతి సహాయం చేయాలని కోరితే తోటి ప్రయాణికులు ఎవరూ స్పందించలేదు. ఆమె ఏడ్చినా కూడా ఎవరిలో కనికరం కలగలేదు. యువతి స్నేహితులు ఈ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఘాటుగా వ్యాఖ్యానం పెట్టారు. ఇది బుధవారం చర్చనీయాంశమైంది. సదరు దుండగున్ని కఠినంగా శిక్షించాలని నెటిజన్లు డిమాండ్ చేశారు.

ఫిర్యాదు రాలేదు: మెట్రో

మెట్రో అధికారి యశ్వంత్ చౌహాన్ దీనిపై స్పందించగా, ఏ టైం, ఏ ట్రైన్ అని తెలియాల్సి ఉంది. సీసీ కెమెరాల చిత్రాలను పరిశీలిస్తున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు, అయినా కూడా మేం చర్యలు తీసుకొంటామని తెలిపారు.

ఘోరంపై జవాబు ఇవ్వండి

- విద్యుత్‌శాఖ పెద్దలకు లోకాయుక్త తాఖీదు

బనశంకరి: కరెంటు తీగ తగిలి మృతిచెందిన తల్లి తనయ దుర్ఘటనలో లోకాయుక్త సుమోటోగా కేసు నమోదుచేసి ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శితో పాటు 7 మంది అధికారులకు నోటీసులు జారీచేసింది. గత ఆదివారం ఉదయం మహదేవపురలో హోప్‌ఫాం వద్ద సౌందర్య అనే మహిళ కూతురుని ఎత్తుకుని వెళ్తూ తీగను తొక్కి మరణించడం తెలిసిందే. రాజ్యాంగం నిబంధనల ప్రకారం సురక్షిత వాతావరణం ప్రజలు జీవించేలా చూడడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని, విద్యుత్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించకపోవడానికి అధికారులే బాధ్యత వహించాలని, ఇలాంటి సమస్యలకు పరిష్కారం కనుక్కోవడానికి సమగ్ర దర్యాప్తు అవసరం ఉందని లోకాయుక్త పేర్కొంది. ఇంధన శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి, బెస్కాం ఎండీ, నగర ఉత్తర వలయ బెస్కాం ఇంజినీర్, ఉత్తర వలయ ఎస్ఈ, వైట్‌ఫీల్డ్ ఈఈ, కిందిస్థాయి ఇంజినీర్లకు నోటీసులు జారీచేసి డిసెంబరు 8 తేదీలోగా ఈ ప్రమాదం సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.



కరెంటు తీగను తొక్కి మంటల్లో కాలిపోతున్న తల్లీకూతురు(ఫైల్)

ఇది బాధ్యత లేని సర్కారు

- విజయేంద్ర ధ్వజం

శివాజీనగర: రాష్ట్రంలో తీవ్ర కరువుకాలం ఉన్నాకూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బోర్డు, కార్పొరేషన్‌ల అధ్యక్షుల నియామకం, లోక్‌సభ ఎన్నికల్లో బిజీగా ఉందని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ఆరోపించారు. బుధవారం మంగళూరులో ఆయన ర్యాలీ నిర్వహించి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ యడియూరప్ప సీఎంగా ఉండగా రైతులకు 7 గంటల విద్యుత్ ఇచ్చింది, ఇప్పుడు రైతులు తీవ్ర కరువులో ఉంటే కాంగ్రెస్ పాలకులు బాధ్యత లేకుండా ఎంజాయ్‌లో చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి జమీర్ అహమ్మద్ స్పీకర్‌కు మతం రంగును పూశారు, ఆయన అసెంబ్లీ సమావేశాల్లో ఎలా పాల్గొంటారో చూస్తామని సవాల్ చేశారు. నళిన్‌కుమార్ కటీల్, నేతలు పాల్గొన్నారు.



బాలిక శాలుకు శౌర్య అవార్డు

తుమకూరు: బావిలో పడిన తన చెల్లెలిని కాపాడి ధైర్యసాహసాలు ప్రదర్శించిన 8 ఏళ్ల తుమకూరుకు చెందిన శాలు అనే బాలికకు చెన్నమ్మ శౌర్య అవార్డును ఇవ్వాలని మహిళా శిశుసంక్షేమ శాఖ నిర్ణయించింది. గురువారం బెంగళూరులో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానోత్సవానికి రావాలని శాలుకు ఆహ్వానం పలికింది. తుమకూరు తాలూకా కుచ్చంగిపాళ్య గ్రామంలో ధనంజయ అనే వ్యక్తికి చెందిన ఫాం హౌస్‌లో జితేంద్ర, రాజకుమారిలు పని చేస్తున్నారు. వీరికి నలుగురు పిల్లలు. మొదటి సంతానమే ఈ శాలు. చెల్లెలు హిమాంశుతో పాటు శాలు ఆడుకుంటోంది. అకస్మాత్తుగా హిమాంశు బావిలో పడిపోయింది. ఈ క్రమంలో వెంటనే శాలు ఇంట్లోని లైఫ్ జాకెట్ వేసుకుని బావిలోకి దూకింది. వెంటనే తన చెల్లెలు మునిగిపోకుండా పట్టుకుంది. బావిలో పడిన ఇద్దరిని చూసిన స్థానికులు, తల్లిదండ్రులు పిల్లలను రక్షించారు. ఈ సంఘటనతో శాలుకు అవార్డు దక్కింది.



బాలిక శాలు

ఏనుగుల దాడులపై ధర్నా

శివమొగ్గ: అడవి ఏనుగు దాడిలో పొలాలు, తోటలు ధ్వంసమై రైతులకు నష్టం జరుగుతోంది. ఏనుగుల దాడులను అరికట్టడంలో అటవీ శాఖాధికారులు విఫలం చెందారని శివమొగ్గ తాలూకా ఉంబ్లెబైలు జీపీలోని సాలిగెరె గ్రామస్తులు మండిపడ్డారు. సాలిగెరె కి వచ్చిన అటవీ శాఖాధికారులు, సిబ్బందిని జనం అడ్డగించారు. నాలుగైదు ఏళ్లుగా సాలిగెరె చుట్టుపక్కల అటవీ ఏనుగుల తాకిడి పెరిగిందని, ఈ క్రమంలో ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలకు నష్టం కలుగుతోందని తెలిపారు. తక్షణమే అటవీ ఏనుగుల దాడులను నియంత్రించాలని, లేదంటే అటవీ శాఖ ఆఫీసు ముందు నిరసనకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరించారు.

మైషుగర్‌లో ప్రమాదం కార్మికుడు మృతి

మండ్య: మైషుగర్ చక్కెర కర్మాగారంలో ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మరణించాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. ఈ ఫ్యాక్టరీని ఇటీవలే పునరుద్ధరించడం తెలిసిందే. మహారాష్ట్రకు చెందిన దగే అనే వ్యక్తికి చక్కెర ఉత్పత్తి కాంట్రాక్టును అప్పగించారు. అతడు పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కార్మికులను పిలిపించుకుని పనులు చేయిస్తున్నాడు. బిహార్‌కు చెందిన రాకేశ్ (22) ఇటీవలే పనిలో చేరాడు. కన్వేయర్ బెల్ట్‌పై ఉన్న బూడిదను తొలగిస్తూ రాకేశ్ అందులో చిక్కుకున్నాడు. తక్షణమే పక్కనే ఉన్న కార్మికులు మెషీన్‌ను నిలిపేసి బయటకు తీసి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక మరణించాడు. సెంట్రల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

3 రోజులు వర్షసూచన



జల్లు వర్షం రావడంతో బెంగళూరు యశవంతపురలో గొడుగుల మధ్య వ్యాపారం



బుధవారం బెంగళూరు అంతటా మేఘావృతమైన ఆకాశం

- బెంగళూరులో తుంపర

బనశంకరి: రాష్ట్రంతో పాటు బెంగళూరు నగరంలో మూడురోజుల పాటు భారీ వర్షాలకు ఆస్కారం ఉందని వాతావరణ శాఖ బుధవారం తెలిపింది. దక్షిణ ఒళనాడు ప్రాంతంలో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని, కోలారు, తుమకూరు, బెంగళూరు, చామరాజనగర, రామనగర జిల్లాల్లో గట్టి వర్షం కురవవచ్చని తెలిపింది. కొడగు, శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాలకూ వర్షసూచన రావడంతో అప్రమత్తంగా ఉండాలని ఎల్లో అలర్ట్ ప్రకటించింది. ఇక బుధవారం బెంగళూరులో ఆకాశం మేఘావృతమై పలుచోట్ల తుంపర వర్షాలు కురిశాయి.



ఉద్యోగ భద్రత కల్పించాలని బుధవారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో అంగన్‌వాడీల ఆందోళన

పట్టపగలే భార్యపై భర్త హత్యాయత్నం

- చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలో కొడవలితో దాడి
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న భార్య



కుమారస్వామికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు



ప్రాణాంతక దాడికి గురైన మహిళ ఆశా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా

చెళ్లకెరె రూరల్: పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్ ముందు పట్టపగలే ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తాలూకాలోని చెన్నమ్మనాగతిహళ్లి గ్రామానికి చెందిన కుమారస్వామి అనే 27 ఏళ్ల యువకుడికి, 25 ఏళ్ల వయస్సుగల ఆశాకు మూడేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల పాటు వారి కాపురం అన్యోన్యంగా సాగింది. వారికి ఇంకా సంతానం కలగలేదు. గత ఏడాది కాలంగా దాంపత్య జీవితంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తి గొడవలు కావడం వల్ల దంపతులు వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలో భార్య ఆశా విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఆమెపై కోపంతో భర్త కుమార్ ఆమెను అంతమొందించాలని కక్ష పెంచుకున్నాడు. బుధవారం కోర్టు వాయిదాకు హాజరు కావడానికి ఒంటరిగా వచ్చిన భార్య ఆశా బస్సు దిగి బస్టాండ్ నుంచి బయటకు వచ్చింది.

బస్టాండ్ వద్దే మాటు వేసిన భర్త

ఆ వెంటనే అప్పటికే అక్కడ కొడవలిని కొనుగోలు చేసి మాటు వేసి ఉన్న భర్త కుమారస్వామి నడి బజారులోనే కొడవలితో ఆమెపై దాడి చేసి తల, మెడపై నరికి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయిన స్థానికులు భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన కుమార్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తక్షణమే ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు రక్తగాయాలతో విలవిల్లాడుతున్న క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో తాలూకా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందింపజేశారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన చిత్రదుర్గ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న ఆస్పత్రి వైద్యులు ఆమె ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలిపారు. కాగా ఇలాంటి నీచ కృత్యానికి పాల్పడిన భర్తకు కఠిన శిక్ష విధించాలని స్థానికులు ఒత్తిడి చేశారు. స్థలానికి డీఎస్పీ టీబీ రాజన్న, ఇతర అధికారులు చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై చెళ్లకెరె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్లుప్తంగా

వైభవంగా లక్షార్చన



లక్షార్చన నిర్వహిస్తున్న దృశ్యం

మాలూరు: చారిత్రక ప్రసిద్ధ యాత్రాస్థలం చిక్కతిరుపతిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్షార్చన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. లక్షార్చన సందర్భంగా ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి విశేష పూజలను చేశారు. ప్రధాన అర్చకులు రవి, గోపాలకృష్ణ భారద్వాజ్, ఎన్.శ్రీధర్‌ల నేతృత్వంలో పూజలను జరిపారు. ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలతో ఊరేగించారు. మధ్యాహ్నం 2 గంటలకు మహా మంగళారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. దేవదాయ శాఖ తహసీల్దార్ సుజాత, ఆలయ కార్యనిర్వహణాధికారి సెల్వమణి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ సంస్థాపక దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం 15వ సంస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వర్సిటీలో భువనేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించి హరియాణ విశ్రాంత వైస్ చాన్సలర్ వాసుదేవ్ మాట్లాడారు. వ్యవసాయంలో దిగుబడుల పెంపుదలకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు వ్యవసాయ రంగంపై దృష్టి సారించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. విద్యతో పాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చాన్సలర్ హనుమంతప్ప, సభ్యులు కొట్రేశప్ప, త్రివిక్రం జోషి, వీరనగౌడ, శ్రీధర్, సునీల్, మహంత గౌడ, అధికారులు పాటిల్, దేశాయి, నాయక్, గురురాజ్, నేమిచంద్ర, సత్యనారాయణ, ప్రమోద్ కట్టి, జాగృతి, రవి, శివ శరణప్పలున్నారు.

వివాదాస్పద స్టేటస్.. ఇద్దరి అరెస్ట్

హుబ్లీ: ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అవమానించేలా ఫోటో ఎడిట్ చేసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన ఇద్దరు యువకులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. జిల్లాలోని కలఘటిగి తాలూకా అసరంబి గ్రామ అష్ఫక్ షౌకత్ అలీ(23), రుతిక్ షరీఫ్ సాబ్(22) నిందితులు. వీరి వివాదాస్పద స్టేటస్‌ను గమనించిన ఆ గ్రామస్తులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. హిందూ సంఘాల నేత పరశురామ హులికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ

కంప్లి: బళ్లారిలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణబైరేగౌడ మార్గమధ్యంలో కూడ్లిగి తాలూకా కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా కార్యాలయంలో తహసీల్దార్‌తో పాటు సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని గమనించి ఒక్కసారిగా తహసీల్దార్‌పై కోపోద్రిక్తులయ్యారు. కార్యాలయ పనివేళలు ప్రారంభమై గంట దాటినా సిబ్బంది ఎందుకు విధులకు హాజరు కాలేదు. తహసీల్దార్‌గా మీకు బాధ్యత లేదా? అని నిలదీశారు. దీంతో తహసీల్దార్ సమాధానం చెప్పలేక గుటకలు మింగారు.

విమానాశ్రయం వద్ద జనం ధర్నా

శివమొగ్గ: శివమొగ్గ నగర శివార్లలోని సోగానె గ్రామం దగ్గర విమానాశ్రయం వద్ద రోడ్డును మూసివేయడాన్ని గ్రామస్తులు వ్యతిరేకించారు. బుధవారం ఉదయం తమ నిరసనను తెలిపారు. విమానాశ్రయంలో విమానాలు రాత్రివేళ రాకపోకలకు వీలుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓతిఘట్ట రోడ్డు వద్ద వాహనాల రాకపోకలను అడ్డుకునేందుకు రోడ్డును మూసివేయనున్నారు. ఈ చర్యపై గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రోడ్డు మూసివేస్తే సిద్ధరగుడి, సిరియూరు గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయని, మూసివేయరాదని డిమాండ్ చేశారు.

తనిఖీలపై ఎస్పీ ప్రకటన

యశవంతపుర: దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా కొత్లూరులో ఒకరి ఇంటికి నక్సలైటు వచ్చి వెళ్లినట్లు వచ్చిన వార్తలను దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ రిష్యంత్ తిరస్కరించారు. డబ్బుల మోసం కేసులో మూడబిద్రె పోలీసులు ఓ వ్యక్తి ఇంటికెళ్లిన మాట వాస్తవమన్నారు. నక్సలైట్ ఉండడం వల్ల తనిఖీ చేశారన్నది నిజం కాదన్నారు. ఒక భూమి రిజిస్ట్రేషన్ కేసులో మోసానికి పాల్పడిన నిందితుడు ఉదయం పూట దొరకని కారణంగా రాత్రి ముగ్గురు కానిస్టేబుళ్లు ఆ ఇంటికి వెళ్లారని, ప్రజలు అపోహలను నమ్మరాదని కోరారు.

శునకం ఓదార్పు?



మృతుడు తిప్పేశ్, తల్లిని ఓదార్చుతున్న కుక్క

యశవంతపుర: బైక్‌కు కుక్క అడ్డు రావటంతో కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన దావణగెరె జిల్లాలో జరిగింది. హొన్నాళి తాలూకా క్యాసినకెరె గ్రామానికి చెందిన తిప్పేశ్ (21) గత గురువారం క్యాసినకెరె నుంచి అనవేరిలో తన సోదరిని వదలిపెట్టి తిరిగి వస్తున్నాడు. కురుబర విట్లాపుర గ్రామం వద్ద మూడు కుక్కలు బైకుకు అడ్డు రావటంతో అతడు కింద పడి తలకు బలమైన గాయాలై మరణించాడు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయ్యింది. తన వల్లనే తిప్పేశ్ చనిపోయాడని ఒక కుక్క తిప్పేశ్ ఇంటికి వచ్చి కలియతిరిగింది. తిప్పేశ్ తల్లిని ఓదార్చింది. ఈ వీడియో అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

విద్యార్థినులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

విజయపుర: బెంగళూరు శారద కంటి ఆస్పత్రి, పట్టణ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, రోటరీ సహభాగస్వామ్యంతో పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 300 మందికి పైగా విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 12 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో ముగ్గురు పిల్లలను దేవనహళ్లి ప్రజా ఆస్పత్రికి సిఫార్సు చేశారు.

కావేరిలో ఏనుగుల జలకాలాటలు

మైసూరు: గున్న ఏనుగులతో కలిసి కావేరి నది దాటుతూ ఏనుగుల మంద బుధవారం చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలేమహదేశ్వర బెట్ట పరిధిలోని హోగేనకల్ జలపాతం వద్ద జలకాలాడాయి. సుమారు 20కి పైగా ఏనుగులు నది పక్కనే సంచరిస్తూ నీటిని చల్లుకున్నాయి. గోపీనాథ అనే యువకుడు ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

చిక్కినట్లే చిక్కి తప్పించుకున్న చిరుత



అటవీశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



బావిలో ఉన్న చిరుత(ఫైల్)

- అటవీశాఖ తప్పిదంతోనే అంటూ గ్రామస్తుల ఆందోళన

తుమకూరు: చిరుత చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది. కాగా అధికారుల నిర్లక్ష్యంతో చిరుత తప్పించుకుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మారనగెరె చుట్టుపక్కల రెండేళ్లుగా చిరుతలు తిరుగుతున్నాయని అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు బోను ఏర్పాటు చేసినా చిరుతను పట్టుకోలేకపోయారు. ఈక్రమంలో ఆహారం కోసం వెతుక్కుంటూ వచ్చిన చిరుత సోమవారం రాత్రి సంగమేష్ అనే వ్యక్తికి చెందిన పాడుబడిన బావిలో పడింది. సమాచారం అందుకున్న అధికారులు మంగళవారం ఘటన స్థలానికి వచ్చారు. బావి చుట్టు చేరిన ప్రజలను ఇళ్లకు వెళ్లాల్సిందిగా సూచించారు. ఆ తర్వాత వల సాయంతో చిరుతను బంధించేందుకు ప్రయత్నించారు. బావి నుంచి కొంచెం పైకి వచ్చిన చిరుత ఒక్కసారిగా ఒక్క దుముకు దూకి బయటకు వచ్చి పక్కనే ఉన్న అడవిలోకి పరుగులు పెట్టింది. చేతికి అందిన చిరుతను పట్టుకోలేకపోయారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు అటవీ శాఖాధికారి కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అటవీ శాఖ ఆర్ఎఫ్‌వో మధు, ఏఆర్ఎఫ్‌వో సుబ్బారావు ఈ ఘటనపై సమాధానం చెప్పాలని గ్రామస్తులు ఆందోళన చేశారు.

దొంగల ముఠా సభ్యుని అరెస్ట్

- పరారీలో ముగ్గురు నిందితులు



స్వాధీనపరచుకున్న కారు, మొబైల్ ఫోన్లతో పోలీసులు

బళ్లారి అర్బన్: స్థానిక బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగలముఠా సభ్యుడిని పట్టుకున్న పోలీసులు అతని నుంచి కారుతో పాటు 48 మొబైల్ ఫోన్లను స్వాధీనపరచుకున్నారు. బ్రూస్‌పేట్ సీఐ ఎంఎస్.సింధూర్ తెలిపిన వివరాలు..ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న బ్రూస్‌పేట్ ఎస్ఐ సవితారాణి, క్రైం సిబ్బందిని చూసి కారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తుల్లో ముగ్గురు నిందితులు పరారయ్యారు. కారులో ఉన్న కర్నూలు జిల్లాకు చెందిన బింగదొడ్డి మనోహర్‌ను పట్టుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. పరారైన నిందితులను కర్నూలు జిల్లాకు డోన్ తాలూకా చెందిన కొండపేట నాని, శివ, పవన్‌గా గుర్తించారు. వీరు ముఠాగా ఏర్పడి కారులో బళ్లారి, హొసపేటె, గంగావతి బస్టాండ్‌లు, ఇతర చోట్ల ఏడాది నుంచి ఈ నలుగురు వ్యక్తులు దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. రూ.3 లక్షల కారుతో పాటు రూ.5.24 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన మొబైల్‌లతో పాటు మొత్తం రూ.8.24 లక్షల విలువ చేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.

మారణాయుధాలతో బెదిరించి దోపిడీలు

బనశంకరి: దుండగులు బెంగళూరు నగరంలో బైకుల్లో సంచరిస్తూ మారణాయుధాలతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్నారు. మంగళవారం రాత్రి ఆర్టీ.నగర, డీజే.హళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిన్నూరు మెయిన్‌రోడ్డులో నేచర్‌బార్ అండ్‌రెస్టారెంట్‌లోకి చొరబడ్డారు. మారణాయుధాలతో బెదిరించి రూ.40 వేలు దోచుకున్నారు. అదే ప్రాంతంలో బీడాదుకాణం యజమానిపై దాడికి పాల్పడ్డారు. టీ లేదని చెప్పినందుకు దుకాణం అద్దాలు పగల గొట్టారు. డీజే.హళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీగా ఉన్న ఇమ్రాన్, అతడి అనుచరులు దోపిడీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అప్పులు తీర్చేందుకు కొబ్బరి బొండాల చోరీ



స్వాధీనం చేసుకున్న కొబ్బరి బొండాలు, అద్దెకారు

బనశంకరి: బెంగళూరు నగరంలో కొబ్బరిబొండాలను చోరీ చేస్తున్న మడివాళ నివాసి మోహన్ అనే దొంగను గిరినగర పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడు కొబ్బరి బొండాలు విక్రయిస్తూ ఖాళీ సమయంలో ఆన్‌లైన్ జూదం ఆడుతూ లక్షలాది రూపాయలు అప్పులుచేశాడు. కొంతకాలంగా అద్దెకారు తీసుకుని డ్రైవింగ్ చేసేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో కొబ్బరి బొండాల చోరీకి పథకం రచించాడు. దుకాణాల వద్ద నిల్వ ఉంచిన కొబ్బరిబొండాలను చోరీ చేసి అద్దెకారులో వేసుకొని మద్దూరు కొబ్బరిబొండాలు అని విక్రయించేవాడు. ఇటీవల గిరినగర మంకుతిమ్మ పార్కు వద్ద రాజణ్ణ అనే వ్యక్తికి చెందిన దుకాణం నుంచి వెయ్యికొబ్బరి బొండాలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సీసీకెమెరాల ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు. రూ.8 లక్షల విలువచేసే కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు స్వాధీనం చేసుకున్నారు.

రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దుదాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, విద్యార్థులు, ఇతర అధికారులు

హొసపేటె: రక్తహీనతతో బాధపడుతున్న వారికి తగిన వైద్యం అందించి విజయనగర జిల్లాకు రక్తహీనత రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు తెలిపారు. బుధవారం నగరంలో రక్తహీనత, ఉచిత పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తహీనత ఉన్న 6 నెలల నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలకు తగిన చికిత్స అందిస్తామన్నారు. విజయనగర జిల్లాలో మొత్తం 3,03,217 మంది లబ్ధిదారులు ఉండగా వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని సన్నాహాలు చేసిందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారికి తగిన వైద్యం, మందులు ఉచితంగా అందించాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి ఎల్ఆర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ రక్తహీనత ఉచిత పౌష్టికాహార కార్యక్రమాన్ని జిల్లాలో ఉద్యమ రూపంలో నిర్వహిస్తామన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు తగు పరీక్షలు చేసి వైద్యం అందజేస్తామన్నారు. దీంతో పాటు గర్భిణులు, బాలింతలను కూడా పరీక్షించి వారి ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం, ప్రతి చోటా ఆరోగ్యమే ఈ క్యాంపెయిన్ ధ్యేయమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్‌సిహెచ్ అధికారి డాక్టర్.జంబయ్య పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

30న కనక జయంతిని ఘనంగా జరపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: కనక జయంతిని ఈనెల 30న ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జయంతి నిర్వహణపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతిలో తాలూకాలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. జయంతిని ఈసారి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామన్నారు. ప్రతి జీపీ నుంచి కనకదాసు చిత్రపటంతో కూడిన పల్లకీని తెచ్చి పట్టణంలో ఊరేగించేలా పీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. తహసీల్దార్ సుధీంద్ర మాట్లాడుతూ కార్యక్రమంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభాన్విత కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు డాక్టర్ మంజునాథరెడ్డి, డాక్టర్ విశ్వనాథ్, వైఎస్ సత్యనారాయణ, బివి మునిరెడ్డి, ఎ భైరారెడ్డి, కృష్ణప్ప, కెసి మంజునాథ్, రామతీర్థ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: భావిభారత పౌరులైన విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రధాన సివిల్ జడ్జి బీకే మను అన్నారు. బుధవారం తాలూకాలోని హోదలి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బాలల దినోత్సవం, న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మౌలిక హక్కులు, ఏ చట్టాన్ని ఏ సమయంలో ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. చట్ట పరిజ్ఞానం ఉంటే సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. చట్టాలను గౌరవించే వ్యక్తి జీవితంలో ముందడుగు వేయవచ్చన్నారు. న్యాయవాది ఎం. నాగరాజ్, బీఈఓ భాగ్యలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి హెచ్ ఆర్ సచిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

కోలారు: సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా చట్టాలపై అవగాహన కల్గించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు సునీల్ ఎస్.హొసమని తెలిపారు. బుధవారం సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంచుకుని విద్యార్థులు సత్ప్రౌరులుగా రూపొందావాలన్నారు. ఇటీవల మాదక వస్తువులు, పొగాకు ఉత్పత్తులకు ఎక్కువగా బానిసలు అవుతుండడం ఆందోళనకరమన్నారు. దీనివల్ల జీవితాలను నాశనం చేసుకుంటున్న వాళ్లు ఎంతో మంది ఉన్నారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి తగిన అవగాహన కలిగించాలన్నారు. ఇదే సమయంలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు, బాల్య వివాహ నిషేధ చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది కేఆర్ ధనరాజ్, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రమీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదరీతిలో వివాహిత మృతి



మృతురాలు మాహెనూర్

కోలారు: అనుమానాస్పద రీతిలో ఓ వివాహిత మరణించిన ఘటన బుధవారం నగరంలోని మిల్లత్ నగర్‌లో చోటు చేసుకుంది. మాహెనూర్(22) అనే యువతికి రెండేళ్ల క్రితమే మిల్లత్ నగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ షోయబ్‌తో వివాహమైంది. అయితే మాహెనూర్ తల్లిదండ్రులు తమ కుమార్తెను వరకట్నం కోసం వేధించే వారని, కట్నం కోసం భర్తే హత్య చేసి ఉంటాడని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గల్‌పేటె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనుల పూర్తికి సూచన



మాట్లాడుతున్న రవిశంకర్

రాయచూరు రూరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి డాక్టర్ జె.రవిశంకర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మందకొడిగా సాగుతున్న ఐసీడీఎస్ పథకం పనులపై అధికారులకు సూచనలు జారీ చేశారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, ఏడీసీ దురుగేష్, ఏసీ మెహబూబి, రోణ, ప్రకాష్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి సురేంద్రబాబు, ఐసీడీఎస్ అధికారి చేతన్‌లున్నారు.

గురుపాదేశ్వరుడికి పూజలు



పూజలందుకున్న గురుపాదేశ్వరుడు

రాయచూరురూరల్: నగరంలో గురుపాదేశ్వరుడి 23వ పుణ్యారాధన నిర్వహించారు. బుధవారం కిల్లే బృహన్మఠంలో మఠాధిపతి శాంతమల్ల శివాచార్య గురుపాదేశ్వర మూల విరాట్‌కు అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళ హారతి నెరవేర్చారు. అనంతరం గురుపాదేశ్వరుని భక్తులకు అన్నప్రసాదం చేశారు.

పాఠశాల అంతస్తు నుంచి పడి విద్యార్థి మృతి



శివరాజ్(ఫైల్)

సాక్షి,బళ్లారి: విజయపుర జిల్లాలో పాఠశాల మొదటి అంతస్తు నుంచి పడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. బుధవారం జిల్లాలోని ఇండి పట్టణంలోని ఆర్.ఎం.షా పాఠశాలలో యూకేజీ చదువుతున్న శివరాజ్(5) అనే బాలుడు ప్రమాదవశాత్తు పాఠశాల మొదటి అంతస్తు నుంచి కాలు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా, బాలుడు మృతి చెందాడు. దీంతో పాఠశాల సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం తెలియజేశారు. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఆస్పత్రికి చేరుకున్నారు. పాఠశాల మాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ మృతి చెందాడని రోదించారు. ఈ ఘటనపై విజయపుర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు మందులు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నందకుమార్

శ్రీనివాసపురం: మెడికల్ షాపుల్లో అనుమతి లేని మత్తు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ నందకుమార్ తెలిపారు. ఆయన బుధవారం ముళబాగిలు పోలీస్ స్టేషన్‌లో మెడికల్ షాపు యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నగరంలో యువత మత్తు మందులకు బానిస కాకుండా నివారించడం కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మెడికల్ షాపుల యజమానులు తమతో సహకరించాలని సూచించారు. నిషేధిత మందులను ఎట్టి పరిస్థితిలోను మందుల దుకాణాల్లో విక్రయించరాదన్నారు. ఎక్కడైనా ఇలాంటి మందులను విక్రయిస్తుంటే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఔట్‌పై నోటీసులు



అనధికారికంగా నిర్మించిన లేఔట్

కేజీఎఫ్: కేజీఎఫ్ నగరాభివృద్ధి ప్రాధికార వ్యాప్తిలోని సారేగొడన కోట గ్రామ సర్వేనెంబర్-14/5లో 0.39 ఎకరాల భూమిలో అనధికారికంగా లేఔట్ నిర్మించిన మునిమారెప్ప అనే వ్యక్తికి కేజీఎఫ్ నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్ ధర్మేంద్ర నోటీసులు జారీ చేశారు. లేఔట్‌లో నియమాలను పూర్తిగా ఉల్లంఘించారని, పార్కు కోసం స్థలం వదల లేదని, నిర్ణీత రోడ్డు విస్తీర్ణం లేదని, కాలనీకి విద్యుత్ కనెక్షన్ కల్పించలేదని, 30 మీటర్ల బఫర్ జోన్ కల్పించలేదని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందిన 8 రోజుల్లోగా లేఔట్‌ను తొలగించి సరైన దాఖలాలతో మునిమారెప్ప మళ్లీ ప్రాధికారకు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో ప్రాధికార చట్టాల ప్రకారం లేఔట్‌ను తొలగించి అందుకైన ఖర్చును భూ రెవిన్యూ బకాయి కింద వసూలు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్

తుమకూరు: నగరంలోని మండిపేటె ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగింపజేశారు. మండిపేటె ప్రధాన రహదారిలో దుకాణాల యజమానులు తమ షాపుల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లపై వస్తువులను పెట్టుకుని వ్యాపారం సాగిస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో పాలికె కమిషనర్ బీవీ అశ్విజా ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆక్రమణలను తొలగించారు.

రాజ్యోత్సవ అవార్డు ఉపసంహరణ

మైసూరు: రౌడీషీటర్‌కు ఇచ్చిన కన్నడ రాజ్యోత్సవ అవార్డును వెనక్కి తీసుకోవాలని మైసూరు జిల్లా పాలన యంత్రాంగం తీర్మానించింది. మైసూరు లష్కర్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్‌గా పేరు నమోదైన అశోక్ అనే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడికి నవంబర్ 1న రాజ్యోత్సవ అవార్డును మైసూరు జిల్లా పరిపాలన విభాగం ఇచ్చి గౌరవించింది. ఈ చర్య వివాదాస్పదం అవ్వడంతో ఆ అవార్డును తిరిగి ఉపసంహరించుకోవాలని తీర్మానించింది. చివరి క్షణంలో అవార్డు జాబితాలో పేరు చేర్చినట్లు, పోలీసుల నుంచి అతని నేపథ్యం, సమాచారం ఆలస్యంగా వచ్చిందని, దీంతో ఆలస్యంగా అతను రౌడీషీటర్ అని తెలిసినట్లు, ఈ కారణంగా అవార్డును ఉపసంహరించుకోనున్నట్లు కన్నడ సాంస్కృతిక శాఖ సహాయక డైరెక్టర్ సుదర్శన్ తెలిపారు.

కన్నడపై అభిమానం ఉండాలి


కన్నడ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: కన్నడ భాష, భూమి, సంస్కృతిపై ప్రతి ఒక్కరూ అభిమానం కలిగి ఉండాలని తీర్థ ట్రస్ట్ డాక్టర్ కేవీ ప్రకాశ్ తెలిపారు. తాలూకాలోని ఆనూడి గ్రామంలో మారుతీ యువకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కర్ణాటక రాజ్యోత్సవం, పునీత్ రాజ్‌కుమార్ సంస్మరణ కార్యక్రమాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కన్నడ ఏకీకరణ కోసం ఆలూరు వెంకటరావ్ తదితరులు చేసిన సేవలను వివరించారు. అనంతరం భువనేశ్వరీ దేవి ప్రతిమను ఊరేగించారు. వకీలు నాగేశ్, రామమూర్తి, రాజణ్ణ, జగదీశ్, చౌడప్ప, సిద్దారెడ్డి, జలీనాతాజ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని భ్రష్టు పటిస్తున్న సర్కార్'


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వైఏ నారాయణ స్వామి

బాగేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం పీయూ శాఖను జెడ్పీ పరిధిలోకి తీసుకురావడాన్ని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ వైఏ నారాయణ స్వామి తెలిపారు. ఈ ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాగేపల్లి పర్యాటక మందిరంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానంపై నిర్లక్ష్యం ప్రదర్శించి తమదైన ప్రత్యేక విద్య విధానం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం దురహంకారంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం కలుషితం అవుతోందని విమర్శించారు.

ఫ్యాక్టరీలో ఐటీ సోదాలు

దొడ్డబళ్లాపురం: హారోహళ్లి పారిశ్రామికవాడలో ఉన్న స్టవ్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయాన్నే పోలీసులతో కలిసి వచ్చిన ఐటీ అధికారుల బృందం ఫ్యాక్టరీలో సోదాలు చేపట్టారు. పలు డాక్యుమెంట్లకు సంబంధించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోదాలు జరిపిన అధికారులు బయటకు వచ్చేంతవరకూ ఫ్యాక్టరీ మెయిన్ గేట్లు మూసివేశారు. ఐటీ దాడికి సంబంధించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

తహసీల్దార్‌పై దాడికి యత్నం

మైసూరు: విధుల్లో ఉన్న తహసీల్దార్‌పై దాడికి యత్నించిన ఘటన జిల్లాలోని పిరియాపట్టణ కార్యాలయంలో జరిగింది. తాలూకా పాలన భవంతిలో తహసీల్దార్ అహ్మద్ విధుల్లో ఉండగా మధ్యాహ్నం సమయంలో చామరాయనకోటె జగదీశ్, ముమ్మడి కావలు దొడ్డయ్య అనే వ్యక్తులు వచ్చి తమ పొలం విషయంతో పాటు అనేక విషయాలపై మాట్లాడారు. ఈ క్రమంలో కోపంతో తహసీల్దార్ టేబుల్‌పై ఉన్న ఫైళ్లను చింపేశారు. ఏకవచనంతో సంబోధిస్తూ దాడి చేసేందుకు యత్నించారు. అక్కడున్న వారు ఈ ఇద్దరిని అడ్డుకున్నారు. అనంతరం సీఐ కేవీ శ్రీధర్‌కు తహసీల్దార్ ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఎస్ఐ అక్కడకు చేరుకొని ఇద్దరిని అరెస్టు చేశారు.

చిన్న అరటి, పెద్ద లాభం


అరటి తోటలో పుట్టణ్ణ


యాలక్కి అరటి

- వైవిధ్య సాగు.. ఆదాయం బాగు
- రైతు పుట్టణ్ణ ఆదర్శం

గౌరిబిదనూరు: వ్యవసాయం కలిసి రావడం లేదని, అప్పులు తప్ప మరేమీ మిగలలేదని చాలామంది చెబుతూ ఉంటారు. కానీ మనసుపెట్టి సాగిస్తే వ్యవసాయం కూడా లాభాలను ఇస్తుందని ఓ చిన్నకారు రైతు చాటిచెప్పారు.

చిన్న అరటి పండ్లు యాలక్కి సాగు నుంచి పెద్ద లాభాలను గడిస్తున్నాడు గౌరిబిదనూరు తాలూకా రమాపురం గ్రామ పంచాయితీ హంపసంద్రం రైతు పుట్టణ్ణ. ఆయన చదివింది 2వ తరగతి అయినా అరటి సాగులో రాణిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వర్షాలు రావు. పెద్దల నుంచి వచ్చిన ఎకరా భూమికి తోడు చుట్టుపక్కల వారి నుంచి 4 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొన్నాడు. పొలంలో నాలుగు బోరు బావులు తవ్వించగా, ఒక బోరు నుంచి తోటకు నీరు వస్తోందని చెప్పారు.

ఏడాదికి రూ. 2 లక్షల ఆదాయం

రెండున్నర ఎకరాలలో 2400 యాలక్కి అరటి మొక్కలను నాటాడు. ఇప్పుడు ఏపుగా పెరిగి అరటి గెలలు విరగగాశాయి. ఒక్కో గెల 17 కేజీలు తూగుతోందని రైతు చెప్పారు. సేంద్రియ, రసాయన ఎరువులు వాడుతున్నట్లు, డ్రిప్ ఏదీ లేదని రైతు తెలిపారు. ఈ ఏడాది సుమారుగా ఖర్చులన్నీ పోను రూ. 2 లక్షల లాభాలు వస్తాయని పుట్టణ్ణ చెప్పారు. యాలక్కి పంటను బెంగళూరు మార్కెట్లో విక్రయిస్తున్నారు.



జీవాల పెంపకం


జెర్సీ ఆవులతో పుట్టణ్ణ దంపతులు

పాడితో అదనపు రాబడి

తోటలో సుగంధరాజా పూలు, మొక్కజొన్న పంటలు కూడా వేశారు. అనవసర ఖర్చులకు పోకుండా శ్రద్ధతో వ్యవసాయాన్ని చేబడితే రైతులకు నష్టమనేది ఉండదని అన్నారు. రైతు సేద్యానికి తోడుగా పాడి పరిశ్రమ, పశుపోషణను కూడా చేపడితే ఆదాయం పెరుగుతుందని, అందుకే తాను రెండు జెర్సీ ఆవులు, 20 గొర్రెలు, మేకలను పెంచుతున్నట్లు తెలిపారు.

కులగణన పూర్తిస్థాయిలో జరగనే లేదు


మాట్లాడుతున్న మాజీ సీఎం కుమారస్వామి

మండ్య: కులగణన పూర్తి స్థాయిలో జరిగితేనే కదా కాంతరాజు నివేదిక విడుదల చేయడానికి అంటూ మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఎద్దేవా చేశారు. స్కూల్ పిల్లల నుంచి సంతకాలు చేయించుకుని వారికి నచ్చినట్లు సిద్ధం చేసిన నివేదిక అది అని కాంతరాజు నివేదికపై విమర్శలు చేశారు. మండ్యలో మీడియాతో కుమారస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ట్వీట్ తాను చూసినట్లు, ఆయన రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా కులగణన నివేదిక విడుదల చేస్తామని ప్రకటించారని ఎద్దేవా చేశారు. కాంతరాజు నివేదికను కుమారస్వామి తిరస్కరించారని ఆరోపిస్తున్నారని, అయితే తన హయాంలో అసలు నివేదికే రాలేదని గుర్తు చేశారు. కాంతరాజు నివేదికపై సభ్య కార్యదర్శి అసలు సంతకమే చేయలేదన్నారు. అసలు నివేదిక పూర్తి స్థాయిలో సిద్ధం కాలేదని, ఎవరెవరివో సంతకాలు తీసుకుని ఇష్టానుసారం కమిటీ సభ్యులే నివేదికను రాసేశారని ఆరోపించారు.

నిశ్చితార్థ ఉంగరం పోయిందని విషం తాగాడు

- చికిత్స పొందుతూ యువకుడు మృతి


కమలేశ్ మృతదేహం

తుమకూరు: బాజాభజంత్రీలు మోగాల్సిన ఇంటిలో ఇంటిలో తీరని విషాదం నెలకొంది. నిశ్చితార్థ ఉంగరం పోయిందని మనస్తాపానికి గురై విషం తాగిన యువకుడు మృతిచెందాడు. ఈ విషాద ఘటన తుమకూరు నగరంలో జరిగింది.తుమకూరు నగరం దేవరాయపట్టణ నివాసి కమలేశ్ (36)కు మూడు నెలల క్రితం బెంగళూరు చెందిన యువతితో వివాహం నిశ్చయించారు. స్నానం చేసే సందర్భంగా నిశ్చితార్థ ఉంగరాన్ని పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై ఇంట్లో పెద్దలకు చెప్పేందుకు భయపడి విషం సేవించాడు. ఈ నెల 17న విషం తాగి జిల్లాస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం మరణించాడు. క్యాతసంద్ర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

బ్యాంక్‌కు వెళ్తే..ఇంట్లో చోరీ

మైసూరు: మైసూరు కల్యాణగిరి లేఔట్‌లో నగలు, నగదు చోరీకి గురయ్యాయి. ఎంహెచ్ రెహమాన్ అనే వ్యక్తి తన భార్యతో కలసి బ్యాంక్‌కు వెళ్లాడు. పసిగట్టిన దుండగులు ఇంట్లోకి చొరబడి 98 గ్రాములు బంగారు ఆభరణాలు, రూ. 1.50 లక్షల నగదు దోచుకుని ఉడాయించారు. ఇంటికి వచ్చిన రెహమాన్..జరిగిన చోరీని గుర్తించి ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గ్యాస్ లీక్‌తో పేలిన సిలిండర్

- ఆరు మందికి గాయాలు


ఇంటిపైకప్పునకు ఉన్న రేకులు గాల్లో లేచిపోయిన దృశ్యం

బనశంకరి: వంట గ్యాస్ సిలిండర్ పేలి ఆరుమంది గాయపడ్డారు. ఈఘటన కోణనకుంటె పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వీవర్స్‌కాలనీ మారుతి లేఔట్‌లో మార్టీన్ అనే వ్యక్తికి చెందిన ఇంటిలో ఉత్తరప్రదేశ్‌లోని బనారస్‌కు చెందిన ఐదుమంది అద్దెకు ఉంటున్నారు. బుధవారం తెల్లవారుజామున వంటింట్లో లైట్ ఆన్‌చేయగానే అప్పటికే గ్యాస్ లీకై నందున ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పు రేకులు గాల్లోకి లేచిపోయాయి. ఇల్లు ధ్వంసమైంది. వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారు ధ్వంసమైంది. ఘటనలో జమాల్(32), నాజియా (22), ఇర్ఫాన్(21) గులాబ్(18), షహజాద్(9)తోపాటు పక్కింట్లో నివాసం ఉండే ఈశ్వరమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. కోణనకుంటె పోలీసులు చేరుకుని క్షతగాత్రులను విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

మానవహక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


హ్యూమన్‌రైట్స్ హెల్ప్ అసోసియేషన్ కర్ణాటక నూతన అధ్యక్షుడు డీ.వెంకటకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బనశంకరి: మానవహక్కులను పరిరక్షించడం ద్వారా సమాజంలో చిట్టచివరి వ్యక్తికీ న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని హ్యూమన్‌రైట్స్ హెల్ప్ అసోసియేషన్ కర్ణాటక నూతన అధ్యక్షుడు డీ.వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కోరమంగల క్లబ్‌లో బుధవారం ఆయన ఆ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సోనూసింగ్‌భరత్, జాతీయ ఉపాధ్యక్షుడు, లీగల్ అడ్వైజర్ మహమ్మద్ సాహిల్‌ఖాన్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలోని మారుమూలగ్రామాల్లో నేటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయని, వీటి నియంత్రణకు పాటుపడాలన్నారు. మహిళలు, బాలికలపై పెరుగుతున్న అత్యాచారాలు, దాడులకు అడ్డుకట్ట వేయాలన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు జాగృతి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా సంఘం శాఖలు పెంచాలన్నారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ మహిళల విభాగం చైర్‌పర్సన్ పీ.అరుణాదేవి, జాతీయ ప్రధాన ఉపాధ్యక్షుడు యతీంద్రకుమార్, జాతీయ కార్యదర్శి పూర్ణసాగర్, జాతీయ సంయుక్త కార్యదర్శి టీఎం వరప్రసాద్, కర్ణాటక విభాగం సభ్యులు భక్తవత్సలరెడ్డి, పీ.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 23న ఎస్‌ఐ పోస్టులకు రాతపరీక్ష

యశవంతపుర: 545 ఎస్‌ఐ పోస్టుల భర్తీకి మరు పరీక్షను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా డిసెంబర్ 23న రాత పరీక్ష నిర్వహించాలని కర్ణాటక పరీక్ష ప్రాధికార కార్యనిర్వాహక డైరెక్టర్ ఎస్ రమ్య ఆదేశాలు జారీ చేశారు. బెంగళూరులో నిర్వహించే పరీక్షకు గతంలో రాసిన అభ్యర్థులు కూడా అర్హులని ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య సేవల్లో లోపాలు..ఆస్పత్రికి తాళాలు

మైసూరు: వైద్య సేవల్లో లోపాల కారణంగా ఒక రోగి మరణించాడనే ఆరోపణలతో మైసూరు గోకులం లేఔట్‌లో ఉన్న ఆదిత్య అధికారి ఆస్పత్రికి తాళాలు వేశారు. తక్షణమే ఆస్పత్రిలోకి రోగులను వేరే ఆస్పత్రులకు బదిలీ చేసి, వైద్యుడు చంద్రశేఖర్‌పై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర ఆదేశాలు జారీ చేశారు. శివణ్ణ వ్యక్తి 2016లో ప్రమాదంలో గాయపడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆ తర్వాత 2017లో మెరుగైన వైద్య కోసం ఆదిత్య అధికారి ఆస్పత్రిలో చేరాడు. ఒక ఆపరేషన్ కోసం నాలుగు నెలల పాటు చికిత్స అందించారు. అయితే ఆపరేషన్ చేసిన తర్వాత చికిత్స ఫలించక శివణ్ణ మరణించాడు. వైద్యుల నిర్లక్ష్యం మేరకు శివణ్ణ మరణించాడని మృతుడి తమ్ముడి కుమారుడు రవిగౌడ ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఆస్పత్రి, ఆ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్‌పై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశారు. విచారణలో వైద్యుడు చంద్రశేఖర్ విధి నిర్వహణలో ఐదు అంశాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అనస్తీషియా విషయంలో సరైన విద్యార్హత లేదని, అనధికారికంగా బీఏఎంఎస్ చదివిన వ్యక్తిని నియమించుకున్నాడని, ఇందుకే శివణ్ణ మరణించాడని నివేదికలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి రూ. 15.60 లక్షల పరిహారం అందివ్వాలని 2023 ఆగస్టు 8న ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ఈ ఆదేశాలను ఆస్పత్రి పాటించకపోవడంతో తాజాగా ఆస్పత్రికి తాళాలు వేశారు.

రేపటి నుంచి కంబళ పోటీలు

- బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- బరిలో 150 జతల దున్నలు


కంబళ పోటీలు(ఫైల్)

యశవంతపుర: కరావళి గ్రామీణ క్రీడలైన కంబళ పోటీలను తొలిసారిగా బెంగళూరులోని ప్యాలెస్ మైదానంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు బెంగళూరు కంబళ సమితి అధ్యక్షుడు, పుత్తూరు ఎమ్మెల్యే అశోక్ కుమార్ రై తెలిపారు. ఆయన బుధవారం బెంగళూరులో విలేకర్లతో మాట్లాడారు. కంబళ పోటీలకు లారీల ద్వారా దున్నపోతులను ఉప్పినంగడి నుంచి బెంగళూరుకు ఈ నెల 23న తీసుకొస్తారన్నారు. 150 జతల దున్నపోతులు పోటీల్లో పాల్గొంటాయన్నారు. దున్నపోతులకు అవసరమైన ఆహారం, నీళ్లు, పశు వైద్యులు బృందం కూడా కరావళి నుంచి వస్తుందన్నారు. దున్నలు 24న ప్యాలెస్ మైదానంలో విశ్రాంతి తీసుకుంటాయని, 25న ఉదయం కంబళ పోటీలు ప్రారంభం కానున్నట్లు అశోక్‌కుమార్ రై వివరించారు. కంబళ పోటీలను 8 లక్షల మంది వీక్షించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. మైదానంలో కొరియన్ టెంట్ వేశారు. 65 సంఘ సంస్థలు కంబళ పోటీల నిర్వహణకు సహకరిస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు ప్రకాశ్‌శెట్టి వివరించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పోటీలను ప్రారంభిస్తారని, బీఎస్ యడియూరప్ప, జగదీశ్ శెట్టర్, హెచ్‌డీ కుమారస్వామి పాల్గొంటారన్నారు.

పరివార సముదాయ సమస్యను పరిష్కరించండి

శివాజీనగర: పరివార సముదాయానికి సంబంధించిన సమస్యను పరిష్కరించి ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులను ఆదేశించారు. వివరాలు. 2020లో భారత ప్రభుత్వం పరివార, తళవార సముదాయాలను ఎస్టీల్లోకి చేర్చింది. అయితే పాత మైసూరులో పరివార సముదాయం ఇప్పటికీ వెనుకబడిన వర్గాల జాబితాలో ఉంది. దీంతో వారికి కులధ్రువీకరణపత్రాలు అందజేయడంలో గందరగోళం నెలకొంది. దీనిపై చర్యలు తీసుకొని పరివార సముదాయానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే అనిల్ చిక్కమాదు నేతృత్వపు బృందం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విన్నవించింది. ఈ మేరకు స్పష్టమైన సర్క్యులర్ జారీచేసి, కుల ధ్రువీకరణ పత్రం గురించి వివాదాన్ని పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

పోస్టర్ అంటించినవారిపై చర్యలు తీసుకోండి


వినతిపత్రం అందిస్తున్న జేడీఎస్ నాయకులు

యశవంతపుర: మాజీ సీఎం కుమారస్వామి కరెంట్ దొంగ అంటూ పోస్టర్ అంటించిన అకతాయిలపై చర్యలు తీసుకోవాలని జేడీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బెంగళూరు నగర అధ్యక్షుడు రమేశ్‌గౌడ, మాజీ ఎమ్మెల్సీ చౌడరెడ్డి, న్యాయశాఖ అధ్యక్షుడు ఏపీ రంగనాథ్ బుధవారం బెంగళూరు పోలీసు కమిషనర్ దయానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు ఎస్.మనోహర్ పోస్టర్ అంటించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హోసూరు వార్తలు..

26న కార్తీక దీపోత్సవం

హోసూరు: హోసూరు తేరుపేటలోని శ్రీ చంద్రచూడేశ్వరస్వామి కొండపై 26వ తేదీ కార్తీక దీపోత్సవాల నిర్వహణపై బుధవారం హిందూ సంఘాల నేతల సమావేశం జరిగింది. బీజేపీ నేత ఎం.నాగరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 26వ తేదీ ఆదివారం ఉదయం స్వామివార్లకు విశేష పూజలు, భక్తులకు అన్నదానం, సాయంత్రం 4 గంటల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపాన్ని వెలిగించాలి అని తీర్మానం చేశారు.

నగల దొంగల అరెస్టు

హోసూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న మహిళ వద్ద నగలు దొంగిలించిన ఇద్దరు దొంగలను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని టైటాన్ టౌన్‌షిప్ ప్రాంతానికి అశ్విని (29) గత రెండు రోజుల క్రితం చెన్నైకు వెళ్లి మంగళవారం తిరుగు ప్రయాణమైంది. రాత్రి 7 గంటల ప్రాంతంలో హోసూరు బస్టాండుకు చేరుకొన్న ఈమె బ్యాగులోని రూ. 3.50 లక్షల విలువ చేసే నగలు లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా తిరువణ్ణామలైకు చెందిన భీమన్ (30), వీరమణి(30) అనే ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. నగలను స్వాధీనపరుచుకొని అరెస్ట్ చేశారు.

అభివృద్ధి పనుల తనిఖీ

హోసూరు: క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికార్లతో సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ శరయు, జిల్లా పరిశీలకురాలు బీలా రాజేష్ ముఖ్య పాల్గొన్నారు. అధికారులతో సమావేశమై పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. హోసూరు రామనాయకుని చెరువులో రూ.23.42 లక్షల ఖర్చుతో జరుగుతున్న శుద్ధీకరణ పనులు, రోడ్డుపై జరుగుతున్న బ్యారికేడ్ పనులను పరిశీలించారు. అనంతరం పారిశ్రావాడ బేగేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు అందజేస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. డీఆర్‌వో సాధన కురల్, అధికారులు పుష్ప, కమిషనర్ స్నేహ పాల్గొన్నారు.

రైతులకు నోటీసులు ఇవ్వొద్దు

చిక్కబళ్లాపురం: రైతులు పంటల సాగు కోసం తీసుకున్న రుణాల వసూళ్లకు బ్యాంకర్లు ఎలాంటి నోటీసులు ఇవ్వరాదని ఆదేశాలు జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ రవీంద్ర తెలిపారు. బుధవారం ఆయన రైతు నేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వర్షాభావంతో పంటలు ఎండిపోయాయని, కరువుతో రైతులు తల్లడిల్లిపోతున్నారని రైతు నాయకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందించి రుణాల వసూళ్లకు నోటీసులు ఇవ్వరాదని లీడ్ బ్యాంక్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాల డబ్బు రైతు ఖాతాల్లో జమ అయితే వాటిని బ్యాంకర్లు వాటిని రుణాలకు జమ చేయవద్దని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 17 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉందని, ప్రైవేటు బావుల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శశికుమార్, జిల్లా ఎస్పీ నాగేశ్, తహసీల్దార్ మహేశ్‌పత్రి పాల్గొన్నారు.

చెలరేగిన సైబర్ దొంగలు

- ముగ్గురికి రూ. 22.50 లక్షల టోపీ



హోసూరు: గుర్తుతెలియని వ్యక్తులు చేసే కాల్స్, మెసేజ్‌లకు స్పందించి డబ్బులు చెల్లించి మోసపోవద్దు అని పోలీసులు ప్రచారం చేస్తున్నప్పటికీ ఫలితం లేదు. అమాయకులు వంచకుల వలలో చిక్కుతూనే ఉన్నారు. ఫోన్ చేసి నాలుగు మాటలు చెప్పగానే గుడ్డిగా నమ్మేసి సొమ్ములు పోగొట్టుకుని అయ్యో అంటున్నారు. క్రిష్ణగిరి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకొని రూ. 22.50 లక్షలు మోసపోయారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ అని

వివరాల మేరకు హోసూరు సమీపంలోని బాగలూరు ప్రాంతానికి చెందిన పూర్ణిమ (29) గత కొద్ది రోజుల క్రితం ఆమె సెల్‌ఫోన్‌కు ఆన్‌లైన్ ట్రేడ్ ద్వారా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చునని మెసేజ్ వచ్చింది. ఆమె రూ. 11.20 లక్షల డబ్బును వారి బ్యాంకు ఖాతాకు పంపి మోసపోయింది.

యూరో డాలర్ల పేరుతో..

హోసూరు కార్పొరేషన్ పరిధిలోని ఓంశక్తి నగర్ ప్రాంతానికి చెందిన సుందర్ రామ్‌కి (30) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. అతనికి ఫోన్ చేసిన ఓ మహిళ తన వద్ద 1000 యూరో డాలర్లున్నాయని, వాటిని ఇండియా కరెన్సీగా మార్చాలని, ప్రస్తుతం ఖర్చులకు గాను రూ.6 లక్షలు పంపాలని చెప్పింది. సరేనని రామ్‌కి రూ. 6 లక్షలు ఆమె ఖాతాలోకి జమ చేశాడు. ఆపై ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసింది.

పార్ట్ టైం ఉద్యోగం

క్రిష్ణగిరి సమీపంలోని గంగోజి కొత్తూరు గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ (28) బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో అతని సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌కు రూ. 5.37 లక్షలను మోసగాళ్లకు పంపించాడు. తరువాత ఉద్యోగం ఏదీ రాలేదు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదుల మేరకు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

ప్రభుత్వాసుపత్రికి అవార్డు

కెలమంగలం: రోగులకు ఉత్తమ సేవలందజేసిన కెలమంగలం ప్రభుత్వ ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం దక్కింది. బుధవారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణి చేతుల మీదుగా కెలమంగలం ఆస్పత్రి డాక్టర్ రాజేష్‌కుమార్ అవార్డును అందుకొన్నారు. కెలమంగలం యూనియన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఉత్తమ సేవలందజేస్తూ, గర్భిణీ మహిళలకు పెద్ద ఎత్తున సామూహిక సీమంతం తదితర కార్యక్రమాలను నిర్వహించడంతో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకొంది.

కుల గణన శాస్త్రీయంగా జరగాలని కోరుతున్నారు

శివాజీనగర: కుల గణనపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, అయితే కుల గణన సమీక్ష శాస్త్రీయంగా జరగాలని వివిధ సామాజిక వర్గాలు డిమాండ్ చేశాయని ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇంటి వద్ద బుధవారం విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆయన కాంతరాజ నివేదిక స్వీకారాన్ని వ్యతిరేకిస్తూ తాము చేసిన సంతకాన్ని డీ.కే.సమర్థించుకొన్నారు. తమ సముదాయపు నిర్ణయం వేరు, రాజకీయం వేరన్నారు. జనసంఖ్య ఆధారంగా రిజర్వేషన్ లభించాలని అనేక సామాజిక వర్గాలు డిమాండ్ చేశాయన్నారు. కొన్ని సముదాయాలు, వాటి నాయకులు కుల గణన సమీక్ష సమయంలో తమను సంప్రదించలేదన్నారు. అందువల్ల సమీక్షను శాస్త్రీయంగా చేయాలని కోరుతున్నామని తెలియజేశారు.

మంత్రి ఉదయనిధికి స్వాగతం


స్వాగతం పలుకుతున్న దృశ్యం

హోసూరు: క్రిష్ణగిరికి చేరుకొన్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ శరయు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. 22, 23వ తేదీల్లో జిల్లాలో జరుగనున్న పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్‌ఠాగూర్, అదనపు కలెక్టర్ వందనాగార్గ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలలో సీఎం స్టాలిన్ పాల్గొనాల్సి ఉండగా అనారోగ్య కారణాల వల్ల ఆయన రాలేకపోయారు.

మైదానంలో కలుపు తొలగింపు

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో పేరుకుపోయిన కలుపు మొక్కలను తొలగించారు. అధికారుల పర్యవేక్షణ లేక క్రీడా మైదానంలో కలుపు మొక్కలు పేరుకుపోయాయి. క్రీడా మైదానం గుంతలమయంగా మారిపోయింది. దీనిని బాగు చేయాలని పాఠశాల సిబ్బంది కోరడంతో యూనియన్ ఉప చైర్మన్ శ్రీనివాసన్ పిచ్చిమొక్కలు తొలగించి చదునుకు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తనం

సాక్షి, అమరావతి: కోస్తాంధ్ర తీరానికి ఆనుకుని బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం... ప్రస్తుతం ఆవర్తనంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. కోస్తా జిల్లాల్లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులు రాష్ట్రమంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే అండమాన్ సముద్రం, దాని పరిసరాల్లో ఈ నెల 25వ తేదీ నాటికి మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది 26వ తేదీకి అల్పపీడనంగా, 27వ తేదీకి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. దీంతోపాటు మరికొన్ని ఆవర్తనాలు, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడే అవకాశం ఉండడంతో డిసెంబర్ మొదటి వారం వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ జనవరి 22కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కృష్ణా జలాల పంపిణీకి అక్టోబర్ 6న కేంద్ర జల్ శక్తి శాఖ నిర్దేశించిన కొత్త విధి విధానాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అక్టోబర్ 16న రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఐఏ(ఇంటర్ లొకేటరీ అప్లికేషన్)పై కేడబ్ల్యూడీటీ-2(కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్) విచారణను జనవరి 22కు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఐఏపై బుధవారం జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ ఎస్.తాళపత్ర, జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి సభ్యులుగా ఏర్పాటైన కృష్ణా ట్రిబ్యునల్ విచారణ చేపట్టింది. కేంద్ర జల్ శక్తి శాఖ కొత్తగా జారీ చేసిన విధి విధానాలు చట్టవిరుద్ధమంటూ తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఈ నెల 29న సుప్రీంకోర్టు విచారణ జరుపుతుందని ఏపీ ప్రభుత్వ సీనియర్ కౌన్సిల్ జైదీప్ గుప్తా ట్రిబ్యునల్ దృష్టికి తెచ్చారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించే వరకూ తాము దాఖలు చేసిన ఐఏపై విచారణ చేపట్టవద్దని జైదీప్ గుప్తా కోరగా.. తెలంగాణ ప్రభుత్వ సీనియర్ కౌన్సిల్ సీఎస్ వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల వాదనలు విన్న ట్రిబ్యునల్.. ఈ అంశంపై ఆరు వారాల్లోగా స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు వివరాలు అందజేయాలని ఇరు రాష్ట్రాలను ఆదేశించింది.

జీవో 131పై కౌంటర్ వేయండి: హైకోర్టు

సాక్షి, అమరావతి: విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం తొట్లకొండ వద్ద గల బౌద్ధక్షేత్రం పరిధిని తగ్గిస్తూ ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో 131ను రద్దు చేయాలని కోరుతూ పర్యావరణవేత్త ఎల్.రాణిశర్మ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. తొట్లకొండ బౌద్ధక్షేత్రానికి చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి హైకోర్టుకు నివేదించారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సైతం ఆ ప్రాంతాన్ని ముఖ్యమైన ప్రాంతంగా ప్రకటించిందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. ఇదే అంశంపై ఇప్పటికే కొన్ని పిల్స్ దాఖలై ఉన్నాయన్నారు. 2021లో జీవో జారీ చేస్తే ఇప్పుడు పిల్ దాఖలు చేశారని తెలిపారు. జీవో 131ని రహస్య జీవోగా ఉంచలేదని, రహస్య జీవో అయితే ఆ జీవో కాపీని ఎలా కోర్టు ముందుంచగలుగుతారని ప్రశ్నించారు. 1976 నుంచి ఇప్పటివరకు 120 ఎకరాల్లోనే బౌద్ధక్షేత్రం ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ ప్రాంతాన్ని సందర్శించి, సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఏఎస్ఐను ఆదేశిస్తామన్నారు. దానికన్నా ముందు ఈ వ్యవహారంలో ప్రభుత్వ వాదన వింటామంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 20వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

కేంద్ర సహాయ పథకాలు రాష్ట్రంలో పటిష్టంగా అమలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తున్న పథకాలను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఏమైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించడానికి రాష్ట్ర స్థాయి 'దిశ' కమిటీని కూడా ఏర్పాటు చేశామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాష్ట్ర స్థాయి దిశ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి దిశ కమిటీ చైర్మన్‌గా ముఖ్యమంత్రి కొనసాగుతారని, అయితే సీఎం జగన్ తరఫున ఈ కమిటీకి అధ్యక్షత వహించి రాష్ట్రంలో కేంద్ర పథకాల అమలు తీరును సమీక్షించే అవకాశం తనకు కల్పించారని చెప్పారు. కమిటీ సభ్యులైన ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, బుర్రా మధుసూదన్ యాదవ్, మద్దాలి గిరిధరరావు తదితరులు పాల్గొని రాష్ట్రంలో కేంద్ర సహాయ పథకాల అమలు తీరును సమీక్షించారు.

రూ.61,127 కోట్ల పెట్టుబడులు రాక

28 నెలల్లో 108 యూనిట్లలో మొదలైన వాణిజ్య ఉత్పత్తి

- కొత్తగా రూ.32,697 కోట్ల ఒప్పందాలు.. ముందుకొచ్చిన 121 సంస్థలు
- ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో రూ.7,187 కోట్ల కొత్త పెట్టుబడుల ఒప్పందాలు
- ఉత్పత్తి ప్రారంభించిన రూ.5560 కోట్ల విలువైన యూనిట్లు
- డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తేవడంతోపాటు కొత్తగా ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రపథంలో దూసుకెళుతోంది. పారిశ్రామికంగా ఇప్పటికే అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతూ ఏపీ భారీగా పెట్టుబడులను ఆకర్షించినట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజా గణాంకాలు వెల్లడించాయి. 2021 నుంచి 2023 ఏప్రిల్ వరకు 28 నెలల్లో రాష్ట్రంలో 108 యూనిట్లు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా రూ.61,127 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చినట్లు డీపీఐఐటీ విడుదల చేసిన ఇండస్ట్రియల్ ఎంటర్‌ప్రెన్యూర్ మెమోరాండం-ఇంప్లిమెంటేషన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2022లో కొత్తగా 46 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా రూ.45,217 కోట్ల పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తెచ్చి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 15 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించడం ద్వారా రూ.5,560 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సులో కుదిరిన రూ.13.11 లక్షల కోట్ల ఒప్పందాలను వేగంగా వాస్తవ రూపంలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తూ అనుమతులు మంజూరు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ 'సాక్షి'కి వివరించారు. జీఐఎస్ ఒప్పందాల్లో రూ.1,35,362 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 111 యూనిట్లు ఆరు నెలల్లోనే అమలులోకి వచ్చాయని, డీపీఐఐటీ విడుదల చేసే తదుపరి గణాంకాల్లో ఇవి ప్రతిబింబిస్తాయని అధికారులు తెలిపారు.

జోరుగా పార్ట్ ఏ దరఖాస్తులు

గత 28 నెలల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా రూ.32,697 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు 121 సంస్థలు 'ఐఈఎం పార్ట్ ఏ' సమర్పించినట్లు డీపీఐఐటీ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వంతో పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకుని డీపీఆర్ ఆమోదం, భూ కేటాయింపులు పూర్తై నిర్మాణ పనులు ప్రారంభించే యూనిట్లు పార్ట్ ఏ డీపీఐఐటీకి దరఖాస్తు చేస్తాయి. జీఐఎస్ ఒప్పందాల్లో రూ.3.06 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు భూ కేటాయింపు దశల్లో ఉండగా ఇవి కూడా త్వరలో పార్ట్ ఏకు దరఖాస్తు చేసుకోనున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు కొత్తగా రూ.7,187 కోట్ల విలువైన 20 ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నట్లు పార్ట్ ఏ సమర్పించాయి. ఈ పెట్టుబడుల ప్రతిపాదనల వల్ల లక్షలాది మందికి ఉపాధి లభించనుందని అధికారులు తెలిపారు.

'జగనన్న గోరుముద్ద'కు జాతీయ పురస్కారం



డాక్టర్ జోయా అలీ రిజ్వీ నుంచి అవార్డును అందుకుంటున్న రాష్ట్ర అధికారులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు 'జగనన్న గోరుముద్ద' పేరిట పౌష్టికాహారం అందిస్తున్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కౌమార దశ విద్యార్థుల్లో రక్తహీనత నివారణ కోసం చేస్తున్న విశేష సేవలకు జాతీయస్థాయి ప్రథమ బహుమతిని ఏపీకి అందజేసింది. అవార్డును స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జోయా అలీ రిజ్వీ చేతుల మీదుగా బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఏపీ పాఠశాల విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ పి.హేమారాణి, ఆరోగ్య శాఖ నోడల్ అధికారి దేవి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ ఎస్.శ్రీదేవి అందుకున్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించేందుకు రాగి జావ, కోడిగుడ్డు, చిక్కీ వంటి పోషకాహారం అందించి పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యంగా ఉందని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ కితాబిచ్చింది. దేశంలో ఇదో అద్భుతమైన కార్యక్రమంగా ప్రకటించింది. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ, ఉడికించిన గుడ్లు పంపిణీ, ఎముకల బలాన్ని పెంచేందుకు చిక్కీ (వేరుశనగ బార్) పంపిణీ చేస్తూ విద్యార్థులందరికీ శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రాథమిక లక్ష్యంగా గోరుముద్ద కొనసాగుతోందని కేంద్ర అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం లోపం తగ్గడంతో పాటు రక్తహీనత సైతం చాలా వరకు నివారించారని కితాబిచ్చింది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం కోసం జగనన్న గోరుముద్ద పథకంలో రోజుకో మెనూ చొప్పున స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించిన విషయం తెలిసిందే.

పేదరిక నిర్మూలనలో ఆదర్శంగా ఏపీ

పొదుపు సంఘాల పునరుజ్జీవం.. మహిళా సాధికారతలో ముందంజ

- ఏపీలో సంఘాల పనితీరు బాగుందని గుజరాత్ బృందం ప్రశంసలు
- మహిళలు స్థిరమైన శాశ్వత ఆదాయాలు పెంచుకోవడంపై బృందం పరిశీలన
- మూడేళ్లలో రాష్ట్రంలో 16 లక్షల మందికి శాశ్వత జీవనోపాధులు
- ఆర్నెళ్లలో పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన 13 వేల మంది పేద మహిళలు
- బాబు రుణమాఫీ హామీతో కుప్పకూలిన వ్యవస్థకు ప్రాణం పోసిన సీఎం జగన్


ప్రకాశం జిల్లా మద్దిపాడులో పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడుతున్న గుజరాత్ ప్రతినిధుల బృందం

సాక్షి, అమరావతి: పొదుపు సంఘాల పునరుజ్జీవ, మహిళా సాధికారత ద్వారా పేదరిక నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని గుజరాత్ ఉన్నతాధికారుల బృందం ప్రశంసించింది. పొదుపు సంఘాల ద్వారా పేదరిక నిర్మూలనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ కార్యక్రమాలను పరిశీలించి గుజరాత్‌లో అమలు చేసేందుకు వచ్చిన అధికారుల బృందం రెండు రోజులు ఏపీలో పర్యటించింది. ఐఏఎస్ అధికారి పుష్పలత ఆధ్వర్యంలో గుజరాత్ జీవనోపాధుల ప్రమోషన్ కంపెనీ (జీఎల్‌పీసీ) ప్రతినిధుల బృందం విజయవాడలో సెర్ప్, ఎస్బీఐ, కెనరా బ్యాంకు అధికారులతో సమావేశమై పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు, సభ్యులు వినియోగించుకుంటున్న తీరు, రుణాలు సకాలంలో చెల్లింపులు తదితర అంశాలపై వివరాలను తెలుసుకుంది. పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని బ్యాంకర్ల సమావేశంలో ప్రస్తావించడం, ప్రాసెసింగ్ చార్జీల మినహాయింపు, జగనన్న మహిళా మార్టుల ఏర్పాటుతో వ్యాపారాల్లో మహిళలు రాణించేలా ప్రోత్సహించడం తదితర అంశాలను అధికారులు బృందానికి వివరించారు. గుజరాత్ అధికారుల బృందం బుధవారం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలో పర్యటించి స్థానిక పొదుపు సంఘాల మహిళలను కలుసుకుంది. పొదుపు సంఘాల ద్వారా మహిళలు తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకున్న తీరును అడిగి తెలుసుకుంది.

శాశ్వత ఆదాయాలను పొందేలా

పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలిచి శాశ్వత స్థిర ఆదాయాలను సమకూర్చుకునేలా వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత లాంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా పథకాల ద్వారా మహిళలకు అందజేసే మొత్తాలను జీవనోపాధులలో పెట్టుబడులుగా పెట్టుకొనేలా అంతర్జాతీయ వ్యాపార దిగ్గజ సంస్థలు హిందూస్తాన్ లీవర్, ప్రోక్టర్ అండ్ గ్యాంబల్, ఐటీసీ, రిలయెన్స్ అజియో తదితర సంస్థలతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఒప్పందం చేసుకుంది. మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలతో అదనంగా తోడ్పాటు అందించే ప్రక్రియ కూడా చేపట్టింది.

వ్యాపారాల్లో విజయ పతాకం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా గత మూడేళ్లలో ఏకంగా 16 లక్షల మంది పేద మహిళలు వివిధ రకాల వ్యాపారాలు, ఇతర శాశ్వత జీవనోపాధులు ఏర్పాటు చేసుకొని ఇప్పటికే ప్రతి నెలా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు. మహిళా మార్టులు లాంటివి నెలకొల్పి విజయవంతంగా వ్యాపారాల్లో రాణిస్తున్నారు. పొదుపు సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బ్యాంకుల నుంచి వ్యక్తిగత రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని కూడ ప్రభుత్వం చేపట్టింది. గత ఆర్నెళ్లలో కొత్తగా 13 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలుగా సత్తా చాటారు. మన పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న అప్పుల్లో 99.67 శాతం సకాలంలో బ్యాంకులకు చెల్లిస్తూ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా ఏపీ అమలు చేస్తున్న ఈ తరహా జీవనోపాధులు, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను గుజరాత్ అధికారుల బృందం ప్రత్యేకంగా పరిశీలించింది.

నాలుగున్నరేళ్లలో కీలక మార్పులు..

2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అనంతరం మహిళలను మోసగించడంతో పొదుపు సంఘాలు అప్పుల్లో కూరుకుపోయి ఎన్‌పీఏలుగా మారిపోయాయి. నాలుగో వంతుకు పైగా సంఘాలు బ్యాంకుల వద్ద నిరర్థక ఆస్తులుగా మిగిలాయి. దీంతో అంతకు ముందు ఏ గ్రేడ్‌లో ఉన్న పొదుపు సంఘాలు అత్యధికం సీ, డీ గ్రేడ్‌లోకి వెళ్లాయి. గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదన్న విషయాన్ని నాటి మంత్రి పరిటాల సునీత స్వయంగా అసెంబ్లీలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాట ప్రకారం 2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తాన్ని నాలుగు విడతల్లో నేరుగా ఆయా మహిళలకు చెల్లించేలా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేయడంతోపాటు చంద్రబాబు సర్కారు మంగళం పాడిన సున్నా వడ్డీని పునరుద్ధరించడంతో పొదుపు సంఘాలు కోలుకున్నాయి. గత నాలుగున్నరేళ్లుగా పొదుపు సంఘాలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇప్పించడం, సకాలంలో సున్నా వడ్డీ చెల్లింపులతో రాష్ట్రంలో పొదుపు సంఘాల వ్యవస్థ బలం పుంజుకుంది.

మహిళా మార్టు సందర్శన

మద్దిపాడు/సింగరాయకొండ: ఏపీలో పొదుపు సంఘాల పనితీరు బాగుందని గుజరాత్ అధికారుల బృందం అభినందించింది. ప్రకాశం జిల్లాలోని మద్దిపాడు, ఇనమనమెళ్లూరు, సింగరాయకొండలో బృందం బుధవారం పర్యటించింది. మద్దిపాడులోని జగనన్న చేయూత మహిళా మార్ట్, ఇనమనమెళ్లూరులో పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన తేనె పరిశ్రమ, సింగరాయకొండ మండలం కనుమళ్ల పంచాయతీలో బాతు హేచరీలను పరిశీలించిన బృందం సభ్యులు పొదుపు సంఘాల మహిళలను ప్రశంసించారు. ఇనమనమెళ్లూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో జాబ్‌చార్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొదుపు సంఘాల పనితీరు అద్భుతంగా ఉందని, ఇలాంటి విధానాలు గుజరాత్‌లో అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు పుష్పలత తెలిపారు.

కొల్లగొట్టి పాటి!

ఉమ్మడి ప్రకాశంలో క్వారీలు మింగేసిన గొట్టిపాటి

సాక్షి, అమరావతి /బాపట్ల: సహజ వనరులను కొల్లగొట్టిన ఓ ఘనాపాటికి పేదల భూములు అప్పనంగా మింగేసిన ఓ పెద్దమనిషి వత్తాసు పలుకుతున్నారు! గురివింద సామెతను విస్మరించి రాబందుల రాజ్యహింస అంటూ శివాలెత్తిపోయారు! ఉమ్మడి ప్రకాశం జిల్లాలో యథేచ్ఛగా గనుల విధ్వంసానికి పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఉత్తముడంటూ ఈనాడు రామోజీ కీర్తిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన గొట్టిపాటి గత చరిత్రను దాచేందుకు రామోజీ తంటాలు పడ్డా ప్రజలు మరచిపోరు కదా!!



ప్రలోభాలతో ఫిరాయించి అక్రమాలు..

2014లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన గొట్టిపాటి రవికుమార్ ఆ తరువాత టీడీపీలో ఎందుకు చేరారనే వాస్తవాన్ని రామోజీ కావాలనే కప్పిపుచ్చారు. నాటి సీఎం చంద్రబాబు ప్రలోభాలకు గురి చేయడంతో పార్టీ ఫిరాయించిన గొట్టిపాటి అనంతరం టీడీపీ సర్కారు అండతో యథేచ్ఛగా గనులను కొల్లగొట్టారు. క్వారీల అనుమతులు రద్దు కాకుండా లోకేశ్‌కు భారీ మొత్తంలో కప్పం చెల్లించారు.

విఫలయత్నాలు..

2019 ఎన్నికల్లో గొట్టిపాటి రవి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఈదఫా వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడంతో మళ్లీ పార్టీ ఫిరాయించేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరతానంటూ పలువురి ద్వారా రాయబారాలు పంపిన గొట్టిపాటి కొంతకాలం టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఆయన కప్పదాటు వైఖరి తేటతెల్లం కావడంతో అధికార పార్టీ అందుకు అంగీకరించలేదు. దాదాపు రెండేళ్లపాటు ఎడతెగని ప్రయత్నాలు చేసిన గొట్టిపాటి ఇక లాభం లేదని మిన్నకుండిపోయారు. ఈనాడు రామోజీ దీన్ని వక్రీకరిస్తూ గొట్టిపాటి వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ఒప్పుకోకపోవడంతోనే కేసులు నమోదు చేశారంటూ కట్టుకథలు అల్లేశారు. గనుల అక్రమ తవ్వకాలపై విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించింది. శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, నెల్లూరు తదితర జిల్లాల్లో కూడా తనిఖీలు జరిపి అక్రమాలపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసింది.

తనిఖీల తరువాతే కేసులు

- ▲ బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొనిదిన గ్రామం వద్ద కిషోర్‌స్లాబ్ అండ్ టైల్స్ పేరుతో గొట్టిపాటికి 6.4 హెక్టార్లలో గ్రానైట్ క్వారీ ఉంది. 2019 నవంబరు 23న తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం 42,676 క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను పర్మిట్లు లేకుండా అక్రమంగా అమ్మేసినట్లు నిర్ధారించింది. దీంతో నిబంధనల ప్రకారం రూ.87.45 కోట్లు జరిమానా విధించింది.
- ▲ బల్లికురవ మండలం కొనిదిన పరిధిలో అంకమచౌదరి పేరుతో సర్వే నంబర్ 103లో నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో క్వారీ ఉంది. అందులో 43,865 క్యూబిక్ మీటర్ల రాయిని అక్రమంగా తరలించినట్లు తేలడంతో రూ. 54. 23 కోట్లు జరిమానా విధించారు.
- ▲ బల్లికురవ మండలం కొనిదిన పరిధిలోనే కిషోర్ గ్రానైట్స్ పేరిట 0.093 హెక్టార్లలో ఉన్న క్వారీలో 42,056 క్యూబిక్ మీటర్ల మేర అక్రమంగా తవ్వేసి తరలించడంతో రూ.87.30 కోట్లు జరిమానా విధించారు.
- ▲ సంతమాగులూరు మండలం గురిజేపల్లివద్ద కిషోర్ గ్రానైట్స్ పేరిట గొట్టిపాటికి 4.10 హెక్టార్లలో క్వారీ ఉంది. అందులో 19,752 క్యూబిక్ మీటర్ల మేర గ్రానైట్‌ను అక్రమంగా తవ్వి తరలించడంతో రూ.45.68 కోట్లు జరిమానా విధించారు. గొట్టిపాటి జరిమానా చెల్లించకపోవడంతో నిబంధనలను అనుసరించి క్వారీ అనుమతి రద్దు చేశారు. పన్నులు చెల్లించకపోవడంతో మరో 30 క్వారీల యజమానులకు కూడా గనుల శాఖ నోటీసులు జారీ చేసింది. వీటిని కప్పిపుచ్చుతూ కేవలం గొట్టిపాటినే వేధిస్తున్నారంటూ ఈనాడు దుష్ప్రచారానికి దిగింది.

చట్ట ప్రకారమే జరిమానాలు

మైనింగ్ నిబంధనలు ఉల్లంఘించిన గొట్టిపాటి రవికుమార్‌కు చట్ట ప్రకారమే జరిమానా విధించామని, దాన్ని వక్రీకరిస్తూ రాబందుల రాజ్యహింస అంటూ ఈనాడు పచ్చి అబద్ధాలతో కథనం ప్రచురించిందని మైనింగ్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గనుల శాఖకు, ప్రభుత్వానికి రాజకీయ దురుద్దేశాలను ఆపాదించటాన్ని ఖండించారు. క్వారీలను తనిఖీ చేయడం, ఉల్లంఘనలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం గనుల శాఖ విధుల్లో భాగమన్నారు. లీజుదారుల రాజకీయ ప్రాధాన్యతలతో తమకు సంబంధం ఉండదన్నారు. 2019లో గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని గ్రానైట్ క్వారీలపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన పలు క్వారీలకు జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేశామన్నారు. గొట్టిపాటి రవికుమార్‌కు చెందిన 11 క్వారీల్లో మేనేజర్లు, సిబ్బంది సమక్షంలోనే తనిఖీలు జరిగినట్లు తెలిపారు. రూ.45 కోట్ల మేర ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించి చట్ట ప్రకారం ఐదు రెట్లు అధికంగా రూ.270 కోట్లు జరిమానా విధించినట్లు తెలిపారు. ఇందులో కక్ష సాధింపులకు ఆస్కారం లేదన్నారు. గొట్టిపాటి రివిజన్‌కు అప్పీలు చేసుకోలేదన్నారు. దీనిపై సుప్రీం కోర్టు ఆదేశాలు గనుల శాఖ పరిశీలనలో ఉన్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలోని 240 క్వారీల నుంచి గనుల శాఖకు ఏటా రూ.400 కోట్ల మేర రెవెన్యూ వస్తోందన్నారు. ఒక్క గొట్టిపాటి క్వారీలపై చర్యలు తీసుకోవడం వల్ల ఏటా రూ.100 కోట్ల రెవెన్యూను ప్రభుత్వం నష్టపోయినట్లు ఈనాడు ఏ లెక్కల ఆధారంగా రాసిందో చెప్పాలన్నారు. తప్పుడు కథనాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

–మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి

ప్రభుత్వ బడుల్లో విదేశీ భాషలు

- 1000 సీబీఎస్ఈ పాఠశాలల్లో ఐచ్ఛికంగా ఫారిన్ లాంగ్వేజెస్
- జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్, జపనీస్, మాండరిన్, కొరియన్ భాషలు అందించే యోచన
- ఇఫ్లూ ప్రొఫెసర్లతో ఉపాధ్యాయులకు శిక్షణ
- ప్రణాళికను సిద్ధం చేస్తున్న పాఠశాల విద్యాశాఖ



ఇఫ్లూ ప్రొఫెసర్లతో సురేష్‌కుమార్ బృందం

సాక్షి, అమరావతి: పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించేందుకు.. విదేశాల్లో సైతం విజయవంతమైన కెరీర్‌ను అందుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విదేశీ భాషలను అందుబాటులోకి తేనుంది. తొలుత సీబీఎస్ఈ బోధన అందిస్తున్న వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో ఫారిన్ లాంగ్వేజెస్ (విదేశీ భాషలు) ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ నేతృత్వంలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి, అసెస్‌మెంట్ ఇన్‌చార్జి సతీష్, కరిక్యులమ్ ఇన్‌చార్జి కేశవరెడ్డితో కూడిన బృందం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)లో పర్యటించి వైస్ చాన్సలర్ సురేష్‌కుమార్‌తో పాటు ప్రొఫెసర్లు శ్రీవాణి, జయరాజు, శాంసన్‌తో చర్చలు జరిపారు. విదేశాలలో ఉపాధి కోసం వెళ్లే యువతకు వారి వృత్తిలో ప్రగతికి సంబంధించి విదేశీ భాషా నైపుణ్యాలను నేర్పించే అవకాశాలపైనా ఈ బృందం చర్చించింది. పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించగల భాషలపై అక్కడి ప్రొఫెసర్లను అడిగి తెలుసుకుంది. ఇందులో ప్రధానంగా జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్, జపనీస్, మాండరిన్, కొరియన్ భాషలకు డిమాండ్ అధికంగా ఉంది. ఆయా భాషలు విద్యార్థులకు అనువైనవిగా గుర్తించారు. తొలిదశలో ఈ భాషలను రాష్ట్ర ప్రభుత్వ సీబీఎస్ఈ పాఠశాలల్లో అమల్లోకి తెచ్చి, తదనంతర కాలంలో మరికొన్ని విదేశీ భాషలను సైతం అందుబాటులోకి తీసుకు రావాలని విద్యాశాఖ అధికారులు యోచిస్తున్నారు. వీటిని ఐచ్ఛికంగా అమలు చేయాలని నిర్ణయించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ


విద్యార్థి దశ నుంచే విదేశీ భాషలు నేర్పితే గ్రాడ్యుయేషన్ తర్వాత విదేశాల్లో మెరుగైన ఉద్యోగాలు సాధించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విదేశీ భాషలను ప్రవేశపెట్టేందుకు తొలుత ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ ట్రైనింగ్ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. అందుకు ఇఫ్లూ సహకారం తీసుకోవాలని నిర్ణయించి.. ఈ భాషల్లో శిక్షణ ఇచ్చే ప్రణాళిక అమలుపై ఇఫ్లూ బృందంతో చర్చించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలలో విదేశీ భాషల అధ్యయన సెంటర్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. వీటిద్వారా విదేశాలకు వెళ్లే యువతకు ఆయా భాషలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విదేశీ భాషల అధ్యయనానికి అభ్యర్థికి ఎంత సమయం అవసరం, లాంగ్వేజ్ ల్యాబ్స్, శిక్షణ ఇచ్చే మెంటార్ల లభ్యత తదితర అంశాలను సైతం పరిశీలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందించే లక్ష్యంతో ఉండటంతో అందుకు అనుగుణంగా సాధ్యమైనంత తక్కువ సమయంలోనే ఫారిన్ లాంగ్వేజెస్ బోధన, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో శిక్షణను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

✻ సందర్భం

గతంలో ఎం.ఎల్.ఏ అయిన ఒక పెద్ద హీరో స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడి అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చాడు. డెబ్బయి ఏళ్లు దాటిన ఒక సీనియర్ నటుడు నోరు పారేసుకుని పరువు పోగొట్టుకున్నాడు. పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న మరో నటుడు స్త్రీల దుస్తుల గురించి సుద్దులు చెప్పి నిరసన ఎదుర్కొన్నాడు. ఇప్పుడు తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్. సెలబ్రిటీలుగా ఉన్నవారు ఎంతో బాధ్యతగా ఉండి యువతకు మార్గం చూపేలా ఉండాలి. వారు ఇలా తగలడితే స్త్రీలతో ఎలా వ్యవహరించాలో ఇంటినే బడిగా మార్చి తల్లిదండ్రులు నేర్పించాల్సి ఉంటుంది. అయితే ఇంటి ఆడవారికి తండ్రి, భర్త గౌరవం ఇచ్చి మాట్లాడుతున్నారా అనేది ప్రశ్న.

మగవారూ... భాష జాగ్రత్త


త్రిష


మన్సూర్ అలీఖాన్

అతడో ప్రసిద్ధ నటుడు. 'మా బ్లడ్డు వేరు మా బ్రీడు వేరు' అంటుంటాడు. కాని ఒక సభలో అభిమానులను చూసి పూనకం వచ్చి స్త్రీల గురించి అశ్లీలమైన వ్యాఖ్యలు చేశాడు. వందల సినిమాల్లో తండ్రిగానో బాబాయిగానో వేసిన ఒక నటుడు 'స్త్రీల మీద మీ అభిప్రాయం ఏమిటి?' అని సభలో యాంకర్ అడిగితే పరమ రోతగా సమాధానం ఇచ్చాడు. ఇక నటుడుగా, రియల్టర్‌గా గుర్తింపు పొందిన మరో పెద్ద మనిషి పార్లమెంట్ మెంబర్ అయ్యాక పార్లమెంట్‌లో నిలబడి మరీ 'స్త్రీల దుస్తుల వల్లే వారికి సమస్యలు వస్తున్నాయి' అన్నాడు.

స్త్రీలను ఏదో ఒకటి అనేయొచ్చు. అంటే వాళ్లు పడతారు, అనడానికే మేము పుట్టాము అనే చులకనభావం పురుష సమాజంలో నరనరాన జీర్ణించుకుని పోబట్టే ఈ ప్రతిఫలాలు. అదృష్టవశాత్తు ఇలాంటి వ్యాఖ్యలకు వెంటనే నిరసన పెల్లుబుకుతున్నా పురుషుల నోటి దురుసు తగ్గడం లేదు. తాజాగా తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ ఇటీవల త్రిషతో 'లియో' సినిమాలో నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ 'ఆమె హీరోయిన్ అని తెలిశాక (గత సినిమాల్లో తాను చేసిన) బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని ఆశపడ్డాను' అని వ్యాఖ్యానించాడు. 'ఇది సినిమా లాంగ్వేజ్' అని మన్సూర్ అనుకుని ఉండొచ్చుగాని దానిలోని అశ్లీల ధ్వనికి త్రిష రియాక్ట్ అయ్యింది. 'ఇతనితో ఇంకెప్పుడూ సినిమాల్లో నటించను' అని చెప్పింది. ఆ తర్వాత చినికి చినికి గాలివానై ఇప్పుడు మన్సూర్ మీద కేసు బుక్ అయ్యేంతగా వెళ్లింది. మగవాళ్లు 'సరదాగా మాట్లాడుతున్నామని' అనుకుంటూ కూడా స్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తారు. సరదాగా కించపరచడం ఏమిటో... కించపరచడం ఎలాంటి సరదానో వీరే చెప్పాలి.

ప్రసిద్ధులే దారి తప్పితే

రాజకీయ నేతలు, సినిమా నటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు... ఇలా సమాజంలో గుర్తింపు పొందినవారు స్త్రీల పట్ల మరింత గౌరవంతో మెలగుతూ ఆదర్శంగా నిలవాలి. కాని చాలాసార్లు రాజకీయ నాయకుల దగ్గరి నుంచి అన్ని రకాల ప్రముఖులు ఏదో ఒక సందర్భంలో చులకన మాటలు మాట్లాడుతూ కుసంస్కారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాదిలో మంత్రులు 'మేం వేసిన రోడ్లు ఫలానా హీరోయిన్ బుగ్గల్లా ఉంటాయి' అంటూ వదరుతుంటారు. సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమాలో కుస్తీ వీరుడిగా నటించి 'ఈ సినిమాలో కుస్తీలు చేస్తే రేప్ జరిగినంత పనయ్యింది నాకు' అని వ్యాఖ్యానించి మొట్టికాయలు తిన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక మాజీ మంత్రి ప్రస్తుత మంత్రిగా ఉన్న నటిపై దారుణమైన వ్యాఖ్యలు చేసి కోర్టు కేసును ఎదుర్కొనబోతున్నాడు.

బాల్యం నుంచి భావజాల ప్రభావం

'కుటుంబంలో తండ్రి (మగాడు) ముఖ్యం' అనే భావన బాల్యం నుంచి పిల్లల్లో ఎక్కించడం ద్వారా పురుష సమాజం తన ఆధిక్యతను స్త్రీలపై ఆధిపత్యాన్ని కొనసాగించేలా చేస్తుంది. తండ్రిని 'మీరు' అని, తల్లిని 'నువ్వు' అని అనడంలో ప్రేమ, గౌరవం, దగ్గరితనం ఉన్నా 'నువ్వు' అనడం వల్ల 'లెక్క చేయవలసిన పని లేదు' అనే భావన కలిగితే కష్టం. తిట్లు, బూతులు అన్నీ స్త్రీలను అవమానించేవే. వాటిని విని, పలికి స్త్రీల పట్ల అలా మాట్లాడవచ్చు అనుకుంటారు మగవారు. ఇంట్లో చెల్లెని, అక్కని, తల్లిని తండ్రి అదుపు చేసే తీరు చూసి, తామూ బయట స్త్రీలను అలాగే అదుపు చేయవచ్చనుకుంటారు. ఫైటర్ జెట్స్‌ను స్త్రీలు నడుపుతున్న ఈ కాలంలో కూడా 'మేమేమీ గాజులు తొడుక్కోలేదు', 'మూతి మీద మీసముంటే రా'లాంటి పౌరుష వచనాలను పురుషులు ఇంకా పలికేటంత వెనుకబాటుతనంలో ఉండటం విషాదకరం. శారీరక పరిమితులు ఉన్నంత మాత్రాన స్త్రీలు బలహీనులు, పురుషులు బలవంతులు కాబోరు.

తల్లిదండ్రులూ జాగ్రత్త

అబ్బాయిలను ఆడపిల్లలను గౌరవించేలా పెంచడం, టీనేజ్‌లో ఉన్న అబ్బాయిలకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వడం ఇప్పటి తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. చట్టాలు పకడ్బందీగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలిసో తెలియకో అహంకారంతోనో పరుష వ్యాఖ్య, అసభ్య చేష్ట నేరుగా కాని సోషల్ మీడియాలోగాని చేస్తే వారు ప్రమాదంలో పడతారని హెచ్చరించాలి. చైతన్యం పెరిగింది. అబ్బాయిలూ భాష జాగ్రత్త.

న్యూస్ మేకర్

ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు ఓటమి చెందిన బాధలో ఆమె పెద్దగా ఎవరికంటా పడలేదుగానీ... ఆ తరువాత మాత్రం 'ఎవరీ అమ్మాయి?' అనుకున్నారు చాలామంది. గెలుపు తరువాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు పక్కన ప్రముఖంగా కనిపించిన ఆ అమ్మాయి పేరు... ఊర్మిళా రోసారియో. ఎవరీ ఊర్మిళ?

అవును... మన అమ్మాయే!



ఊర్మిళా రోసారియో ఆస్ట్రేలియన్ క్రికెట్ టీమ్ మేనేజర్. ఆమె తల్లిదండ్రులు ఐవీ, వాలెంటైన్ రోసారియోలది కర్ణాటకలోని మంగళూరుకు సమీపంలోని కిన్నిగోలి ప్రాంతం. ఐవీ, వాలంటైన్‌లు ఖతార్‌లోని దోహాలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఊర్మిళ జన్మించింది.

ఊర్మిళకు చిన్నప్పటి నుంచి ఆటలు అంటే చాలా ఇష్టం. స్కూలు రోజుల్లో క్రికెట్ కంటే బాస్కెట్‌బాల్, టెన్నిస్ బాగా ఆడేది. బంగీ జంపింగ్ అంటే ఇష్టం. ఖతార్ టెన్నిస్ ఫెడరేషన్‌లో మూడు సంవత్సరాలు పనిచేసింది.

కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో బీబీఏ చేసిన ఊర్మిళ ఆ తరువాత ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా పనిచేసింది. ఒక నాన్–ఆస్ట్రేలియన్‌కు టీమ్ మేనేజర్ బాధ్యతలు అప్పగించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నేపథ్యంలో క్రికెట్ నుంచి కొన్ని నెలల పాటు విరామం తీసుకొని ఖతార్‌లో ఫుట్‌బాల్ స్టేడియం నిర్వాహణ బాధ్యతలు చూసుకుంది.

ఆ తరువాత మళ్లీ ఆస్ట్రేలియాకు వచ్చింది.

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఊర్మిళ పనితీరు, హిందీ, కన్నడ, కొంకణి... మొదలైన భారతీయ భాషలలో నైపుణ్యం వరల్డ్‌కప్ టూర్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఎంపిక చేయడానికి కారణం అయింది.

ఏడు సంవత్సరాల క్రితం ఊర్మిళ తల్లిదండ్రులు దోహా నుంచి మన దేశానికి వచ్చారు. కాఫీ ఎస్టేట్ కొనుగోలు చేసి కర్ణాటకలోని సకలేష్‌పూర్‌లో స్థిరపడ్డారు.

'క్రికెట్‌తో ఒకప్పుడు నాకు పెద్దగా పరిచయం లేదు. అలాంటి నాకు క్రికెట్‌తో ఇంత అనుబంధం ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది' అని నవ్వుతూ అంటుంది ఊర్మిల.

నవ్వడం సరే,
క్రికెట్ టీమ్ మేనేజర్ అంటే మాటలా?

ఒక్కమాటలో చెప్పాలంటే...
'రెస్పాన్సిబుల్ ఫర్ ఎవ్రీథింగ్'
దీనిలో వందకు వంద మార్కులు కొట్టేసింది ఊర్మిళ.

ఊర్మిళ గత మార్చిలో తల్లిదండ్రులను చూడడానికి మనదేశానికి వచ్చింది. ఊర్మిళ ఇక్కడ ఉంటే కాఫీ ఎస్టేట్‌లో చిన్న చిన్న పనులు కూడా చేస్తుంది. ఆమె పక్కన ఉంటే తల్లిదండ్రులకు పండగే. కూతురి ఉన్నతి గురించి పెద్దగా మాట్లాడకపోయినా 'ఫైనల్ మ్యాచ్ చూడడానికి అహ్మదాబాద్‌కు వెళ్లాలనుకున్నాం. దురదృష్టవశాత్తు మా ఎస్టేట్ దాటి వెళ్లలేకపోయాం' అంటున్నారు ఊర్మిళ తల్లిదండ్రులు.

ఫైనల్ మ్యాచ్ మిస్ అయితే ఏమిటి?
ఏదో ఒకరోజు కాఫీ ఎస్టేట్‌కు ఊర్మిళ వస్తుంది కదా!
ఆ మ్యాచ్‌ను కళ్లకు కడుతుంది కదా! ఇక దిగులెందుకు!!


తల్లిదండ్రులతో ఊర్మిళ


వన్స్ అపాన్ ఏ టైమ్... కుటుంబ సభ్యులతో... (కింది వరసలో మధ్యలో)

ఈ వెడ్డూరం చూశారా!

వెడ్డింగ్ విత్ టికెట్!

కొంతమంది ఎంతోఘనంగా జరుపుకునే తమ పెళ్లి వేడుకల వీడియోలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించడం ఇప్పటి ట్రెండ్‌గా మారింది. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు తమ పెళ్లి వీడియోలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలానే సెలబ్రిటీ హోదాలేని వారు సైతం విదేశీయులకు పెళ్లి టికెట్లు అమ్మి వెడ్డింగ్ పర్యాటకానికి తలుపులు తెరుస్తున్నారు.

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే చాలా మంది విదేశీయులు ఇక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. విదేశాలతో పోలిస్తే ఇండియాలో ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ పెళ్లిళ్లను చూసేందుకు విదేశీయులు చాలా ఉత్సాహం చూపుతారు. పెళ్లి సంప్రదాయాలు, రకరకాల రుచికరమైన వంటకాలను టేస్ట్ చేసేందుకు తహ తహలాడుతుంటారు. అందుకే ఏ మాత్రం అవకాశం చిక్కినా వెంటనే వచ్చి ఇండియాలో వాలిపోతుంటారు. ఇందుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఈ అభిరుచినే మన భారతీయ జంటలు, వెడ్డింగ్ ప్లానర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వెబ్ సైట్లు నడుపుతున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్‌ను టికెట్‌గా చూపిస్తూ నిశ్చితార్థం నుంచి, మెహందీ, సంగీత్, హల్దీ ఇలా ఒక్కో వేడుకకి ఒక్కో రేటుని చెబుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.



జాయిన్ మై వెడ్డింగ్...

పెళ్లి చేసుకునే జంట సొంతంగా జాయిన్ మై వెడ్డింగ్ పేరుతో అకౌంట్‌ను క్రియేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరి ఫోటోలు, పెళ్లి తేదీ, ఎన్నిరోజులు వేడుకలు జరుగుతాయి.. ఏ రోజు ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు... వంటి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. పెళ్లిలో పెట్టే భోజనం వెజ్, నాన్‌వెజ్, మందు, చిందు ఉంటే అదీ చెబుతారు. ఇవేగాక డ్రెస్ కోడ్, అక్కడ మాట్లాడే భాష, వేడుక జరిగే ప్రదేశం అడ్రెస్‌తోపాటు ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను ఇస్తారు. విదేశీ పర్యటనలో ఉన్న వారికి ఈ పెళ్లి తేదీలు జత కుదిరితే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చేసి మరీ పెళ్లి బ్యాండ్ బాజా, బారాత్‌లను ఎంజాయ్ చేస్తున్నారు.

ఒక్కరోజుకి పన్నెండు వేలపైనే...

ఎంతో ఆడంబరంగా జరిగే మన వివాహ వేడుకలను చూడడానికి పర్యాటకులు రోజు కోసం 150 డాలర్ల టికెట్‌ను సంతోషంగా కొనేస్తున్నారు. మన రూపాయలలో పన్నెండు వేలకు పైనే. ఇక పెళ్లి పూర్తి తతంగం మొత్తం అంటే రెండు రోజులు చూడాలంటే 250 డాలర్లు చెల్లించాలి (రూ.20 వేలకుపైన). ఒకటీ, రెండూ కాదు ఐదు రోజుల పెళ్లి చూడాలంటే ప్రత్యేక వెడ్డింగ్ ప్యాకేజీ టికెట్ కొనాల్సిందే. ఇలా పదిమంది విదేశీ అతిథులు పెళ్లికి వచ్చారంటే పెళ్లిలో కొన్ని ఖర్చులకు సరిపడా డబ్బు సమకూడినట్లే! అందుకే ఎక్కువ మంది వెడ్డింగ్ టూరిజంపైన ఆసక్తి కనబరుస్తున్నారు.

తొలిసారి...

హంగేరియన్– ఆస్ట్రేలియన్ సంతతికి చెందిన ఒర్సి పర్కాణి తొలిసారి 2016లో 'జాయిన్ మై వెడ్డింగ్' పేరిట వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. అప్పుడు ఇది ఒక చిన్న స్టార్టప్. కానీ ఇప్పుడు ఇది ట్రెండ్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టు 19న పర్యాటక మంత్రిత్వ శాఖ వెడ్డింగ్ టూరిజంను ప్రారంభించింది. వెడ్డింగ్ టూరిజం ద్వారా భారతీయులేగాక, విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి ఇక్కడి సంప్రదాయాలకు తగ్గట్టుగా పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చని చెబుతూ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. బీచ్ వెడ్డింగ్, నేచర్ వెడ్డింగ్, రాయల్ వెడ్డింగ్, హిమాలయన్ వెడ్డింగ్ థీమ్‌ల పేరిట ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ట్రెండ్‌కు మంత్రిత్వ శాఖ ప్రోత్సాహం బూస్టర్‌గా పనిచేసి ఇండియాలో వెడ్డింగ్ వ్యాపారం వృద్ధిలోకి రాబోతుంది. ఇంకెందుకాలస్యం... మీ ఇంట్లో జరిగే పెళ్లివేడుకలకు వెడ్డింగ్ టూరిజంను జోడించి మరింత కలర్‌ఫుల్‌గా జరుపుకోండి.

సెర్మనీ గైడ్...

విదేశీయులను పెళ్లికి పిలవడమేగాక, వారికి అతిథి మర్యాదల్లో లోటు లేకుండా చూసుకోవడం ఈ వెడ్డింగ్ టూరిజం ప్రత్యేకత. వేడుక లో జరిగే ప్రతి విషయం, పర్యాటకులకు వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు సెర్మనీ గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు." ప్రస్తుతం రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో ఈ వెడ్డింగ్ టూరిజం పెరుగుతోంది. రాజస్థాన్‌లోని చిన్నటౌన్లలో జరిగే వేడుకలకు విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. జోధ్‌పూర్, జైపూర్, జైసల్మేర్, ఉదయ్‌పూర్‌లలో జరిగే రాయల్ ఇండియన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ ఇంకా ఎక్కువగా ఉంది" అని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

బ్యూటిప్స్

ముడతలు మచ్చలు పోవాల్సిందే...



కళ్లకింద ఏర్పడిన నల్లటి వలయాలు, ముడతలు, మచ్చలు అందమైన ముఖారవిందాన్ని పాడుచేస్తాయి. ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే...



- రాత్రి పడుకునేముందు కొద్దిగా అలోవెరా జెల్‌ను తీసుకుని కళ్ల కింద రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- విటమిన్ ఇ ఆయిల్ కొల్లాజెన్ బూస్టర్‌గా పనిచేసి కళ్లకింద రక్తప్రసరణ చక్కగా జరిగేందుకు తోడ్పడుతుంది. రాత్రి పడుకునే ముందు విటమిన్ ఇ ఆయిల్‌ను కళ్లకింద రాసి మర్దన చేయాలి.
- పై రెండూ అందుబాటులో లేని వారు కనీసం కొబ్బరి నూనెను అయినా కళ్లకింద రాసుకుని మర్దన చేసుకోవాలి. ఉదయాన్నే కడిగేయాలి.





ఈ మూడింటిలో ఏ ఒక్క చిట్కానైనా క్రమం తప్పకుండా పాటిస్తే కొద్దిరోజుల్లోనే ముడతలు, మచ్చలు పోయి ముఖారవిందం బాగుంటుంది.

గెలుపు దారి

వ్యాపారానికి సంబంధించిన ఐడియాలు ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తేనే వస్తాయి... అనే గ్యారెంటీ లేదు. వ్యాపార విజయాలు ఫలానా వయసుకు మాత్రమే పరిమితం... అనే నియమాలేవీ లేవు. నగలు అంటే బంగారమే... అనే శాసనం ఏదీ లేదు. ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన హేమా సర్దా...

వెదురు నగల వెలుగుల్లో...

కొన్ని సంవత్సరాల క్రితం...

ఢిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనకు హాజరైంది హేమా సర్దా. వినూత్నంగా కనిపించిన అస్సామీ బ్యాంబూ జ్యువెలరీని కొనుగోలు చేసింది. ఈ వెదురు నగలు తనకు ఎంతగా నచ్చాయంటే 65 సంవత్సరాల వయసులో 'బ్యాంబు అండ్ బంచ్' రూపంలో డైరెక్ట్–టు–కన్జ్యూమర్(డీ2సీ) బ్రాండ్‌కు శ్రీకారం చుట్టేంతగా. అస్సాంలోని గిరిజనులు తయారు చేసిన అందమైన వెదురు నగలను తన బ్రాండ్ ద్వారా విక్రయిస్తుంది హేమ. మన దేశంలో జువెలరీ అంటే బంగారం, వెండి... అనే అభిప్రాయాన్ని తన బ్రాండ్ ద్వారా మార్చే ప్రయత్నం చేస్తోంది. బయటి ప్రపంచానికి అంతగా తెలియని వెదురు నగలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

రకరకాల ప్రాంతాలలో తమ ప్రొడక్ట్స్‌కు సంబంధించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. మౌఖిక ప్రచారం ద్వారా వెదురు నగల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పదిహేను వేలతో వ్యాపారం ప్రారంభించి తన బ్రాండ్‌ను లాభాల బాట పట్టించింది హేమ. వ్యాపార వృద్ధికి సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మలుచుకుంది. తమ బ్రాండ్‌కు చెందిన వెదురు నగల చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. దీంతో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు రావడం మొదలైంది.

సంప్రదాయ వెదురు ఆభరణాలకు మోడ్రన్ ట్విస్ట్ ఇచ్చి కొనుగోలుదారులను ఆకట్టుకునేలా చేయడంలో హేమ విజయం సాధించింది. నాణ్యమైన వెదురును కొనుగోలు చేసి అస్సాంలోని ట్రైబల్ ఆర్టిస్ట్‌ల దగ్గరికి పంపుతుంది.

'అరవై అయిదు సంవత్సరాల వయసులో మార్కెట్ తీరుతెన్నులను గురించి తెలుసుకోవడం కష్టమే కావచ్చు. ఈ వయసులో అవసరమా అని కూడా అనిపించవచ్చు. అయితే నేను ఎప్పుడూ అలా అనుకోలేదు. కొన్నిసార్లు ప్రయాణమే పాఠాలు నేర్పుతుంది. నా విషయంలోనూ ఇదే జరిగింది. మొదట్లో మా బ్రాండ్ పెద్దగా సక్సెస్ కాలేదు. జరిగిన తప్పులను సవరించుకొని ముందుకు వెళ్లాను' అంటుంది హేమ.

కోడలు తాన్య సహాయంతో మార్కెట్ ప్లేస్‌లను లొకేట్ చేయడం నుంచి సోషల్ మీడియా మార్కెటింగ్, ఫొటోగ్రఫీ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది హేమ.

'నాణ్యమైన నగల అలంకరణకు బంగారమే అక్కర్లేదు అని చెప్పడానికి బ్యాంబూ జువెలరీ ఉదాహరణ. డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారం ప్రారంభించలేదు. వినూత్నమైన కళను ప్రజలకు చేరువ చేయాలనేది నా ప్రయత్నం' అంటుంది హేమా సర్దా.


హేమా సర్దా





పారా ఆర్చర్ శీతల్‌కు స్వర్ణం, రజతం

ఆసియా పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు లభించాయి. ఆసియా పారా గేమ్స్‌లో రెండు స్వర్ణాలు నెగ్గి అందరి ప్రశంసలు అందుకున్న శీతల్ దేవి ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ రాణించింది. రెండు చేతులు లేకున్నా తన కాళ్లతో విల్లు ఎక్కుపెట్టి బాణాలు సంధించే శీతల్ ఈ టోర్నీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రాకేశ్‌తో కలిసి స్వర్ణం... వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించింది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో శీతల్ దేవి 'షూట్ ఆఫ్'లో సింగపూర్ ప్లేయర్ నూర్ సియాదా చేతిలో ఓడిపోయింది.

గిల్ 'టాప్ ర్యాంక్' పదిలం



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ 826 రేటింగ్ పాయింట్లతో తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్తాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ 824 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. భారత స్టార్స్ కోహ్లి, రోహిత్ శర్మ ఒక్కో స్థానం మెరుగుపర్చుకున్నారు. కోహ్లి 791 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో, రోహిత్ 769 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచారు.

శ్రీకాంత్ పరాజయం



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్‌లకు నిరాశ ఎదురైంది. ఈ ముగ్గురూ తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 15-21, 21-14, 13-21తో ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిడ్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 17వ ర్యాంకర్ లక్ష్య సేన్ 19-21, 18-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ షి యు కి (చైనా) చేతిలో... 30వ ర్యాంకర్ ప్రియాన్షు 17-21, 14-21తో 13వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రితూపర్ణ-శ్వేతపర్ణ (భారత్) ద్వయం 15-21, 9-21తో షు జియాన్ జాంగ్-యు జెంగ్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ప్రాంజల శుభారంభం



బెంగళూరు: మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి యడ్లపల్లి ప్రాంజల శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో 24 ఏళ్ల ప్రాంజల 6-1, 6-0తో భారత్‌కే చెందిన వన్షితపై నెగ్గింది. ఏడాదిన్నర తర్వాత మళ్లీ అంతర్జాతీయ టోర్నీలో ఆడుతున్న ప్రాంజల ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

బ్రెజిల్ తొలిసారి...

రియో డి జనీరో: ఫుట్‌బాల్ ప్రపంచకప్-2026 దక్షిణ అమెరికా జోన్ క్వాలిఫయింగ్ పోటీల్లో ఐదుసార్లు విశ్వవిజేత బ్రెజిల్ జట్టుకు పరాజయం ఎదురైంది. మెస్సీ సారథ్యంలోని ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా 1-0 గోల్ తేడాతో బ్రెజిల్ జట్టును ఓడించింది. ఆట 63వ నిమిషంలో నికోలస్ ఒటామెండి హెడర్ షాట్‌తో గోల్ సాధించి అర్జెంటీనా విజయంలో కీలకపాత్ర పోషించాడు. స్వదేశంలో ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో బ్రెజిల్ జట్టు ఓడిపోవడం ఇదే తొలిసారి.

మళ్లీ కొత్తగా మొదలు...

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా టి20 సిరీస్

విశాఖలో తొలి పోరు	టీమిండియా కుర్రాళ్ల సత్తాకు పరీక్ష	రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్-18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి తర్వాత నాలుగు రోజులకే ఆస్ట్రేలియాతో మరో పోరులో భారత్ ఆడాల్సి వస్తుందని ఎవరైనా ఊహించారా? కానీ ఇప్పుడు ఇరు జట్లు మళ్లీ తలపడేందుకు సిద్ధమయ్యాయి. 2023లో భారత గడ్డపై ఆస్ట్రేలియా రెండు వేర్వేరు సందర్భాల్లో రెండు వన్డే సిరీస్‌లు, ఒక టెస్టు సిరీస్ ఆడగా... వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో, ఇటీవల వన్డే వరల్డ్‌కప్ తొలి మ్యాచ్, చివరి మ్యాచ్‌లో ఈ రెండు టీమ్‌లు 'ఢీ'కొన్నాయి. ఈ నేపథ్యంలో ఏకంగా ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ జరగబోతోంది. స్టార్ ఆటగాళ్లు కాకుండా ఎక్కువ మంది కుర్రాళ్లతోనే టీమిండియా బరిలోకి దిగుతుండగా, ఆసీస్ కూడా పలువురు కీలక ఆటగాళ్లకు విశ్రాంతిచ్చింది.



స్టొయినిస్, హెడ్, అబాట్

సాక్షి, విశాఖపట్నం: వన్డే వరల్డ్‌కప్ తర్వాత భారత్, ఆస్ట్రేలియా టి20 సమరానికి సన్నద్ధమయ్యాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు వైఎస్‌ఆర్-ఏసీఏ-వీడీసీఏ మైదానంలో జరిగే తొలి టి20లో ఇరు జట్లు తలపడనున్నాయి. మామూలుగా అయితే ఈ టి20 సిరీస్‌కు పెద్దగా ప్రాధాన్యత లేదు. అయితే వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌కు ముందు ఈ ఫార్మాట్‌లో ఇరు జట్లు మొత్తం 11 టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాయి. ఈ సిరీస్ మ్యాచ్‌లు కూడా అందులో భాగమే కాబట్టి రెండు టీమ్‌లూ తుది కూర్పులపై దృష్టి పెట్టాయి. మాజీ క్రికెటర్, జాతీయ క్రికెట్ అకాడమీ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ సిరీస్‌కు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో...

ప్రస్తుత సిరీస్‌కు ముందు భారత జట్టు బలహీన వెస్టిండీస్, ఐర్లాండ్‌లతోనే టి20 సిరీస్‌లు ఆడింది. మరోవైపు ఏమాత్రం పోటీ లేని ఆసియా క్రీడల్లో కూడా పాల్గొని స్వర్ణం సాధించింది. ఈ నేపథ్యంలో వరల్డ్‌కప్ ఆడిన ఆటగాళ్లలో ముగ్గురినే భారత్ ఈ సిరీస్ కోసం ఎంపిక చేసింది. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ తొలిసారి బాధ్యతలు చేపట్టగా... ఇషాన్ కిషన్, వన్డే ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని ప్రసిధ్ కృష్ణ టీమ్‌లో ఉన్నారు. ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నా... ఇప్పటికే యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ రూపంలో ఇద్దరు ఓపెనర్లు ఉన్నారు. వీరిలో ఎవరిని పక్కన పెడతారనేది చూడాలి. మిడిలార్డర్‌లో హైదరాబాద్ ప్లేయర్ ఠాకూర్ తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్ చెలరేగాలని పట్టుదలగా ఉన్నారు. చివరి నిమిషంలో గాయంతో అనూహ్యంగా ప్రపంచకప్‌కు దూరమైన అక్షర్ పటేల్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయం. రవి బిష్ణోయ్ రూపంలో లెగ్‌స్పిన్నర్ జట్టుకు అందుబాటులో ఉన్నాడు.

సీనియర్లు అండగా...

కమిన్స్, వార్నర్ వంటి స్టార్లకు ఆస్ట్రేలియా విశ్రాంతినిస్తూ ఈ సిరీస్ నుంచి తప్పించినా... ప్రస్తుతం ఆసీస్ టీమ్ కూడా బలంగానే ఉంది. వన్డే వరల్డ్ కప్ టీమ్‌లో ఉన్న ఏడుగురు ఈ సిరీస్ కోసం భారత్‌లోనే ఆగిపోయారు. ఫైనల్ ఆడిన స్మిత్, ఇన్‌గ్లిస్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం ఉండగా... ట్రవిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, ఆడమ్ జంపా విశ్రాంతి తీసుకోనున్నారు. స్మిత్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. టిమ్ డేవిడ్, స్టొయినిస్ చూపించే విధ్వంసం భారత జట్టుకు అనుభవమే. బౌలింగ్‌లో బెహ్రెన్‌డార్ఫ్‌కు భారత గడ్డపై అనుభవం ఉంది. తన్వీర్ సంఘా ఏకైక స్పిన్నర్‌గా ఆడతాడు.



సూర్యకుమార్

పిచ్, వాతావరణం

వైజాగ్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఇక్కడ జరిగిన 3 టి20ల్లోనూ చెప్పుకోతగ్గ స్కోర్లు నమోదయ్యాయి. మ్యాచ్ రోజు కొన్ని చిరుజల్లులకు అవకాశం ఉన్నా... ఆటకు ఇబ్బంది ఉండకపోవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, యశస్వి/రుతురాజ్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), స్మిత్, షార్ట్, హార్డీ, ఇన్‌గ్లిస్, స్టొయినిస్, టిమ్ డేవిడ్, సీన్ అబాట్, ఎలిస్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్ సంఘా.

26 భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకు 26 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 15 మ్యాచ్‌ల్లో భారత్, 10 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలిచాయి. ఒక మ్యాచ్ రద్దయింది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో 10 మ్యాచ్‌లు ఆడిన భారత్ 6 మ్యాచ్‌ల్లో గెలిచి, 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

3 విశాఖపట్నంలో భారత జట్టు ఇప్పటి వరకు మూడు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో రెండింటిలో (2016లో శ్రీలంకపై; 2022లో దక్షిణాఫ్రికాపై) గెలిచి, ఒక మ్యాచ్‌లో (2019లో ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయింది.

మళ్లీ కేకేఆర్ చెంతకు గంభీర్

టీమ్ మెంటార్‌గా నియామకం

కోల్‌కతా: ఐపీఎల్‌లో సారథిగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు రెండు టైటిల్స్ అందించిన మాజీ కెప్టెన్ గౌతమ్ గంభీర్ ఇప్పుడు మరోసారి ఆ జట్టుతో కలిసి పని చేయనున్నాడు. 2024 సీజన్ నుంచి కేకేఆర్ టీమ్‌కు గంభీర్ మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించింది. టీమ్ కోచ్ చంద్రకాంత్ పండిత్‌తో కలిసి అతను పని చేస్తాడని పేర్కొంది. బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ సహ యజమానిగా ఉన్న నైట్‌రైడర్స్ జట్టుకు గంభీర్ 2011 నుంచి 2017 వరకు ఏడు సీజన్ల పాటు కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ సమయంలో కోల్‌కతా జట్టు ఐదుసార్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించగా... 2012, 2014లలో విజేతగా నిలిచింది. భారత క్రికెట్ జట్టు రెండు వరల్డ్‌కప్ విజయాల్లో (2007 టి20, 2011 వన్డే) కీలకపాత్ర పోషించిన గంభీర్, గత రెండు సీజన్లుగా లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా వ్యవహరించాడు.



ఐపీఎల్ ట్రోఫీతో షారుఖ్, గౌతమ్ గంభీర్ (ఫైల్)

రాజస్తాన్‌కు అవేశ్... లక్నోకు దేవదత్






కొత్త ఐపీఎల్ సీజన్‌కు ముందు జరిగే 'ట్రేడింగ్'లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు పరస్పరం ఆటగాళ్లను మార్చుకున్నాయి. లక్నో తరఫున ఆడిన పేస్ బౌలర్ అవేశ్ ఖాన్‌ను రాజస్తాన్ రాయల్స్ తీసుకుంది. అతనికి బదులుగా రాజస్తాన్ టీమ్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ లక్నో సూపర్ జెయింట్స్‌తో జట్టుతో చేరాడు. రెండు సీజన్లపాటు (2022, 2023) లక్నో తరఫున ఆడిన అవేశ్ ఖాన్ 22 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగి 26 వికెట్లు పడగొట్టాడు. రెండు సీజన్లపాటు రాజస్తాన్ రాయల్స్ జట్టుకు ఆడిన దేవదత్ 28 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగి మూడు అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 637 పరుగులు సాధించాడు. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ ఇద్దరు ఆటగాళ్లు మనీశ్ పాండే, సర్ఫరాజ్ ఖాన్‌లను విడుదల చేసింది.

సినిమా

నో ప్రాబ్లమ్... రానివ్వండి!



'తండేల్'లో నాగచైతన్య

"నటుడిగా ఇంకా చాలా పాత్రలు చేయాలి.. నటనపరంగా ఇంకా ఎదగడానికి కృషి చేస్తూనే ఉంటాను. ఇన్నేళ్ల కెరీర్‌లో జయాపజయాలు చూశాను. అన్నింటినుంచీ ఏదో ఒకటి నేర్చుకున్నాను. అయితే నటుడిగా సంతృప్తి దక్కలేదు. ఇంకా చాలా సాధించాలి" అని హీరో నాగచైతన్య అన్నారు. నేడు (నవంబర్ 23) ఈ హీరో బర్త్‌డే. నాగచైతన్య హీరో అయి పద్నాలుగేళ్లు అవుతోంది. ఇక ఈ పుట్టినరోజు స్పెషల్ ఏంటంటే.. 'దూత' సిరీస్‌తో తొలిసారి వెబ్ వరల్డ్‌లోకి అడుగు పెడుతున్నారు. ఆ విశేషాలు, ఇంకా ఇతర విశేషాలను నాగచైతన్య ఈ విధంగా పంచుకున్నారు.

ముందుగా బర్త్‌డే స్పెషల్ గురించి..

బర్త్‌డే గ్రాండ్‌గా జరుపుకోవడం ఉండదు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో స్పెండ్ చేద్దామనుకుంటున్నా. నేను చేసిన ఫస్ట్ వెబ్ సిరీస్ 'దూత' ట్రైలర్ విడుదలవుతోంది. అలాగే చందు మొండేటి డైరెక్షన్‌లో చేసే సినిమాకి 'తండేల్' టైటిల్ ఫిక్స్ చేసి, లుక్ రిలీజ్ చేశాం. నా బర్త్‌డే స్పెషల్స్ ఇవే.

'దూత' సిరీస్ గురించి..

డిసెంబర్ 1 నుంచి ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. వెబ్ సిరీస్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోంది. అందుకే మంచి వెబ్ సిరీస్ చేయాలనుకున్నాను. నాకు విక్రమ్ కె. కుమార్ చేసిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ '13 బి, 24', కొంతవరకూ ఆ తరహాలో ఉన్న 'మనం' వంటివి చాలా ఇష్టం. '24' సినిమా లాంటి కాన్సెప్ట్ అయితే సిరీస్ చేద్దామనుకున్నాను. విక్రమ్ ఆ తరహాలో 'దూత' లాంటి యూనిక్ కాన్సెప్ట్‌తో వచ్చారు. అయితే వెబ్ సిరీస్ అని చెప్పలేదు. కానీ ఈ కాన్సెప్ట్‌ని రెండున్నర గంటల్లో చెప్పలేం. అందుకే సిరీస్‌గా చేశాం. సినిమాకీ, సిరీస్‌కీ నటనపరంగా వ్యత్యాసం లేదు. కానీ టెక్నికల్‌గా నాకో కొత్త అనుభవం. 'దూత'కి సీజన్ 2, సీజన్ 3 ఐడియాలు ఉన్నాయి.

చందు మొండేటి డైరెక్షన్‌లో చేసే 'తండేల్' సినిమా కోసం ఎక్కువ టైమ్ కేటాయిస్తున్నారు...

మా టీమ్ మొత్తానికి ఇది స్పెషల్ ప్రాజెక్ట్. రెగ్యులర్ షూటింగ్‌ని డిసెంబర్‌లో ఆరంభిస్తాం. కానీ ఆరేడు నెలలుగా ఈ సినిమాతోనే ట్రావెల్ అవుతున్నా. ఈ చిత్రంలో నేను మత్స్యకారుడి పాత్ర చేస్తున్నాను. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్ కాబట్టి అవగాహన కోసం శ్రీకాకుళంలోని ఓ గ్రామానికి వెళ్లాం. శ్రీకాకుళం స్లాంగ్ నేర్చుకుంటున్నా. ఫిషర్‌మేన్‌గా కనిపించడం కోసం ఫిజికల్‌గా మేకోవర్ అయ్యాను. అలాగే ఫిషర్‌మేన్ బాడీ లాంగ్వేజ్ కోసం మూడు నెలలు కృషి చేశాను. ఎప్పుడెప్పుడు షూటింగ్‌కి వెళదామా అని వేచి చేస్తున్నా.

ఇంతకుముందు ఏ సినిమాకీ ఇంత వర్కవుట్ చేయలేదు కదా..

'తండేల్' పెద్ద స్పాన్ ఉన్న కథ. అందుకే షూటింగ్ ఆరంభించక ముందే ఎక్కువ టైమ్ కేటాయించాను. చందుతో పాటు నిర్మాతలు అల్లు అరవింద్‌గారు, 'బన్నీ' వాసుగారు ఈ కథను చాలా నమ్మారు. నా కెరీర్‌లో పెద్ద బడ్జెట్ మూవీ అవుతుంది. కథ కొంత భాగం ఇండియా, కొంత పాకిస్తాన్‌లో జరుగుతుంది.

ఓ వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని చందు మీ క్యారెక్టర్‌ని క్రియేట్ చేశారట...

అవును. నేనా వ్యక్తిని కలిసి, మాట్లాడాను. ఓ ఫిషర్‌మేన్ లైఫ్‌లో జరిగిన కొన్ని ఘటనలను సినిమాటిక్‌గా చూపించనున్నాం.

అక్కినేని ఫ్యామిలీకి ప్రేమకథలు లక్కీ.. 'తండేల్' ప్రధానంగా ప్రేమకథా చిత్రం కదా..

అవును. ఈ చిత్రంలో అద్భుతమైన ప్రేమకథ ఉంది. ఈ మధ్యకాలంలో నేను చేసిన చిత్రాల్లో ప్రేమ పార్ట్ అంతగా లేదు. ఆ విషయాన్ని ఫీలయ్యాను. అందుకే ఈసారి ప్యూర్ లవ్‌స్టోరీ చేద్దామనుకున్నాను. 'తండేలా' అలాంటి చిత్రమే.

ఇక ఈ మధ్య ఓ హీరోయిన్‌తో మిమ్మల్ని లింక్ అప్ చేసే వార్తలు వస్తున్నాయి.. ఏమంటారు?

రానివ్వండి... నో ప్రాబ్లమ్ (నవ్వుతూ). ఇలాంటి వాటి గురించి ఏం చెప్పినా.. ఎంత చెప్పినా ఆగవు. ఇక పర్సనల్ స్పేస్‌లో నేను చాలా హ్యాపీగా ఉన్నాను. ఏదైనా చెప్పాల్సినది జరిగితే నేనే చెబుతాను.

ఎక్స్‌ట్రార్డినరీ సాంగ్



నితిన్, శ్రీలీల

ఎక్స్‌ట్రార్డినరీ లెవల్‌లో డ్యాన్స్ చేశారు నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మ్యాన్'. రాజశేఖర్ ఓ కీలక పాత్రధారి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ శివార్లలో జరుగుతోంది. ఓ భారీ సెట్‌లో 300 మందికి పైగా ఫారిన్ డ్యాన్సర్స్‌తో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో నితిన్, శ్రీలీలపై ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటతో ఈ సినిమా చిత్రీకరణ పూర్తవుతుందని, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయని యూనిట్ పేర్కొంది. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యా మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై ఎన్. సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 8న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: హ్యారిస్ జైరాజ్.

నటుడికి సంతృప్తి అనేది ఉండదు - శ్రీకాంత్



"ఈ మధ్య కాలంలో నేను పూర్తి స్థాయి పాత్ర చేసిన చిత్రం 'కోట బొమ్మాళి'. నటనకి చాలా స్కోప్ ఉన్న పాత్ర. అంతకు ముందు నేను చేసిన సినిమాల్లో పాటలు, ఫైట్స్.. ఇలా వాణిజ్య అంశాలు ఉన్నాయి. 'కోట బొమ్మాళి'లో చక్కటి ఫ్యామిలీ డ్రామా కూడా ఉంటుంది" అని శ్రీకాంత్ అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ చెప్పిన విశేషాలు.

- 'కోట బొమ్మాళి' వైవిధ్యమైన కథ. ఎక్కడైనా క్రిమినల్స్‌ని పోలీసులు వెంటాడి పట్టుకుంటారు. ఈ సినిమాలో పోలీసులే పోలీసులను వెంటాడటం ఆసక్తిగా ఉంటుంది. రాజకీయ నాయకులు పోలీసులను ఎలా వాడుకుంటారు? దాని వల్ల పోలీసులకు ఎదురైన ఇబ్బందులు ఏంటి? తమ ఓట్ల కోసం కులాలను, మతాలను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకుంటారు? అనేది ఈ చిత్రం ప్రధాన కథాంశం. ఈ సినిమాలో ఎలాంటి పొలిటికల్ సెటైర్ ఉండదు. అయితే ప్రస్తుతం వ్యవస్థలో జరుగుతున్నది చూపించాడు దర్శకుడు తేజ.
- ఓ మధ్య తరగతి హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో ఎలాంటి వాతావరణం ఉంటుందన్నది ఈ మూవీలో ఆసక్తిగా ఉంటుంది. నేను హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ పాత్ర చేశాను. నా పాత్ర, రాహుల్, శివాని.. మా ముగ్గురి పాత్రల మధ్య కథ తిరుగుతుంటుంది. మా పై అధికారి వరలక్ష్మి మమ్మల్ని పట్టుకోవడానికి వేసే ఎత్తులకు నేను వేసే పై ఎత్తులు ఆసక్తిగా ఉంటాయి.
- దాదాపు 32 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో పాత్రలు చేశాను. ఎన్ని చేసినా ఓ నటుడికి సంతృప్తి ఉండదు.. ఇంకా వైవిధ్యమైన పాత్రలు చేయాలనే ఆరాటం ఉంటుంది. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'గేమ్ చేంజర్', ఎన్టీఆర్‌తో 'దేవర', మోహన్‌లాల్, మా అబ్బాయి రోషన్ నటిస్తున్న 'వృషభ' సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను.

హీరోల కష్టం అర్థమైంది - తేజ్ బొమ్మదేవర



''ప్రేమ, వినోదం, థ్రిల్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలతో రూపొందిన చిత్రం 'మాధవే మధుసూదన'. మంచి కథ. తెలుగులో ఓ కొత్త జానర్‌లా అనిపిస్తుంది'' అన్నారు తేజ్ బొమ్మదేవర. ఆయన హీరోగా, రిషికా లోక్రే హీరోయిన్‌గా నటించిన చిత్రం 'మాధవే మధుసూదన'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజ్ బొమ్మదేవర మాట్లాడుతూ– ''బీబీఏ పూర్తి చేసి, విదేశాలకు వెళ్లి ఎంబీఏ చేద్దామనుకున్నా. అయితే కరోనా వల్ల ఆగిపోయాను. మా నాన్న రామచంద్ర రావు ఆ సమయంలో 'మాధవే..' కథను రెడీ చేసుకున్నారు. భిక్షు మాస్టర్ వద్ద నటనలో శిక్షణ తీసుకుని, ఈ సినిమా చేశాను. హీరోలు వేదికలపై మాట్లాడుతూ అప్పుడప్పుడు తడబడుతుంటే ఏదో అనుకునేవాణ్ని. కానీ వారి కష్టం ఎలా ఉంటుందో నాకు అర్థం అయింది. హీరోగానే కాదు.. ఎలాంటి పాత్రలు వచ్చినా చేస్తాను'' అన్నారు.

అడ్డా డేట్ ఫిక్స్




ఉపేంద్ర, సావిత్రి

కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'. కంచర్ల అచ్యుతరావు నిర్మించిన ఈ సినిమాని డిసెంబర్ 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో డిసెంబర్ 1న సినిమాను రిలీజ్ చేయబోతున్నాం'' అన్నారు. ''మాస్, వినోదానికి సందేశాన్ని మిళితం చేసి ఈ సినిమా తీశాం. ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు కంచర్ల ఉపేంద్ర, ఆర్యన్ సుభాన్ ఎస్‌కే.

మాకు అన్ని పార్టీల మద్దతు ఉంటుంది - వీజే సన్నీ



''నాకు వినోదాత్మక చిత్రాలంటే చాలా ఇష్టం. 'సౌండ్ పార్టీ' సినిమా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. సినిమా చూసిన ప్రేక్షకులు నిరుత్సాహపడరు. ఎన్నికల టైమ్‌లో వస్తున్న మా 'సౌండ్ పార్టీ'కి అన్ని పార్టీల మద్దతు ఉంటుంది (నవ్వుతూ)'' అని హీరో వీజే సన్నీ అన్నారు. సంజయ్ శేరి దర్శకత్వంలో వీజే సన్నీ, హృతికా శ్రీనివాస్ జంటగా నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా వీజే సన్ని మాట్లాడుతూ– ''బిగ్ బాస్ 5' సీజన్ తర్వాత నేను చేసిన బెస్ట్ ప్రాజెక్ట్ 'సౌండ్ పార్టీ'. తండ్రీ కొడుకుల మధ్య ఉండే స్నేహం, త్వరగా డబ్బులు సంపాదించడం కోసం వారిద్దరూ ఏం చేశారు? అనేది ఈ సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. సంజయ్ శేరిగారు నాకు చెప్పిన కథని అలాగే తెరపైకి తీసుకొచ్చారు. ప్రయోగాత్మక పాత్రలతో ప్రేక్షకులకు మరింత దగ్గర కావాలన్నదే నా లక్ష్యం'' అన్నారు.



ధనుష్

కిల్లర్.. కిల్లర్...

ధనుష్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ప్రియాంకా మోహన్, సందీప్ కిషన్ కీలక పాత్రలు చేస్తున్నారు. టీజీ త్యాగరాజన్ సమర్పణలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని తొలి పాట 'కిల్లర్.. కిల్లర్...'ని విడుదల చేశారు. ఈ పాటకి రాకేందు మౌళి సాహిత్యం అందించగా, హేమచంద్రతో కలసి ధనుష్ స్వయంగా పాడారు. ''1930-40 నేపథ్యంలో రూపొందుతోన్న పీరియాడికల్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. ధనుష్ కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. 2024 సంక్రాంతికి తెలుగు, తమిళ,, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మధ్యతరగతి నేపథ్యంలో...

నటుడు రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వం వహించిన చిత్రం 'సారంగదరియా'. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి-శరత్ చంద్ర నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో రాజ్ తరుణ్ విడుదల చేసి, ''సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''త్వరలో మూవీ విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు శరత్ చంద్ర. ''ఒక మధ్యతరగతి కుటుంబంలో జరిగిన కొన్ని ఘర్షణలతో ఈ కథ ఉంటుంది'' అన్నారు పద్మారావు అబ్బిశెట్టి. ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎబెనెజర్ పాల్, కెమెరా: సిద్ధార్థ స్వయంభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరుణాచల మహేశ్.



'సారంగదరియా' పోస్టర్

సాక్షి
బిజినెస్
గురువారం
23-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	92	28
	66,023	19,812

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,296	▲	96
డోజోన్స్	35,285	▲	197
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,469	▽	12
డాక్స్	15,958	▲	57
షాంఘై	3,044	▽	24
నికాయ్	33,452	▲	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,616 ▲	366
బంగారం (99.5 స్వచ్ఛత)	61,369 ▲	366
వెండి (కిలో)	73,465 ▲	736

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.53	106.11
€	యూరో	ఒకటి	88.92	92.02
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.85	55.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.57	54.69
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.78
SAR	సౌదీ రియాల్	పది	21.27	22.11
UAE D	యూఏఈ దిర్హామ్	పది	22.76	24.59
¥	చైనా యువాన్	పది	10.49	12.49

ఒడిదుడుకులున్నా స్వల్పలాభాలు

19,800 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు బుధవారం స్వల్పలాభాలతో గట్టెక్కాయి. అధిక వెయిటేజీ టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒకశాతం రాణించి సూచీలను నష్టాల నుంచి గట్టెక్కించాయి. అయితే విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల పరిణామం లాభాలను పరిమితం చేశా యి. ఇంట్రాడేలో 398 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 92 పాయింట్లు పెరిగి 66,023 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్ల రేంజ్‌లో ట్రేడైంది.28 పాయింట్ల లాభంతో 19,812 వద్ద నిలిచింది. స్వల్ప లాభంతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో ఊగిసలాటకు లోనయ్యాయి. విద్యుత్, ఆటో, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కమోడిటీ, ఫైనాన్షియల్, టెలికం, బ్యాంకుల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

హైదరాబాద్‌లో యూఎస్‌టీ కొత్త సెంటర్ ప్రారంభం



ముంబై: డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ యూఎస్‌టీ హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో కొత్తగా అధునాతన సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 2,000 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా.. వచ్చే మూడేళ్లలో 4,000కు పెంచుకోనున్నట్లు సంస్థ సీఈవో కృష్ణ సుధీంద్ర తెలిపారు. 1,18,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సెంటర్‌లో టెలికం, హైటెక్, రిటైల్, బీమా తదితర రంగాలకు సంబంధించి పరిశోధన కార్యకలాపాలు నిర్వహిస్తారు. కొత్త సెంటర్ ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మొదలైన సాంకేతికతలపై దృష్టి పెడుతుందని సుధీంద్ర వివరించారు. కంపెనీకి దేశీయంగా ఇది నాలుగో డెవలప్‌మెంట్ సెంటర్. యూఎస్‌టీకి భారత్‌లో 15,000 మంది, అంతర్జాతీయంగానూ దాదాపు అదే స్థాయిలో ఉద్యోగులు ఉన్నారు.



ఐపీవో.. హాట్ కేక్!

దేశీ స్టాక్ మార్కెట్లు హెచ్చుతగ్గులు చవిచూస్తున్నప్పటికీ ఇటీవల ప్రైమరీ మార్కెట్లు కొత్త ఇష్యూలతో కళకళలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపుతుండటంతో పలు కంపెనీలు లిస్టింగ్ బాట పడుతున్నాయి. తాజాగా టాటా టెక్నాలజీస్, గాంధార్ ఆయిల్ రిఫైనరీ, ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకాగా.. తొలి రోజే అధిక స్థాయిలో స్పందన లభించడం గమనార్హం! వివరాలు ఇలా...

టాటా టెక్నాలజీస్




న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసుల టాటా గ్రూప్ కంపెనీ టాటా టెక్నాలజీస్ ఐపీవో తొలి రోజే అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో ప్రారంభమైన వెంటనే భారీగా బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 475-500 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూకి 6.5 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. కంపెనీ 4.5 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 29.43 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. వెరసి 24న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 3,043 కోట్ల వరకూ అందుకోనుంది. టీసీఎస్(2004) తదుపరి రెండు దశాబ్దాలకు టాటా గ్రూప్ నుంచి వస్తున్న ఐపీవోకాగా.. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 4 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 11.7 రెట్లు, రిటైలర్ల నుంచి 5.4 రెట్ల చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా మంగళవారం(21న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 791 కోట్లు సమీకరించిన విషయం విదితమే. మొత్తం 6.08 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. వీటిలో మాతృ సంస్థ టాటా మోటార్స్ 4.63 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తోంది.

ఫ్లెయిర్ రైటింగ్



పెన్నులు, స్టేషనరీ ప్రొడక్టుల తయారీ కంపెనీ ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ ఐపీవో తొలి రోజే పూర్తి సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. షేరుకి రూ. 288-304 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూకి 2.17 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 1.44 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 3.13 కోట్లకుపైగా షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 53%, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 2.78 రెట్లు, రిటైలర్ల నుంచి 2.86 రెట్లు చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా రూ. 292 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. మరో రూ. 301 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ గ్రూప్ సంస్థలు విక్రయానికి ఉంచాయి. 24న ముగిసే ఇష్యూ ద్వారా రూ. 501 కోట్ల వరకూ అందుకోనుంది.

గాంధార్ ఆయిల్



ప్రైవేట్ రంగ కంపెనీ గాంధార్ ఆయిల్ రిఫైనరీ(ఇండియా) ఐపీవో తొలి రోజే అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. షేరుకి రూ. 160-169 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూకి 5.5 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. కంపెనీ 2.12 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 11.72 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 1.3 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 7.7 రెట్లు, రిటైలర్ల నుంచి 6.9 రెట్ల చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. 24న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 501 కోట్లవరకూ అందుకోనుంది. ఇష్యూలో భాగంగా రూ. 302 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 1.17 కోట్లకుపైగా షేర్లను విక్రయానికి ఉంచింది.

ఏపీలో ఈప్యాక్ ప్రీఫ్యాబ్ ప్లాంటు ప్రారంభం..

రూ. 198 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు



న్యూఢిల్లీ: ప్రీ-ఇంజనీర్డ్ స్ట్రక్చర్స్ తయారీ సంస్థ ఈప్యాక్ ప్రీఫ్యాబ్ తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో తమ కొత్త ప్లాంటును ప్రారంభించినట్లు వెల్లడించింది. తిరుపతి జిల్లా తడ వద్ద 24 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంటును రూ. 198 కోట్లతో ఏర్పాటు చేసినట్లు వివరించింది. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 87,000 మెట్రిక్ టన్నులుగా ఉంటుందని పేర్కొంది. కంపెనీకి దీనితో పాటు రాజస్తాన్‌లోని ఘిలోత్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో రెండు ప్లాంట్లు ఉన్నాయి. వీటి మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,00,000 మెట్రిక్ టన్నులు. కొత్త ప్లాంటు కూడా అందుబాటులోకి రావడంతో మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,87,000 టన్నులకు చేరినట్లయింది. ప్రీ-ఇంజనీర్డ్ స్ట్రక్చర్లకు డిమాండ్ పెరుగుతుండటంతో దేశీ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లపైనా మరింతగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ డైరెక్టర్ (మధ్యప్రాచ్యం, ఆఫ్రికా) నిఖిల్ బోత్రా తెలిపారు.

బ్యాంకింగ్ స్థిరత్వమే ఆర్‌బీఐ లక్ష్యం..

- వ్యక్తిగత రుణ నిబంధనల కఠినతరంపై గవర్నర్ స్పష్టీకరణ
- రూపాయి విలువలో భారీ ఒడిదుడుకులు లేవని వ్యాఖ్య

ముంబై: క్రెడిట్‌కార్డ్‌సహా అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణ మంజూరు నిబంధనలను కఠినతరం చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల తీసుకున్న నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరత్వానికి ఉద్దేశించిన ''ముందస్తు'' చర్యని గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. వ్యక్తిగత రుణ మంజూరీల విషయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల రిస్క్ కేటాయింపులను 25 శాతం పెంచుతూ ఆర్‌బీఐ కీలక నిబంధనలు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. వార్షికంగా ఈ రుణ విభాగం 30 శాతం పెరుగుదల దీనికి నేపథ్యం. ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణ మంజూరీల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. మూలధనంపై కూడా ఈ నిర్ణయ ప్రభావం ఉంటుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇక ఇతర వర్ధమాన దేశాల కరెన్సీలతో పోల్చితే భారత్ మారకపు విలువలో ఒడిదుడుకులు చాలా తక్కువగా ఉన్నట్లు గవర్నర్ తాజాగా వివరించారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్- ఐబీఏ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ- ఫిక్కీ ఇక్కడ ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న ఎఫ్‌ఐబీఏసీ 2023 (ఫిక్కీ బ్యాంకింగ్ సమావేశాలు-2023) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ శక్తికాంత దాస్ ప్రారంభోపన్యాసం చేశారు. గవర్నర్ ఈ సందర్భంగా ఏమన్నారంటే...

- బ్యాంకింగ్ వ్యవస్థ సవాళ్లను తట్టుకుంటూ సుస్థిరంగా కొనసాగుతోంది. వ్యవస్థ గురించి ఆందోళన చెందడానికి తక్షణ కారణం ఏదీ లేదు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల పనితీరు ఎంతో మెరుగ్గా ఉంది. అయితే మొండిబకాయిలుగా మారే ఖాతాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ ప్రమాదకర ధోరణిని ముందే గుర్తించాలి.
- వ్యక్తిగత రుణ నిబంధనలను కఠినతరం చేస్తూ ఇటీవల తీసుకున్న ఫలితాల గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేం. రుణదాతలు తమ రిస్క్ మేనేజ్‌మెంట్ పద్ధతులను పటిష్టం చేసుకోవాలి.
- బ్యాంకింగ్ వ్యవస్థ నుండి ఎన్‌బీఎఫ్‌సీ పెద్ద రుణ గ్రహీతగా ఉంది. రెండింటి మధ్య లోతైన అనుసంధానం ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఎన్‌బీఎఫ్‌ల రుణ పరిణామాలను నిరంతరం మందింపు చేయాలి.
- రిటైల్ ద్రవ్యోల్బణం దిగిరావడం ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానం తగిన ఫలితాలు ఇస్తోందన్న విషయం తెలియజేస్తోంది. అయితే ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్‌బీఐ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇది ఆర్‌బీఐకి 'అర్జునుడు లక్ష్యంపై గురి పెట్టడం లాంటిది'.

వడ్డీరేట్ల విషయంలో హేతుబద్ధత పాటించాలి: వడ్డీ రేట్లు క్రమబద్ధీకరించబడినప్పటికీ, కొన్ని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు-మైక్రో ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు-ఎంఎఫ్‌ఐ) అధిక నికర వడ్డీ మార్జిన్‌లను పొందుతున్నట్లు కనిపిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. ఈ సంస్థలు తమ వడ్డీ రేట్లను నిర్ణయించేటప్పుడు రుణగ్రహీతల స్తోమత, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని దాస్ సూచించారు.

అన్‌సెక్యూర్డ్ రుణాల్లో నెమ్మది: ఖారా
అన్‌సెకూర్డ్ రుణ మంజూరీల విషయంలో ఆర్‌బీఐ నిబంధనల కఠినతరం ప్రభావం ఎస్‌బీఐపై కొంచెం ప్రతికూల ప్రభావం చూపుతుందని బ్యాంకింగ్ ఎస్‌బీఐ చెర్మన్ దినేష్ కుమార్ ఖారా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 'అధిక రిస్క్ కేటాయింపుల' ప్రభావం డిసెంబర్ త్రైమాసికంలో ఎస్‌బీఐ నికర వడ్డీ మార్జిన్‌లపై 0.02-0.03 శాతం మేర ఉంటుందని అన్నారు. అయితే తదుపరి త్రైమాసికంలో పరిస్థితి మెరుగుపడుతుందన్న భరోసాను వెలిబుచ్చారు. వ్యక్తిగత రుణాలపై వడ్డీరేట్లు కూడా పెరుగుతాయని స్పష్టం చేశారు.



ఎఫ్‌ఐబీఏసీ 2023 నివేదికను ఆవిష్కరిస్తున్న గవర్నర్ శక్తికాంత దాస్, ఇతర ప్రముఖులు.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేషనల్ ఫెర్టిలైజర్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

జాబ్స్ ఇన్ఫో

భారత ప్రభుత్వానికి చెందిన అతిపెద్ద ఎరువుల ఉత్పత్తి సంస్థ నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్‌ఎఫ్‌ఎల్).. పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా నోయిడాలోని ఎన్‌ఎఫ్ఎల్ దేశ వ్యాప్తంగా ఉన్న యూనిట్లు, కార్యాలయాల్లో 74 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాలకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. డిగ్రీ, సీఏ, ఎంబీఏ విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్ 1తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 74(విభాగాల వారీగా.. మేనేజ్‌మెంట్ ట్రైనీ (మార్కెటింగ్)-60, ఎఫ్ అండ్ ఏ-10, లా-04 పోస్టులు)

అర్హతలు

- **మేనేజ్‌మెంట్ ట్రైనీ(మార్కెటింగ్):** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు రెండేళ్ల ఫుల్ టైమ్ ఎంబీఏ/పీజీడీబీఎం/పీజీడీఎం మార్కెటింగ్/అగ్రి బిజినెస్ మార్కెటింగ్/రూరల్ మేనేజ్‌మెంట్/ఫారిన్ ట్రేడ్/ఇంటర్నేషనల్ మార్కెటింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో పాసవ్వాలి.
- **మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎఫ్ అండ్ ఏ):** ఈ పోస్టులకు సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి.
- **మేనేజ్‌మెంట్ ట్రైనీ లా:** ఈ ఉద్యోగాలకు మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ లేదా బీఎల్ డిగ్రీ/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఫుల్‌టైమ్ ఎల్ఎల్‌బీ లేదా బీఎల్ డిగ్రీ 60% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 50% మార్కులు పొందాలి.
- ఎన్‌ఎఫ్‌ఎల్ ఉద్యోగులు కరస్పాండెన్స్/పార్ట్ టైమ్ డిగ్రీ/డిప్లొమా 50 శాతం మార్కులతో పాసైనా సరిపోతుంది.

వయసు

31.10.2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఆఫ్‌లైన్ ఓఎంఆర్ విధానంలో నిర్వహించే అర్హత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పరీక్షలో మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 100 ప్రశ్నలు సంబంధిత అకడమిక్ సబ్జెక్టుల నుంచి అడుగుతారు.జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ జనరల్ నాలెడ్జ్/అవేర్‌నెస్‌కు సంబంధించిన 50 ప్రశ్నలు ఉంటాయి. నెగిటివ్ మార్కుల విధానం లేదు.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఓఎంఆర్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఈ సమాచారాన్ని అభ్యర్థికి ఎస్ఎంఎస్‌తోపాటు ఈమెయిల్ ఐడీకి తెలియజేస్తారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు సెకండ్ ఏసీ రైల్వే/బస్ ఛార్జీలను చెల్లిస్తారు.

తుది ఎంపిక

ఓఎంఆర్ టెస్ట్, ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా కేటగిరీల వారీగా అభ్యర్థుల తుది జాబితాను రూపొందిస్తారు. ఆఫ్‌లైన్ ఓఎంఆర్ బేస్డ్ టెస్ట్‌కు-80 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం మార్కులు కేటాయించారు. అభ్యర్థులు రెండింట్లోనూ 50 శాతం మార్కులు సాధించాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 01.12.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 3, 4 డిసెంబర్ 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

స్టార్టప్ ఆఫర్స్‌కు..'సై'!

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్.. ఐటీ సంస్థల్లో కొలువులు.. లక్షల్లో ప్యాకేజీలు! ఇంజనీరింగ్ విద్యార్థుల దృష్టంతా ప్లేస్‌మెంట్స్‌పైనే ఉంటుంది. మూడో ఏడాది నుంచే క్యాంపస్ డ్రైవ్స్‌లో విజయానికి సన్నద్ధమవుతుంటారు! కానీ.. ఈ ఏడాది టెక్ కంపెనీల్లో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ తగ్గొచ్చనే అంచనా అభ్యర్థులకు ఆందోళనకు గురిచేస్తోంది!! మరోవైపు స్టార్టప్స్ టాలెంట్ కోసం క్యాంపస్‌లకు వెళ్లనున్నట్లు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ట్రెండ్స్, స్టార్టప్ ఆఫర్స్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విశ్లేషణ..

» ఎంఎన్‌సీల ఫ్రెషర్స్ హైరింగ్‌పై అనుమానాలు
» ఐటీ సంస్థల్లోనూ ఫ్రెషర్స్ నియామకాల్లో తగ్గుదల
» స్టార్టప్ సంస్థల ఆఫర్స్ పెరగనున్నట్లు అంచనా
» స్టార్టప్స్‌లో చేరికపై అభ్యర్థుల్లో సందిగ్ధత

ఐటీ దిగ్గజాల వెనుకంజ

ఈ ఏడాది క్యాంపస్ డ్రైవ్స్‌లో ఫ్రెషర్స్ హైరింగ్స్‌కు ఐటీ సంస్థలు వెనుకంజ వేస్తున్నట్లు ఆయా కంపెనీల ప్రకటనల ద్వారా స్పష్టమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ప్రతికూల ఆర్థిక పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఐటీ దిగ్గజ సంస్థలుగా పేరొందిన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ తదితర సంస్థలు ఫ్రెషర్స్ హైరింగ్ దాదాపు ఉండకపోవచ్చనే విధంగా ఇప్పటికే సంకేతాలిచ్చాయి. ఇన్ఫోసిస్ సంస్థ.. ఈ ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా ఫ్రెషర్స్ నియామకాలు ఉండవని స్పష్టం చేసింది. హెచ్‌సీఎల్‌లో గత ఆర్థిక సంవత్సరంలో 28 వేల మంది ఫ్రెషర్స్‌ను ఈ సంస్థ నియమించుకోగా.. ఈ ఏడాది ఆ సంఖ్య పది వేలకు మించే అవకాశంలేదు. ఇదే తీరు ఇతర ఐటీ కంపెనీల్లోనూ కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బెంచ్ ట్యాలెంట్ ఎక్కువగా

ఇప్పటికే ఆయా సంస్థల్లో బెంచ్‌పైన ఉన్న నిపుణులతోపాటు గతేడాది ఆఫర్ లెటర్లు అందుకొని.. శిక్షణ పూర్తి చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో వీరితోనే మానవ వనరుల కొరతను పూడ్చుకోవాలని కంపెనీలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదే విధంగా కంపెనీల్లో అట్రిషన్ రేటు కూడా గత ఏడాదితో పోల్చితే బాగా తగ్గిందని.. ఇది కూడా ఫ్రెషర్స్ నియామకాలపై ప్రభావం చూపుతుందనే వాదన వినిపిస్తోంది.

స్టార్టప్ ఆఫర్స్

- ఒకవైపు ఐటీ సంస్థల్లో.. నియామకాల్లో అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లో స్టార్టప్ సంస్థలు మాత్రం ఆఫర్లు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నాయి.
- ఫిక్కీ-రాండ్ స్టాండ్ నివేదిక ప్రకారం-ఈ ఏడాది స్టార్టప్ సంస్థలు మానవ వనరుల సంఖ్య పెంచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. ఈ సంస్థల్లో గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం 30శాతం మేరకు నియామకాలు పెరగనున్నాయి.
- పలు స్టార్టప్ సంస్థలు ఎంబీఏ కళాశాలలు, ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్, రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

విద్యార్థుల్లో సందిగ్ధత

ఐటీ కంపెనీల్లో నియామకాలు తగ్గుతూ..స్టార్టప్ సంస్థల్లో పెరిగే అవకాశం కనిపిస్తోంది. దీంతో స్టార్టప్ ఆఫర్స్‌ను అంగీకరించాలా వద్దా అని విద్యార్థులు తర్జనభర్జన పడుతున్నారు. స్టార్టప్స్‌లో వేతనాలు తక్కువగా ఉండడం, ఆ సంస్థల సక్సెస్‌పై సందిగ్ధతే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. ఒకవేళ స్టార్టప్ సంస్థ విజయం సాధించకపోతే అది తమ కెరీర్‌కు ప్రతికూలంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు.

మరికొందరు భిన్నంగా

స్టార్టప్ ఆఫర్లపై కొంత మంది అభ్యర్థులు వెనకంజ వేస్తుంటే.. మరికొందరు మాత్రం స్టార్టప్ ఆఫర్లను అందుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్టార్టప్ సంస్థల్లో చేరితే తమ సృజనాత్మకతను, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వీలవుతుందని వీరు భావిస్తున్నారు. నూతన ఉత్పత్తుల రూపకల్పన, రీసెర్చ్, ఇన్నోవేషన్ పరంగా సదరు స్టార్టప్స్ తమకు అవకాశం కల్పిస్తాయని అంచనావేస్తున్నారు. అందుకే వేతనం తక్కువైనా.. స్టార్టప్ ఆఫర్లు అందుకునేందుకు సిద్ధమవుతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.

అవగాహనతో మేలు

స్టార్టప్ ఆఫర్స్‌ను ఆమోదించే క్రమంలో అభ్యర్థులు ముందుగా సదరు సంస్థ పనితీరు, మార్కెట్ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. అక్కడ పనిచేస్తున్న మానవ వనరుల సంఖ్యను తెలుసుకోవడం ద్వారా సదరు స్టార్టప్ గమనంపై ఒక అంచనా వచ్చేందుకు ఆస్కారం లభిస్తుంది. వీలైతే అక్కడ పని చేస్తున్న సిబ్బందిని సంప్రదించి వాస్తవ పరిస్థితులు తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

పని సంస్కృతి

స్టార్టప్ కంపెనీలో ఆఫర్‌కు ఆమోదం తెలిపే ముందు.. అక్కడి పని వాతావరణంపై స్పష్టత పొందాలి. తమకు పని వాతావరణంలో ఇన్నోవేషన్ పరంగా స్వేచ్ఛ ఉంటుందా లేదా అనేది తెలుసుకోవాలి. ఒకవేళ అలాంటి సంస్కృతి తక్కువగా ఉందంటే ఆ ఆఫర్‌కు 'నో' చెప్పడమే మేలని నిపుణులు సూచిస్తున్నారు. వాస్తవానికి అధికశాతం స్టార్టప్స్‌లో సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం లభిస్తుందని చెబుతున్నారు. కొన్ని సంస్థల్లో మాత్రం నిర్దేశిత నమూనాలో పని విధానాలు ఉంటాయని పేర్కొంటున్నారు.



ఆర్థిక ప్రయోజనాలు

స్టార్టప్ ఆఫర్స్‌ను ఆమోదించే క్రమంలో అభ్యర్థులు తమకు అందించే ప్యాకేజ్ గురించి ముందుగానే తెలుసుకోవాలి. కొన్ని స్టార్టప్ సంస్థలు భారీగా ప్యాకేజీ ప్రకటించినా.. అందులో 40 నుంచి 50 శాతం మాత్రమే నగదు రూపంలో అందిస్తున్నాయి. మిగతా మొత్తాన్ని ఈక్విటీలు, స్టాక్ ఆప్షన్స్ కేటాయింపు వంటి విధానాలను అనుసరిస్తుంటాయి. కాబట్టి అభ్యర్థులు తమ వాస్తవ అవసరాలు, కంపెనీలు అందించే ప్యాకేజీ తీరుతెన్నుల గురించి తెలుసుకోవాలి. నగదు రూపంలో అందించే మొత్తం తమ అవసరాల మేరకు ఉందని భావిస్తేనే సదరు ఆఫర్‌ను అంగీకరించడం మేలు.

స్టార్టప్ సవాలే

స్టార్టప్ సంస్థలంటే అప్పుడే ప్రారంభించిన కంపెనీలు. ప్రొడక్ట్స్, సర్వీస్‌ల గురించి లక్ష్యాలు నిర్దిష్టంగా ఉన్నప్పటికీ.. వాటి అమలు, కార్యాచరణ ప్రాథమిక దశలోనే ఉంటాయి. వీటికి వాస్తవ రూపమిచ్చి పనిచేయడం సవాల్‌తో కూడుకున్న వ్యవహారం. కంపెనీలు తాము ఆఫర్ ఇచ్చిన అభ్యర్థుల నుంచి ఎంతో ఆశిస్తాయి. కాబట్టి ఆమేరకు వాస్తవ ఆసక్తి ఉంటేనే స్టార్టప్ సంస్థల ఆఫర్‌ను ఆమోదించాలి. దీంతోపాటు తమ స్కిల్ సంస్థ ఆఫర్ చేస్తున్న జాబ్ ప్రొఫైల్‌కు సరితూగుతుందో లేదో ముందుగానే పరిశీలించుకోవాలి.

బాలికల చదువుకు భరోసా

» ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్‌లకు ప్రకటన విడుదల
» ఎంపికైతే ఏటా రూ.50వేలు ఉపకార వేతనం
» డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థినులు అర్హులు



ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక చేయూతలేక చాలా మంది అమ్మాయిలు చదువులకు దూరమవుతున్నారు. ఇటువంటి విద్యార్థినులు ఉన్నత విద్యను కొనసాగించేలా ఆర్థిక భరోసాను ఇస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) స్కాలర్‌షిప్‌లను ఇస్తోంది. ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్ పేరిట ఏటా అర్హులైన విద్యార్థినులకు రూ.50వేల ఉపకార వేతనాన్ని అందిస్తోంది. డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుతున్న వారు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్య:** 10,000. డిప్లొమా స్థాయిలో 5000 మందికి, ఇంజనీరింగ్ స్థాయిలో 5000 మందికి చొప్పున వీటిని అందిస్తారు.

తెలుగు రాష్ట్రాలకు

దేశ వ్యాప్తంగా అందించే ఈ స్కాలర్‌షిప్‌లకు రాష్ట్రాలవారీ కోటా ఉంటుంది. దీని ప్రకారం-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిప్లొమా చదివే 318 మందికి, తెలంగాణలో 206 మందికి వీటిని అందిస్తారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో ఏపీ నుంచి 566 మందిని, తెలంగాణ నుంచి 424 మందిని ఈ స్కాలర్‌షిప్స్ కోసం ఎంపిక చేస్తారు. ఈ స్కాలర్‌షిప్స్ కూడా రిజర్వేషన్ ప్రకారం అందిస్తారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయింపులు చేస్తారు.

అర్హతలు

- ఏఐసీటీఈ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో డిప్లొమా లేదా బీటెక్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి.
- ఆయా కోర్సుల్లో ఫస్ట్ ఇయర్ లేదా లేటరల్ ఎంట్రీలో సెకండ్ ఇయర్‌లో చేరినవాళ్లే ఈ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు అర్హులు.
- ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలకు మాత్రమే దరఖాస్తుకు అవకాశం ఉంటుంది.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.8 లక్షలకు మించి ఉండరాదు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జతచేయాల్సి ఉంటుంది.

ఏటా రూ.50వేలు

ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థినులకు ఏటా రూ.50 వేలను అందిస్తారు. డిప్లొమా వారికి మూడేళ్ల పాటు, ఇంజనీరింగ్ కోర్సులు చదువుతున్నవారికి నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం చెల్లిస్తారు. లేటరల్ ఎంట్రీలో చేరిన డిప్లొమా కోర్సుల విద్యార్థినులకు రెండేళ్లు, లేటర్ ఎంట్రీ ఇంజనీరింగ్‌లో చేరితే మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. ఈ మొత్తం నేరుగా విద్యార్థిని బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తారు. దీన్ని ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం వెచ్చించుకోవచ్చు. అకడెమిక్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా తర్వాతి ఏడాది వీటిని కొనసాగిస్తారు.

ఎంపిక ఇలా

డిప్లొమా అభ్యర్థులైతే పదోతరగతిలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఇంజనీరింగ్‌లో చేరినవారైతే ఇంటర్‌లో సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకుని ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31.12.2023
- **వెబ్‌సైట్:** https://scholarships.gov.in

క్లుప్తంగా...

శబరిమలకు మరో 22 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): శబరిమల అయ్యప్పను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం డిసెంబర్, జనవరి నెలల్లో మరో 22 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ–కొట్టాయం (07137) డిసెంబర్ 1, 8, 29, జనవరి 12, 19 తేదీల్లో ప్రతి శుక్రవారం రాత్రి 10.50 గంటలకు విజయవాడలో బయలుదేరి, శనివారం రాత్రి 10 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07138) డిసెంబర్ 3, 10, 31, జనవరి 14, 21 తేదీల్లో ప్రతి ఆదివారం మధ్యరాత్రి 1 గంటకు కొట్టాయంలో బయలుదేరి, సోమవారం మధ్యరాత్రి 2 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. విజయవాడ–కొట్టాయం (07139) డిసెంబర్ 15, 22, జనవరి 5 తేదీల్లో శుక్రవారం సాయంత్రం 4.25 గంటలకు విజయవాడలో బయలుదేరి, శనివారం రాత్రి 10 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07143) డిసెంబర్ 17, 24, జనవరి 7 తేదీల్లో ఆదివారం మధ్య రాత్రి 1 గంటకు కొట్టాయంలో బయలుదేరి, సోమవారం ఉదయం 6.15 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. సికింద్రాబాద్–కొల్లాం (07141) డిసెంబర్ 8, జనవరి 12, 19 తేదీల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, శనివారం రాత్రి 7.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07142) డిసెంబర్ 9, జనవరి 13, 20 తేదీల్లో శనివారం రాత్రి 11 గంటలకు కొల్లాంలో బయలుదేరి, సోమవారం ఉదయం 4.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ముగిసిన ఐసెట్ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: ఏపీ ఐసెట్–2023లో భాగంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో తుది దశ ప్రవేశాలు ముగిసినట్టు ఉన్నత విద్యామండలి బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. మొత్తం 22,301 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. ధ్రువ పత్రాల పరిశీలన అనంతరం 20,670 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నట్టు పేర్కొంది. చివరి దశ ప్రవేశాల తర్వాత 17,396 సీట్లు కేటాయించినట్టు వివరించింది.

వీశాట్–2024 నోటిఫికేషన్ విడుదల

విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగభూషణ్



చేబ్రోలు: యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్ద పీట వేయడంలాంటి సమున్నత లక్ష్యాలతో ముందుకెళుతున్నామని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ బుధవారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ 2024–25 సంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లిష్, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం (వీశాట్–2024) నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు తాము దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉందన్నారు. డీన్ అడ్మిషన్స్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి ఏప్రిల్ 30 తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వీశాట్–2024 దరఖాస్తును ఫిబ్రవరి 25లోగా పూర్తిచేయాలన్నారు. డైరెక్టర్ అడ్మిషన్స్ ఏ. గౌరిశంకరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులందరికీ గత ఏడాది నుంచి 25 శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రూ. 2,500 జరిమానా



పోలిపల్లి దుర్గారావు

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ విజయనగరం ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి కే నాగమణి బుధవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. కేసు వివరాలను ఆమె వెల్లడించారు. భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన పోలిపల్లి దుర్గారావు నాలుగేళ్ల వయసున్న బాలికపై 2020 నవంబర్ 25న లైంగిక దాడికి యత్నించాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో దిశ పోలీస్ స్టేషన్‌లో 2020 నవంబర్ 26న పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదైంది. అప్పటి దిశ మహిళా పీఎస్ డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసును ప్రాధాన్యత కేసుల జాబితాలో చేర్చారు. నిందితుడు దుర్గారావు బాలికపై లైంగికదాడికి పాల్పడినట్టుగా నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు జడ్జి సెక్షన్ 376 (ఎ,బి) ఐపీసీ ప్రకారం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధితురాలికి నష్టపరిహారంగా రూ.5 లక్షలను ప్రభుత్వం అందజేయాలని తీర్పులో సూచించారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



విజయనగరం జిల్లా మొయిదలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు



అన్నమయ్య జిల్లా ఈడిగపల్లెలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, తదితరులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బాలాంత్రంలో పథకాల వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు



అనంతపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య



ఎన్టీఆర్ జిల్లా నందిగామలో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్



పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం గుమ్ములూరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



అనకాపల్లి జిల్లా యలమంచిలిలో డిస్ ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



శ్రీకాకుళం జిల్లా చాకిపల్లి సచివాలయం పరిధిలో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న పార్టీ నాయకులు



చిత్తూరు జిల్లా నిండ్ర మండలం వేదాంతపురంలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బిల్లేకల్లులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

నేడు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా

జూలై–అక్టోబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులకు ఆర్థిక సాయం

- 10,511 జంటలకు రూ.81.64 కోట్లు జమ
- బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: చదువులకు మరింత ఊతమిస్తూ వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ఆర్థిక సాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేయనున్నారు. ఈ ఏడాది జూలై–అక్టోబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 10,511 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ. 81.64 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించడానికి అండగా నిలుస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కళ్యాణమస్తు ద్వారా, మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే.

పిల్లలు పెద్ద చదువులు చదవాలన్న ఆలోచనతో

పేదల పిల్లలు పెద్ద చదువులు చదవాలన్న ఆలోచనతో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాలకు అర్హతలు నిర్ణయించారు. వధూవరులిద్దరు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలి. బాల్య వివాహాల నివారణకు పెళ్లి నాటికి అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు దాటి ఉండాలన్న నిబంధన పెట్టారు. ఇప్పుడు అందిస్తున్న సాయంతో కలిపి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఇప్పటి వరకు 46,062 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 348.84 కోట్లు ప్రభుత్వం జమ చేసింది.

దాదాపు రెండింతల సాయం..

- గత ప్రభుత్వం 17,709 మంది లబ్ధిదారులకు ఇస్తామని చెప్పి రూ.68.68 కోట్లు ఎగ్గొట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ కేటగిరీలలో ఆర్థిక సాయాన్ని దాదాపు రెండింతలు పెంచింది.
- ఎస్సీలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.40,000 కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సాయం రూ.1,00,000.
- కులాంతర వివాహం ఎస్సీలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.75,000 కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,20,000 ఆర్థిక సాయం చేస్తోంది.
- ఎస్టీలకు టీడీపీ ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.50,000 కాగా, ఈ ప్రభుత్వం రూ.1,00,000 అందిస్తోంది.
- బీసీలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.35,000 కాగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.50,000 అందిస్తోంది.
- కులాంతర వివాహం చేసుకున్న బీసీలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.50,000 కాగా, ప్రభుత్వం అందిస్తున్న సాయం రూ.75,000.
- కులాంతర వివాహం చేసుకున్న ఎస్టీలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.75,000 కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,20,000 సాయం అందిస్తోంది.
- మైనార్టీలు, దూదేకులు, నూర్ బాషాలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.50,000 కాగా, ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సాయం రూ.1,00,000.
- విభిన్న ప్రతిభావంతులకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.1,00,000 కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దానిని రూ.1,50,000లకు పెంచింది.
- భవన, ఇతర నిర్మాణ కార్మికులకు చంద్రబాబు ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.20,000 కాగా, దానిని ప్రస్తుత ప్రభుత్వం రూ.40,000లకు పెంచింది.

ఇప్పటి వరకూ జమ మొత్తం ఇలా..

విడత	తేదీ	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
మొదటి విడత	10.02.2023	4,536	38.28
రెండవ విడత	05.05.2023	12,132	87.32
మూడవ విడత	09.08.2023	18,883	141.60
నాలుగో విడత	23.11.2023	10,511	81.64
మొత్తం లబ్ధిదారులు		46,062	348.84



భారత జట్ల హవా

- అండర్–19 క్రికెట్ టోర్నీలో ఇంగ్లండ్‌పై భారత్–ఏ విజయం
- బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్ల తేడాతో భారత్–బి గెలుపు



బంగ్లాదేశ్ జట్టుపై బ్యాటింగ్ చేస్తున్న భారత్ బి క్రీడాకారుడు

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ అండర్–19 క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ మ్యాచ్‌లు మూలపాడులో రసవత్తరంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన రెండు మ్యాచ్‌ల్లో భారత్–ఏ, భారత్–బి జట్లు ఘనవిజయం సాధించాయి. తొలుత టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్–ఏ జట్టు.. ఇంగ్లండ్‌ను 27.5 ఓవర్లలో 142 పరుగులకే ఆలౌట్ చేసింది. బెన్ మెకిన్నీ 57 బంతుల్లో 56 పరుగులు చేశాడు. భారత్–ఏ బౌలర్ సామ్‌కుమార్ పాండే 2.5 ఓవర్లలో 4 వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్–ఏ జట్టు 28.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దిగ్విజయ్ 57 పరుగులు చేయగా.. సౌమ్యకుమార్‌పాండే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్–బి, బంగ్లాదేశ్ మధ్య మరో మ్యాచ్ జరిగింది. భారత్–బి బౌలర్లు ధనుష్ గౌడ (5 వికెట్లు), నిషాంత్(4 వికెట్లు) చెలరేగి ఆడటంతో బంగ్లాదేశ్ 23.1 ఓవర్లలో 116 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం భారత్–బి జట్టు 15.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి.. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. భారత్–బి క్రికెటర్ రుద్ర మయూర్ పటేల్ (89 పరుగులు నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కాగా, 5 వికెట్లు పడగొట్టిన ధనుష్‌గౌడ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

యువత భాగస్వామ్యంతో ఆత్మనిర్భర్ భారత్ సాకారం

మిజోరం గవర్నర్ కె.హరిబాబు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న మిజోరం గవర్నర్ హరిబాబు

ఏయూక్యాంపస్: ఆత్మనిర్భర్ భారత్ సాకారం చేయడంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని మిజోరం గవర్నర్ కె.హరిబాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వై.వి.ఎస్ మూర్తి ఆడిటోరియంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా 'విద్యార్థి యువజన ఉద్యమాలు–దేశ ప్రగతిలో యువతకు అవకాశాలు' అంశంపై ఆయన ప్రసంగించారు. హరిబాబు మాట్లాడుతూ.. ఉద్యమాల్లో పాల్గొనే సమయం, ధోరణి నేటి తరం యువతకు లేదన్నారు. ఉద్యమ నాయకత్వం ఎందరినో జాతీయ నాయకులుగా మలిచిన విధానాన్ని ఉదాహరణలతో వివరించారు. తాను, వెంకయ్య నాయుడు ఏయూ విద్యార్థి నాయకులుగా ఇక్కడే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నామన్నారు. రాజ్యసభ పూర్వ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విద్యావంతులు రాజకీయాల్లో అడుగిడితే ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2029 నాటికి ఉన్నత విద్యలో జీఈఆర్‌ని 50 శాతానికి పెంచాలని నిర్ణయించారని, దీనిని సాకారం చేసే విధంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి ప్రసంగించారు. అనంతరం గవర్నర్ హరిబాబును సత్కరించారు.

11 నుంచి వీవీఐటీ 'బాలోత్సవ్–2023'



బాలోత్సవ్ పోస్టర్లు విడుదల చేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్, మల్లిఖార్జునరెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) ప్రాంగణంలో డిసెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు ప్రపంచ తెలుగు బాలల పండుగ 'బాలోత్సవ్–2023' వేడుకలను నిర్వహించనున్నట్లు వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. గుంటూరులోని వీవీ స్కూల్ సిటీ క్యాంపస్‌లో బుధవారం బాలోత్సవ్–2023 పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, అధికార భాషా సంఘం, ఏపీఎస్ఆర్‌టీఎస్ సహకారంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బాలోత్సవ్‌లో భాగంగా కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహకారంతో విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు, సాంకేతిక నమూనాల ప్రదర్శన, ఆధునిక సాంకేతిక విజ్ఞానంపై ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కండె గిరిబాబు మాట్లాడుతూ 20 అంశాల్లో 61 విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బాలోత్సవ్.ఇన్ నుంచి ఎంట్రీ ఫారాలను పొందాలని, పూర్తి చేసిన దరఖాస్తులను పోస్టు, గూగుల్ ఫామ్ ద్వారా పంపాలని సూచించారు. వివరాలకు 7386225336 నంబరులో సంప్రదించాలని తెలిపారు. వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

విలువల నిలయాలు.. సత్యసాయి విద్యాసంస్థలు



మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సాక్షి, పుట్టపర్తి: మానవ సేవే మాధవసేవ అని బోధించిన శ్రీసత్యసాయి సేవలు ఆదర్శనీయమని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అన్నారు. ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ముఖ్య అతిథిగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ చాన్సలర్ కె.చక్రవర్తి, వీసీ ప్రొఫెసర్ బి.రాఘవేంద్రప్రసాద్, మంత్రి ఉష శ్రీ చరణ్, శ్రీసత్యసాయి సెంటర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఎస్ఎస్ నాగానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ సదా సత్యం పలకాలని, సదా ధర్మాన్ని ఆచరించాలన్న బాబా వాక్కులను నిజ జీవితంలో అలవర్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బాబా బోధించిన మానవతా విలువలు, ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు చక్కటి విద్యా వ్యవస్థను నెలకొల్పారని కొనియాడారు. భారతీయ విద్యా విధానంలో అనాదిగా అమలవుతున్న గురుకుల విద్యా విధానానికి మెరుగులుదిద్దుతూ.. నేటి సమాజ అవసరాల మేరకు మార్పులు చేసి నూతన గురుకుల విధానాన్ని అమలయ్యేలా విద్యా వ్యవస్థలను సత్యసాయిబాబా రూపొందించారని చెప్పారు. ఫలితంగా సత్యసాయి విద్యాసంస్థలు విలువల నిలయాలుగా నిలిచాయన్నారు. పేద ప్రజలకు వైద్యం, విద్య, మంచినీరు వంటి ఎన్నో సేవలు అందించారని ప్రశంసించారు. బాబా సేవలను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు సూచించారు.

విలువలతో కూడిన విద్య

గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ప్రేమ, సాధన అలవర్చుకుని జీవితంలో అభివృద్ధి చెంది దేశానికి సేవలు అందించాలని సూచించారు. శ్రీసత్యసాయిబాబా విద్యాసంస్థల్లో నేటి ఆధునిక విద్యతో పాటు సమగ్ర సమైక్యతను నెలకొల్పే ప్రాచీన కాల గురుకుల విద్యావ్యవస్థను కూడా పాటిస్తూ విలువలతో కూడిన విద్యనందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులందరూ ధర్మం, సత్యాన్ని, ధర్మో రక్షిత రక్షితః అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన శ్రీసత్యసాయిబాబా విద్యాసంస్థలకు చెందిన 21 మందికి రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమం అనంతరం ట్రస్టు సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు. అంతకుముందు రాష్ట్రపతి.. సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. స్నాతకోత్సవంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, కలెక్టర్ పి.అరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే యువ శాస్త్రవేత్తలు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: విద్యార్థులను యువశాస్త్రవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ అన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించాలని సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌పై రాష్ట్ర స్థాయి సదస్సు బుధవారం విజయవాడలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 577 మంది ల్యాబ్ ఇన్‌చార్జులు, జిల్లాల సైన్స్ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష తరఫున విద్యాభివృద్ధికి అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ ఏడాది సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు ముగ్గురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జపాన్ వెళ్లడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 713 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉండగా వాటిల్లో 577 ప్రభుత్వ పాఠశాలల్లో, 31 ల్యాబ్స్ 'హబ్ ఏటీఎల్'గా గుర్తించినట్టు చెప్పారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ దీపాలి ఉపాధ్యాయ్ మాట్లాడుతూ.. అటల్ టింకరింగ్ ల్యాబ్ వినియోగంలో దేశంలో ఏపీ ముందంజలో ఉందని అభినందించారు. నీతి ఆయోగ్ ఇన్నోవేషన్ లీడ్ ప్రతీక్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ యునిసెఫ్, విజ్ఞానాశ్రమ్, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్తంగా ఒకే తాటిపై సమర్థంగా కలిసి పనిచేయడం ద్వారా మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే సైన్స్ ల్యాబ్ వినియోగంలో ఏపీ ముందంజలో ఉందని ప్రశంసించారు. ఎడ్యుకేషన్ బోర్డ్ కమ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సీఈవో–సెక్రటరీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవ కుమార్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోసం విద్యార్థులు చేసే ప్రాజెక్టులను స్కూళ్లు స్వాగతించాలని కోరారు. సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 9, 10 తరగతుల విద్యార్థులకు యూట్యూబ్, విజ్ఞానాశ్రమ్ రూపొందించిన వీడియోల ద్వారా సైన్స్ ప్రయోగాలు చూపిస్తే త్వరలో ఆకళింపు చేసుకుంటారని తెలిపారు. అనంతరం 'అటల్ టింకరింగ్ ల్యాబ్' నిర్వహణకు 13 సూచికలతో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు నమూనాల ఎగ్జిబిషన్‌ను అధికారులు పరిశీలించారు.

ఎన్‌ఆర్‌ఐ కోటాలో పీజీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఐ, ఇన్‌లైవ్ ఆఫ్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తెలిపిన చివరి తేదీని పొడిగిస్తూ డిసెంబర్ 5వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా గుంటూరులోని లాంఫాంలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం–522034కు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

పట్టపగలే భార్యపై భర్త హత్యాయత్నం

- చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలో కొడవలితో దాడి
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న భార్య

చెళ్లకెరె రూరల్: పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్ ముందు పట్టపగలే ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తాలూకాలోని చెన్నమ్మనాగతిహళ్లి గ్రామానికి చెందిన కుమారస్వామి అనే 27 ఏళ్ల యువకుడికి, 25 ఏళ్ల వయస్సుగల ఆశాకు మూడేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల పాటు వారి కాపురం అన్యోన్యంగా సాగింది. వారికి ఇంకా సంతానం కాలేదు. గత ఏడాది కాలంగా దాంపత్య జీవితంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తి గొడవలు కావడం వల్ల దంపతులు వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలో భార్య ఆశా విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఆమెపై కోపంతో భర్త కుమార్ ఆమెను అంతమొందించాలని కక్ష పెంచుకున్నాడు. బుధవారం కోర్టు వాయిదాకు హాజరు కావడానికి ఒంటరిగా వచ్చిన భార్య ఆశా బస్సు దిగి బస్టాండ్ నుంచి బయటకు వచ్చింది.

బస్టాండ్ వద్దే మాటు వేసిన భర్త

ఆ వెంటనే అప్పటికే అక్కడ కొత్త కొడవలిని కొనుగోలు చేసి మాటు వేసి ఉన్న భర్త కుమారస్వామి నడి బజారులోనే కొడవలితో ఆమెపై దాడి చేసి తల, మెడపై నరికి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయిన స్థానికులు భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన కుమార్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తక్షణమే ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు రక్తగాయాలతో విలవిల్లాడుతున్న క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో తాలూకా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందింపజేశారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన చిత్రదుర్గ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న ఆస్పత్రి వైద్యులు ఆమె ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలిపారు. కాగా ఇలాంటి నీచ కృత్యానికి పాల్పడిన భర్తకు కఠిన శిక్ష విధించాలని స్థానికులు ఒత్తిడి చేశారు. స్థలానికి డీఎస్పీ టీబీ రాజన్న, ఇతర అధికారులు చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై చెళ్లకెరె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కుమారస్వామికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు


ప్రాణాంతక దాడికి గురైన మహిళ ఆశా


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా

సామాజిక పరివర్తనకు నాంది కావాలి

బళ్లారిఅర్బన్: పాఠశాల విద్యార్థులకు విద్యను అందించడమే కాకుండా సామాజిక పరివర్తనకు నాంది కావాలని మాజీ ఎంపీ, వికాస్ అకాడమి అధినేత బసవరాజ్ పాటిల్ సేడం అభిప్రాయపడ్డారు. జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థ(చాంబర్ ఆఫ్ కామర్స్) కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2003 సేడంలో ప్రారంభించిన కొత్తల బసవేశ్వర విద్యా సంస్థకు ఇన్ఫోసిస్ రూ.10 కోట్ల విరాళంతో పాటు గ్రామాల్లో 12 వేల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ విప్లవానికి దారి తీసిందన్నారు. ఇది దేశ వ్యాప్తంగా ఆ ప్రాజెక్టు విస్తరణకు దారి తీసిందన్నారు. ప్రతి విద్యా సంస్థ ఈ పాఠశాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులకు తగు సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మహారుద్రగౌడ, గౌరవ అధ్యక్షులు కే.సీ సురేష్‌బాబు, ఉపాధ్యక్షులు యశ్వంత్‌రాజ్, దొడ్డనగౌడ, సొంతా గిరిధర్, పదాధికారులు మల్లికార్జునగౌడ, వీ.రామచంద్ర, నాగళ్లి రమేష్, పదాధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు బసవరాజ్ పాటిల్ సేడం

పాఠశాల అంతస్తు నుంచి పడి విద్యార్థి మృతి

సాక్షి,బళ్లారి: విజయపుర జిల్లాలో పాఠశాల మొదటి అంతస్తు నుంచి పడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. బుధవారం జిల్లాలోని ఇండి పట్టణంలోని ఆర్.ఎం.షా పాఠశాలలో యూకేజీ చదువుతున్న శివరాజ్(5) అనే బాలుడు ప్రమాదవశాత్తు పాఠశాల మొదటి అంతస్తు నుంచి కాలు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా, బాలుడు మృతి చెందాడు. దీంతో పాఠశాల సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం తెలియజేశారు. విద్యార్థి తల్లి దండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఆస్పత్రికి చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ మృతి చెందాడని రోదించారు. ఈ ఘటనపై విజయపుర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శివరాజ్(ఫైల్)

దొంగల ముఠా సభ్యుని అరెస్ట్

- పరారీలో ముగ్గురు నిందితులు

బళ్లారి అర్బన్: స్థానిక బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగలముఠా సభ్యుడిని పట్టుకున్న పోలీసులు అతని నుంచి కారుతో పాటు 48 మొబైల్ ఫోన్లను స్వాధీనపరచుకున్నారు. బ్రూస్‌పేట్ సీఐ ఎంఎన్.సింధూర్ తెలిపిన వివరాలు..ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న బ్రూస్‌పేట్ ఎస్ఐ సవితారాణి, క్రైం సిబ్బందిని చూసి కారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తుల్లో ముగ్గురు నిందితులు పరారయ్యారు. కారులో ఉన్న కర్నూలు జిల్లాకు చెందిన బింగదొడ్డి మనోహర్‌ను పట్టుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. పరారైన నిందితులను కర్నూలు జిల్లాకు డోన్ తాలూకా చెందిన కొండపేట నాని, శివ, పవన్‌గా గుర్తించారు. వీరు ముఠాగా ఏర్పడి కారులో బళ్లారి, హొసపేట, గంగావతి బస్టాండ్‌లు, ఇతర చోట్ల ఏడాది నుంచి ఈ నలుగురు వ్యక్తులు దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. రూ.3 లక్షల కారుతో పాటు రూ.5.24 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన మొబైల్‌లతో పాటు మొత్తం రూ.8.24 లక్షల విలువ చేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.


స్వాధీనపరచుకున్న కారు, మొబైల్ ఫోన్లతో బ్రూస్‌పేట్ పోలీసు అధికారులు, సిబ్బంది

బొగ్గు అక్రమ నిల్వలపై చర్యలేవీ?

రాయచూరు రూరల్: ఆర్టీపీఎస్, వైటీపీఎస్‌ల నుంచి విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బొగ్గును అక్రమంగా నిల్వ ఉంచిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని అంబేడ్కర్ దళిత సేన డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు కృష్ణ మాట్లాడారు. అధికారులతో చేతులు కలిపి అక్రమంగా రూ.4 లక్షల విలువ చేసే బొగ్గును అక్రమంగా నిల్వ ఉంచిన కాంట్రాక్టర్, అధికారులపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

సంతకాల సేకరణ

రాయచూరు రూరల్: దేశ వ్యాప్తంగా నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) అమలు కావాలని సంతకాల సేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏబీవీపీ కార్యకర్తలు విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా దాదాపు 1540 మంది విద్యార్థులు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

రైతులకు పట్టు మొక్కల పంపిణీ


మొక్కలను అందిస్తున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున

కంప్లి: హరపనహళ్లి తాలూకా పంచాయతీ ఆధ్వర్యంలో నరేగ యోజన ద్వారా మహిళా స్వసహాయ సంఘం పరంగా పెంచిన పట్టు(రేషం) మొక్కలను బుధవారం ఎమ్మెల్యే లతా మల్లికార్జున పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నరేగ యోజన ద్వారా మహిళలు స్వావలంబులై వ్యవసాయ పనుల్లో నిమగ్నులు కావటం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంత మహిళా రైతులు మరింత శ్రద్ధతో వ్యవసాయ పనుల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు.

రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దుదాం

హొసపేటె: రక్తహీనతతో బాధపడుతున్న వారికి తగిన వైద్యం అందించి విజయనగర జిల్లాకు రక్తహీనత రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు తెలిపారు. బుధవారం నగరంలో రక్తహీనత, ఉచిత పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తహీనత ఉన్న 6 నెలల నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలకు తగిన చికిత్స అందిస్తామన్నారు. విజయనగర జిల్లాలో మొత్తం 3,03,217 మంది లబ్ధిదారులు ఉండగా వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని సన్నాహాలు చేసిందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారికి తగిన వైద్యం, మందులు ఉచితంగా అందించాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి ఎల్ఆర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ రక్తహీనత ఉచిత పౌష్టికాహార కార్యక్రమాన్ని జిల్లాలో ఉద్యమ రూపంలో నిర్వహిస్తామన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు తగు పరీక్షలు చేసి వైద్యం అందజేస్తామన్నారు. దీంతో పాటు గర్భిణులు, బాలింతలను కూడా పరీక్షించి వారి ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం, ప్రతి చోటా ఆరోగ్యమే ఈ క్యాంపెయిన్ ధ్యేయమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జంబయ్య పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, విద్యార్థులు, ఇతర అధికారులు

అక్రమ నిల్వలపై కమిటీ విచారణ

రాయచూరు రూరల్: రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం(ఆర్టీపీఎస్), యరమరస్ థర్మల్ విద్యుత్ కేంద్రం(వైటీపీఎస్) నుంచి విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బొగ్గును అక్రమంగా నిల్వ ఉంచిన అధికారులు, కాంట్రాక్టర్లపై త్రిసభ్య కమిటీ అధికారుల బృందం విచారణ చేసింది. విద్యుత్ శాఖా మంత్రి కేజే జార్జ్ తీసుకున్న చొరవతో ప్రభుత్వం నియమించిన ఈ విచారణ కమిటీ బుధవారం బెంగళూరు నుంచి రావడంతో కాంట్రాక్టర్లు, అధికారులకు భయం పట్టుకుంది. అక్రమంగా రూ.4 లక్షల విలువ చేసే బొగ్గును నిల్వ చేసిన కాంట్రాక్టర్లు, అధికారులను విచారణ జరిపారు. మంచి బొగ్గునే దొంగిలించారని, నిల్వ చేసిన బొగ్గు చలిస్తున్న రైలు నుంచి కిందపడింది కాదని నివేదికలో పేర్కొంటామని కమిటీ అధికారులు తెలిపారు. గత మూడేళ్ల నుంచి ఇలా బొగ్గును దొంగిలిస్తున్నట్లు సమాచారం సేకరించామని, ఈ నివేదికను 3 రోజుల్లో కేపీటీసీఎల్ ఎండీకి అప్పగిస్తామని వారు తెలిపారు.


విచారణ చేస్తున్న కమిటీ సభ్యుల బృందం

ఘనంగా ధర్మవరం రామకృష్ణమాచార్య జయంతి

బళ్లారిఅర్బన్: స్థానిక రాఘవ కళామందిరంలో బుధవారం సాయంత్రం బళ్లారి రాఘవ మెమోరియల్ అసోసియేషన్, డీఆర్‌కే రంగసిరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం రామకృష్ణమాచార్యుల 171వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ మంజునాథ్, విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ అధ్యక్షతన జయంతిని ప్రారంభించారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులపై కసాప మాజీ అధ్యక్షుడు సిద్ధరామ కల్మట్ ఉపన్యాసం చేశారు. బళ్లారికి చెందిన రంగస్థల కళాకారుడు శివరుద్రయ్య స్వామికి వేషభూషణ డీఆర్‌కే రంగసిరి పురస్కారం అందించారు. బయలాట కళాకారుడు ముద్దటనూరు తిప్పేస్వామి, దాసవాణి సుగమ సంగీత పండిత్ రాఘవేంద్ర గుడదూరు, సంగీత విద్వాంసుడు బీ.కాసింవలి, విజయ్‌కుమార్, తబల హర్షాచారి, విష్ణు హడపద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యతో తాగునీరు దూరం

కంప్లి: సండూరు ప్రజల జీవనాడి నారిహళ్ల జలాశయం. ఈ జలాశయంలో తగినంత నీటి నిల్వ ఉంది. ఈ నీటిని శుద్ధీకరించి ప్రజలకు అందించేందుకు జలశుద్ధీకరణ విభాగం కూడా ఉంది. అయితే ఇక్కడ నుంచి రక్షిత నీటిని ప్రజలకు అందించాలంటే విద్యుత్ సమస్య ప్రజల పాలిట శాపంగా మారింది. పట్టణంలో సుమారు 40 వేలకు పైగా జనాభా ఉంది. గతంలో వర్షాలు లేకున్నా పురసభ వారు రెండు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేసేవారు. అయితే వర్షాలు ఎక్కువగా కురిసి నారిహళ్ల జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతున్నా సక్రమంగా ఫిల్టర్ నీటిని సరఫరా చేయక పోవడంపై ప్రజలు నిలదీస్తున్నారు.

వేడుకగా బసవణ్ణ విగ్రహావిష్కరణ

హొసపేటె: కొట్టూరు స్వామి సంస్థానమఠం సంగనబసవ స్వామీజీ స్వర్ణ మహోత్సవం సందర్భంగా బుధవారం సిద్ధిప్రియ కళ్యాణ మంటపం వద్ద విశ్వగురు బసవణ్ణ అశ్వారూఢ విగ్రహావిష్కరణను రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కాంస్య విగ్రహావిష్కరణ ముందు వివిధ తాలూకాల నుంచి వచ్చిన నంది కోలు, పగటి వేషాలు, డోలు కుణితతో పాటు వివిధ కళాకారులు ప్రదర్శించిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకొన్నాయి. మంత్రి మాట్లాడుతూ సుమారు 12 అడుగుల ఎత్తైన ఈ కాంస్య విగ్రహాన్ని తాను ప్రారంభించడం తన అదృష్టమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప, బసవలింగ స్వామీజీతో పాటు రాజకీయ నేతలు, సమాజ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


బసవణ్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

అయోధ్యకు త్వరలో రైలును ప్రారంభిస్తాం

గంగావతి: గంగావతి నుంచి ఉత్తర్ ప్రదేశ్‌లోని అయోధ్యకు నూతన రైలును త్వరలో ప్రారంభిస్తామని కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడిసంగణ్ణ భరోసానిచ్చారు. ఆయన గంగావతి రైల్వే స్టేషన్‌లో తాజాగా టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రైల్వే శాఖా మంత్రితో కలిసి గంగావతి నుంచి అయోధ్య వరకు రైలు సేవలను ప్రారంభించాలని వినతిపత్రం సమర్పించి చర్చించినట్లు తెలిపారు. ఆయన రాముని జన్మస్థలం అయోధ్య నుంచి ఆంజనేయుని జన్మస్థలం ఉన్న తాలూకా కేంద్రం గంగావతి వరకు నూతన రైలును ప్రారంభించేందుకు సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో ఈ విషయంపై కేబినెట్‌లో చర్చించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గంగావతి నుంచి వాడి వరకు నూతన రైలు మార్గం నిర్మించేందుకు సర్వే జరుగుతోందన్నారు. ఈ రైలు మార్గం వల్ల కొప్పళ జిల్లాలోని అన్ని తాలూకాలకు రైలు సౌకర్యం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, పార్టీ నేతలు రాఘవేంద్ర శెట్టి, చంద్రప్ప ఉప్పార, రైల్వే డీఆర్ఎం సంజయ్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ కరడి సంగణ్ణ

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీనివాసపురం: భావిభారత పౌరులైన విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రధాన సివిల్ జడ్జి బీకే మను అన్నారు. బుధవారం తాలూకాలోని హోదలి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బాలల దినోత్సవం, న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మౌలిక హక్కులు, ఏ చట్టాన్ని ఏ సమయంలో ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. చట్ట పరిజ్ఞానం ఉంటే సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. న్యాయవాది ఎం. నాగరాజ్, బీఈఓ భాగ్యలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి హెచ్ ఆర్ సచిన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

కోలారు: సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా చట్టాలపై అవగాహన కల్గించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు సునీల్ ఎస్. హొసమని తెలిపారు. బుధవారం సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంచుకుని విద్యార్థులు సత్పౌరులుగా రూపొందాలన్నారు. ఇటీవల మాదక వస్తువులు, పొగాకు ఉత్పత్తులకు ఎక్కువగా బానిసలు అవుతుండడం ఆందోళనకరమన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి తగిన అవగాహన కలిగించాలన్నారు. ఇదే సమయంలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు, బాల్య వివాహ నిషేధ చట్టాల గురించి తెలియజేశారు. ప్యానెల్ న్యాయవాది కేఆర్ ధన్‌రాజ్, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రమీలాకుమారి పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

వైభవంగా లక్షార్చన


లక్షార్చన నిర్వహిస్తున్న దృశ్యం

మాలూరు: చారిత్రక ప్రసిద్ధ యాత్రాస్థలం చిక్కతిరుపతిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్షార్చన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. లక్షార్చన సందర్భంగా ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి విశేష పూజలను చేశారు. ప్రధాన అర్చకులు రవి, గోపాలకృష్ణ భారద్వాజ్, ఎస్.శ్రీధర్‌ల నేతృత్వంలో పూజలను జరిపారు. ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలతో ఊరేగించారు. మధ్యాహ్న 2 గంటలకు మహా మంగళారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. దేవదాయ శాఖ తహసీల్దార్ సుజాత, ఆలయ కార్యనిర్వహణాధికారి సెల్వమణి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ సంస్థాపక దినోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం 15వ సంస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వర్సిటీలో భువనేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించి హరియాణ విశ్రాంత వైస్ చాన్సలర్ వాసుదేవ్ మాట్లాడారు. వ్యవసాయంలో పంటల దిగుబడుల పెంపుదలకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు వ్యవసాయ రంగంపై దృష్టి సారించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. విద్యతో పాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చాన్సలర్ హనుమంతప్ప, సభ్యులు కొట్రేశప్ప, త్రివిక్రం జోషి, వీరనగౌడ, శ్రీధర్, సునీల్, మహాంత గౌడ, అధికారులు పాటిల్, దేశాయి, నాయక్, గురురాజ్, నేమిచంద్ర, సత్యనారాయణ, ప్రమోద్ కట్టి, జాగృతి, రవి, శివశరణప్ప తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్టేటస్.. ఇద్దరి అరెస్ట్

హుబ్లీ: ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అవమానించేలా ఫోటో ఎడిట్ చేసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన ఇద్దరు యువకులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. జిల్లాలోని కలఘటిగి తాలూకా అసరంబి గ్రామ అష్ఫక్ షౌకత్ అలీ(23), రుతిక్ షరీఫ్ సాబ్(22) నిందితులు. వీరి వివాదాస్పద స్టేటస్‌ను గమనించిన ఆ గ్రామస్తులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. హిందూ సంఘాల నేత పరశురామ హులికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరేగౌడ

కంప్లి: బళ్లారిలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణబైరేగౌడ మార్గమధ్యంలో కూడ్లిగి తాలూకా కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా కార్యాలయంలో తహసీల్దార్‌తో పాటు సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని గమనించి ఒక్కసారిగా తహసీల్దార్‌పై కోపోద్రిక్తులయ్యారు. కార్యాలయ పనివేళలు ప్రారంభమై గంట దాటినా సిబ్బంది ఎందుకు విధులకు హాజరు కాలేదు. తహసీల్దార్‌గా మీకు బాధ్యత లేదా? అని నిలదీశారు. దీంతో తహసీల్దార్ సమాధానం చెప్పలేక గుటకలు మింగారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: జిల్లాలో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ అభిప్రాయ పడ్డారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు అపౌష్టికతకు దూరంగా ఉండాలన్నారు. జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి సురేంద్ర బాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చేతన్ కుమార్‌లున్నారు.

పెండింగ్ పనుల పూర్తికి సూచన


మాట్లాడుతున్న రవిశంకర్

రాయచూరు రూరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి డాక్టర్ జె.రవిశంకర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మందకొడిగా సాగుతున్న ఐసీడీఎస్ పథకం పనులపై అధికారులకు సూచనలు జారీ చేశారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, ఏడీసీ దురుగేష్, ఏసీ మెహబూబి, రోణ, ప్రకాష్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి సురేంద్రబాబు, ఐసీడీఎస్ అధికారి చేతన్‌లున్నారు.

గురుపాదేశ్వరుడికి పూజలు


పూజలందుకున్న గురుపాదేశ్వరుడు

రాయచూరురూరల్: నగరంలో గురుపాదేశ్వరుడి 23వ పుణ్యారాధన నిర్వహించారు. బుధవారం కిల్లే బృహన్మఠంలో మఠాధిపతి శాంతమల్ల శివాచార్య గురుపాదేశ్వర మూల విరాట్‌కు అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళ హారతి నెరవేర్చారు. అనంతరం గురుపాదేశ్వరుని భక్తులకు అన్నప్రసాదం చేశారు.

కార్యవర్గం ఎంపిక


ఎంపికైన వారిని పూలమాలతో సత్కరిస్తున్న సభ్యులు

కంప్లి: తెక్కలకోటెలోని మణిగెరి మసీదు ఆవరణలో నూతనంగా కర్ణాటక రాష్ట్ర నదాఫ్ పింజార సంఘం కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా బాషా, ఉపాధ్యక్షులుగా ఎస్.బందేనవాజ్ దేవనూరు షాషావలి, చాంద్ మహబూబ్ బాషా, మహిళా ఉపాధ్యక్షులురాలుగా ఎస్.షేకస్ బీ, కార్యదర్శిగా ఎంజీ ఖాదర్‌బాషా, సహకార్యదర్శిగా అబ్దుల్‌ఖాదర్ జిలానీలతో పాటు సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం నూతన పదాధికారులను పూలమాలలతో సత్కరించారు.

నరేగతో కూలీకార్మికులకు ఉపాధి


మాట్లాడుతున్న అధ్యక్షుడు ఆంజనేయ

గంగావతి: నరేగ పథకం ద్వారా మహిళలు, పురుష కూలీకార్మికులు ఉపాధి పొందవచ్చని బసాపట్న గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఆంజనేయ తెలిపారు. జీపీ కార్యాలయంలో బుధవారం నరేగ పథకంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేగ పథకం ద్వారా చెరువుల్లో పూడికను తొలగించవచ్చన్నారు. మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టవచ్చని వివరించారు. పీడీఓ విద్యావతి, తాలూకా ఐఈసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

30న కనక జయంతిని ఘనంగా జరపాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: కనక జయంతిని ఈనెల 30న ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జయంతి నిర్వహణపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతిలో తాలూకాలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. జయంతిని ఈసారి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామన్నారు. ప్రతి జీపీ నుంచి కనకదాసు చిత్రపటంతో కూడిన పల్లకీని తెచ్చి పట్టణంలో ఊరేగించేలా పీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. తహసీల్దార్ సుధీంద్ర మాట్లాడుతూ కార్యక్రమంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభాన్విత కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు డాక్టర్ మంజునాథ రెడ్డి, డాక్టర్ విశ్వనాథ్, వైఎన్ సత్యనారాయణ, బీవీ మునిరెడ్డి, ఏ భైరారెడ్డి, కృష్ణప్ప, కేసీ మంజునాథ్, రామతీర్థ పాల్గొన్నారు.